TS-11-0036701

# నేటి చర్చ
జాతీయ తెలుగు దిన పత్రిక

ఆత్మవిశ్వాసంతో
పని చేసే మనిషి ఎప్పటికైనా
విజయం సాధిస్తాడు
- సోక్రటీస్

## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై స్పందించే తత్వం మీకుందా..? సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు, అక్రమాలకు అక్షర రూపమిచ్చి బాధితులకు అండగా నిలబడే ధైర్యం మీకుందా..? మీకోసమే చర్చన్యూస్ ఎదురుచూస్తోంది. కలం బలంతో ముందుకు సాగుదాం. తెలంగాణ వ్యాప్తంగా చర్చ దినపత్రికలో రాష్ట్రం, జిల్లాలు, నియోజకవర్గ, మండలాల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఉత్సాహవంతులైన యువతి, యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

నేటి చర్చ జాతీయ తెలుగు దిన పత్రిక

సంప్రదించవలసిన ఫోన్ నంబర్ 99666 41155

తెలంగాణ , సంపుటి : 01 సంచిక : 71 మంగళవారం, నవంబర్ 10, 2026 , పేజీలు - 12 వెల : 2/-

# పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

- కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి నిప్పులు
- పాలమూరుకు నీళ్లు ఇవ్వలేదు.. పరిశ్రమలు తీసుకురాలేదు
- పదేళ్లలో రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారు
- తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్‌గా నిలపడమే నా లక్ష్యం
- ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోలేదు
- గత పాలకులు మారినా పాలమూరు ప్రజల తలరాతలు మారలేదు



కొడంగల్,నవంబర్ 9 :తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపేందుకు తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నానని వెల్లడించారు. మిగతా2లో...



## చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

- జెలెన్‌స్కీతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని మోదీ
- శాంతి ప్రయత్నాలకు భారత్ సంపూర్ణ మద్దతు
- మానవతా దృక్పథానికే ప్రాధాన్యమని స్పష్టీకరణ
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపైనా ఇరువురు నేతల చర్చ

న్యూఢిల్లీ,నవంబర్ 9 : రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతియుత పరిష్కారం కనుగొనాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో ప్రధాని ఫోన్‌లో మాట్లాడారు. కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, తాజా పరిణామాలపై ఇరువురు నేతలు చర్చించారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా చేపట్టే అన్ని ప్రయత్నాలకు భారత్ తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా మిగతా2లో...

## వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్
# దంపతుల ముగింపు

- వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ అన్నా కొణిదెల ముగింపు!
- పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం
- పిల్లల బాధ్యతలు కొనసాగిస్తాం.. వ్యక్తిగత గోప్యతను గౌరవించండి



అమరావతి,నవంబర్ 9 : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, ఆయన భార్య అన్నా కొణిదెల తమ వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. పరస్పర అవగాహన, గౌరవంతో విడిపోతున్నట్లు ఇద్దరూ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.జీవితంలో ఎంతోకాలం కలిసి ప్రయాణించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని వారు వెల్లడించారు. భార్యాభర్తల బంధం ముగిసినప్పటికీ మంచి స్నేహితులుగా కొనసాగుతామని తెలిపారు. తమ పిల్లలకు అంకితమైన తల్లిదండ్రులుగా బాధ్యతలు నిర్వర్తిస్తామని, వారి సంతోషం, మిగతా2లో...

## పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్‌ను
# ఖండించిన కేటీఆర్

- కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అడ్డుకోవడం అప్రజాస్వామికమని విమర్శ



హైదరాబాద్,నవంబర్ 9 : కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టును తీవ్రంగా ఖండించారు. కోస్గిలో మృతి చెందిన పార్టీ కార్యకర్త కుటుం బాన్ని పరామర్శించేందుకు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు వెళ్తున్న నరేందర్‌రెడ్డిని పరిగి బహార్‌పేట్ చౌరస్తా వద్ద అరెస్ట్ చేయడం మిగతా2లో...

## తెలంగాణలో జనగణనకు
# ముహూర్తం ఖరారు

- జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనాభా లెక్కల సేకరణ..
- జనవరి 10 నుంచి స్వీయ జనగణనకు అవకాశం




హైదరాబాద్,నవంబర్ 9 : తెలంగాణ రాష్ట్రంలో జనగణన-2027 నిర్వహణకు ప్రభుత్వం తేదీలను ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 155ను జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జనగణన నోటిఫికేషన్‌ను రాష్ట్ర గెజిట్‌లో పునఃప్రచురిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో రెండో విడతలో భాగంగా జనాభా లెక్కల సేకరణను 2027 జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు నిర్వహించనున్నారు. అంతకుముందు ప్రజలు స్వయంగా తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకునేందుకు జనవరి 10 నుంచి 24 వరకు అవకాశం కల్పించారు. ఈ స్వీయ జనగణన ప్రక్రియను ప్రత్యేక యాప్, వెబ్‌సైట్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు.స్వీయ జనగణన గడువు ముగిసిన అనంతరం జనవరి 25 నుంచి జనగణన సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణ పూర్తయిన తర్వాత వివరాల మిగతా2లో...



## రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

- కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు తీర్పు.. అప్పీల్ కోసం నాలుగు వారాలపాటు శిక్ష అమలు నిలిపివేత

హైదరాబాద్,నవంబర్ 9 : కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా అమలు చేయలేదని తేల్చిన తెలంగాణ హైకోర్టు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డికి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించింది. జస్టిస్ కె. లక్ష్మణ్ ఈ మేరకు కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై తీర్పు మిగతా2లో...

## అందరి సహకారంతోనే
# కరీంనగర్ అభివృద్ధి

- రాజకీయాలకు అతీతంగా పనిచేద్దాం : బండి సంజయ్, పొన్నం ప్రభాకర్


2లో

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కృత్రిమ మేధ ఆధారిత దాడులతో ఆర్థిక సంస్థలకు ముప్పు: సీపీ సజ్జనార్

వివరాలు 2లో

## జనవరిలో ఐదు రాష్ట్రాల
# ఎన్నికల నగారా!

- యూపీ, పంజాబ్, గోవా, మణిపూర్, ఉత్తరాఖండ్‌లో అసెంబ్లీ ఎన్నికలు



2లో

# పాలమూరుకు నీళ్లివ్వని గత పాలకులు

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం కొడంగల్ నియోజకవర్గంలో నిర్వహించిన రైతన్నతో ఆత్మీయ సభలో రైతులతో మాట్లాడిన ఆయన, పాలమూరు ప్రాంత అభివృద్ధి, గత ప్రభుత్వ పాలన, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై పలు వ్యాఖ్యలు చేశారు. **ఎందరో నాయకులు వచ్చినా పాలమూరు బతుకులు మారలేదు**గతంలో ఎంతోమంది నాయకులు, మంత్రులు పాలమూరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించినప్పటికీ ఈ ప్రాంత ప్రజల తలరాతలు మారలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. పాలమూరు ప్రజలు ఎప్పటినుంచో సాగునీరు, వలసల కోసం నాయకులను అడుగుతూనే ఉన్నారని తెలిపారు. అయినా ఈ జిల్లాకు అవసరమైన నీళ్లు, వలసలు అందించలేకపోయారని విమర్శించారు. పాలమూరులో సాగునీటి సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వలసలు కొనసాగాయని, రైతుల పొలాలకు నీరు అందని పరిస్థితి నెలకొందని గుర్తుచేశారు. **కేసీఆర్ పాలమూరు రుణం తీర్చుకుంటారని ఆశించాం**గతంలో పాలమూరు ప్రజలు కేసీఆర్‌ను ఎంపీగా గెలిపించి గుండెల్లో పెట్టుకున్నారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. పాలమూరు నుంచే ఎంపీగా గెలిచిన కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఈ ప్రాంతానికి న్యాయం చేస్తారని భావించామని చెప్పారు. పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటారని, ఈ ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేసి రైతులకు నీరందిస్తారని ఆశించామని తెలిపారు. అయితే ఆ ఆశలు నెరవేరలేదని విమర్శించారు. **మా గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారు** కేసీఆర్ పాలమూరు ప్రజలకు కనీస కృతజ్ఞత చూపలేదని రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను గెలిపించి, ముఖ్యమంత్రి స్థాయికి తీసుకెళ్లిన పాలమూరు ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. పాలమూరు జిల్లాపై కక్ష పెంచుకున్నారని, ఈ ప్రాంతానికి చుక్కనీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు ప్రజల గుండెలపై తన్ని కృష్ణా నదిలో పడేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. **రూ.8.15 లక్షల కోట్ల అప్పుల భారం** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రంపై రూ.8.15 లక్షల కోట్ల అప్పులు చేశారని ముఖ్యమంత్రి ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పులమయం చేశారని విమర్శించారు. ఇంతటి అప్పుల భారంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడం తమ ప్రభుత్వానికి సవాలుగా మారిందని చెప్పారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఇబ్బందుల్లోకి నెట్టిందని ఆరోపించారు. **ఉద్యోగులకు ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నాం** తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టే సమయానికి ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించే పరిస్థితి కూడా లేదని రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న అప్పుల సమస్యను అధిగమించేందుకు తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ప్రభుత్వ వ్యవస్థలను గాడిలో పెడుతూ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పాలనను సక్రమంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**తెలంగాణను సంబర్‌పన్‌గా తీర్చిదిద్దుతాం**

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. పాలమూరు ప్రాంత ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తెలంగాణను దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే తమ లక్ష్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# తెలంగాణలో జనగణనకు ముహూర్తం ఖరారు

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలన, సవరణల కోసం మార్చి 1 నుంచి 5 వరకు పునఃపరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారు.

ఈ జనగణనకు 2027 మార్చి 1వ తేదీ అర్ధరాత్రి 12 గంటలను ప్రామాణిక తేదీగా నిర్ణయించారు.కేంద్ర హోంశాఖ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం జారీ చేసిన నోటిఫికేషన్‌కు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది.

ఉత్తర్వులను అన్ని శాఖల అధికారులు, జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లు, జనగణన అధికారులకు పంపించారు.ఇప్పటికే తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా తయారీ, గృహ గణన ప్రక్రియను మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించారు. ప్రస్తుతం రెండో విడత జనాభా లెక్కల సేకరణకు అవసరమైన ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. జనగణన ద్వారా సేకరించే వివరాలు ప్రభుత్వ పథకాల రూపకల్పన, అభివృద్ధి ప్రణాళికలు, వనరుల కేటాయింపులకు ఉపయోగపడనున్నాయి.

# అందరి సహకారంతోనే కరీంనగర్ అభివృద్ధి

**కరీంనగర్, నవంబర్ 9 :** కరీంనగర్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధి పనులకు కొందరు కావాలనే అడ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శించారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి అమృత్ పథకం కింద రూ.17 కోట్లు, పట్టణ సవాళ్ల నిధి కింద రూ.80 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, ఆ తర్వాత జిల్లా అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయా లని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని, విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలోని 23, 25, 26, 46వ డివిజన్లలో రూ.4.5 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### కృత్రిమ మేధ ఆధారిత దాడులతో ఆర్థిక సంస్థలకు ముప్పు: సీపీ సజ్జనార్

**హైదరాబాద్, నవంబర్ 9 :** బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, త్వరిత వస్తు సరఫరా సంస్థలు తమ సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని సీపీ సజ్జనార్ సూచించారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో దాడులకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా కృత్రిమ మేధ ఆధారిత దాడుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.కృత్రిమ మేధ సాధనాలతో సంస్థల నెట్‌వర్క్‌లలోని లోపాలను గుర్తిస్తున్న నేరగాళ్లు,



చెల్లింపు వ్యవస్థలను దుర్వినియోగం చేసి ఇతరుల ఖాతాల ద్వారా నగదును మళ్లిస్తున్నారని తెలిపారు. వినియోగంలో లేని పాత సాంకేతిక అనుసంధానాలను తొలగించాలని, సాఫ్ట్‌వేర్‌ను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించే వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని, ఉద్యోగులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని కోరారు.సైబర్ దాడులను ఎదుర్కొనేందుకు ముందస్తు పరీక్షలు నిర్వహించాలని, ఐటీ, సైబర్ భద్రతా బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వారు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సజ్జనార్ తెలిపారు.

# దీపావళి పాగతో క్షీణించిన గాలి నాణ్యత!

- విజయవాడలో 112 డెసిబుల్స్‌కు చేరిన శబ్ద తీవ్రత.. ఢిల్లీలో 400కు ఎక్యూఐ

**అమరావతి,నవంబర్ 9 :**దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చడంతో ఆంధ్రప్రదేశ్‌లో వాయు, శబ్ద కాలుష్యం పెరిగింది. విశాఖపట్నం, రాజమహేంద్రవరం నగరాల్లో గాలి నాణ్యత క్షీణించింది. రాష్ట్రంలోని 15 ప్రాంతాల్లో గాలి నాణ్యత సూచీ (ఎక్యూఐ) 101 నుంచి 200 మధ్య నమోదైంది.విశాఖపట్నంలో గరిష్ఠ శబ్ద తీవ్రత 111 డెసిబుల్స్‌కు చేరగా, విజయవాడలో 112 డెసిబుల్స్ నమోదైంది. తిరుపతిలో అత్యధికంగా 191 ఎక్యూఐ నమోదైంది. నెల్లూరులో 175, శ్రీకాకుళంలో 170, ఏలూరులో 118గా నమోదయ్యాయి. అమరావతి, విజయవాడ, గుంటూరు, అనంతపురం ప్రాంతాల్లోనూ గాలి నాణ్యత ఒక్కసారిగా పడిపోయింది.దేశ రాజధాని ఢిల్లీలో ఎక్యూఐ 400కు చేరడంతో పరిస్థితి ఆందోళన కరంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని లోనీలోనూ గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి పడిపోయింది.



పీఎం2.5, పీఎం10 ధూళి కణాల స్థాయిలు అధికంగా నమోదయ్యాయి.ఎక్యూఐ 101 నుంచి 200 మధ్య ఉంటే ఆస్తమా, ఊపిరితిత్తులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. కాలుష్యాన్ని పర్యవేక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా గాలి నాణ్యత, శబ్ద తీవ్రత కొలిచే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి వెల్లడించింది. విశాఖలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపింది.

## చర్చలు, దౌత్యంతోనే యుద్ధానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని మోదీ పునరుద్ఘాటించారు. **మానవతా దృక్పథానికే ప్రాధాన్యం** ప్రస్తుత సంక్షోభంలో భారత్ మానవతా దృక్పథంతో వ్యవహరిస్తోందని మోదీ తెలిపారు. యుద్ధం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని శాంతి స్థాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. వివాదాన్ని పరిష్కరించుకోవడానికి చర్చలు, దౌత్యమే సరైన మార్గమని భారత్ మొదటి నుంచీ చెబుతోందని గుర్తుచేశారు. శాంతియుత పరిష్కారం కోసం జరిగే ప్రయత్నాల్లో భారత్ భాగస్వామ్యం కావడానికి సిద్ధంగా ఉందని జెలెన్‌స్కీకి తెలిపారు. **అబుధాబి సమావేశంపై జెలెన్‌స్కీ వివరణ**మోదీతో మాట్లాడిన విషయాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వెల్లడించారు. తాజా దౌత్య పరిణామాలు, అబుధాబిలో జరగనున్న సమావేశానికి ఉక్రెయిన్ చేస్తున్న సన్నాహాల గురించి ప్రధానికి వివరించినట్లు తెలిపారు. యుద్ధాన్ని ముగించేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉందని, రష్యా కూడా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ముందుకు రావాలని అన్నారు. ఇది యుద్ధాన్ని కొనసాగించే సమయం కాదని, ముగించాల్సిన సమయమని మోదీ పలుమార్లు స్పష్టం చేసినట్లు జెలెన్‌స్కీ గుర్తుచేశారు. **ధాన్యం రవాణాకు భారత్ సహకారం కోరిన జెలెన్‌స్కీ** నల్ల సముద్రం మీదుగా ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు ఏర్పడుతున్న అంశాన్ని కూడా జెలెన్‌స్కీ ప్రస్తావించారు. ఆహార భద్రతకు విఘాతం కలగకుండా ధాన్యం రవాణా కోసం ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మధ్యవర్తిత్వం వహించేందుకు భారత్ సిద్ధంగా ఉందని, న్యూఢిల్లీ తన ప్రయత్నాలను కొనసాగిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం ఎగుమతులకు ఆటంకాలు తొలగించడం ద్వారా ప్రపంచ ఆహార భద్రతకు తోడ్పడవచ్చని అభిప్రాయపడ్డారు. **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చ** భారత్-ఉక్రెయిన్ మధ్య వివిధ రంగాల్లో ద్వైపాక్షిక సహకా రాన్ని మరింత బలోపేతం చేసుకునే అంశాలపై కూడా మోదీ, జెలెన్‌స్కీ చర్చించారు. ఇరు దేశాల ప్రజల పరస్పర ప్రయోజనాల కోసం సహకారాన్ని విస్తరించుకోవాలని నిర్ణయించారు. యుద్ధ పరి ష్కారం తో పాటు శాంతి స్థాపన, మానవతా అంశాలపై భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసింది.

## వైవాహిక బంధానికి పవన్ కల్యాణ్ దంపతుల ముగింపు

(మొదటి పేజీ తరువాయి)

సంక్షేమమే తమ ఉమ్మడి ప్రాధాన్యమని పేర్కొన్నారు.ఈ వ్యక్తిగత మార్పును అర్థం చేసుకుని, తమ గోప్యతను గౌరవించాలని ప్రజలు, అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. ఇంతకాలం తమకు అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. విడిపోవడానికి గల కారణాలను మాత్రం సంయుక్త ప్రకటనలో వెల్లడించలేదు. పవన్ కల్యాణ్, అన్నా 2013 సెప్టెంబర్ 30న వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## జనవరిలో ఐదు రాష్ట్రాల ఎన్నికల నగారా!

**న్యూఢిల్లీ,నవంబర్ 9 :**దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను వచ్చే ఏడాది జనవరి మొదటి అర్ధభాగంలో ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లను ముమ్మరం చేసింది.ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల బృందాలు ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నాయి. పంజాబ్, ఉత్తరాఖండ్, మణిపూర్‌లో పర్యటనలు పూర్త య్యాయి. ఉత్తరప్రదేశ్‌లో ఒక పర్యటన పూర్తికాగా, మరో రెండు పర్యటనలు నిర్వహించాల్సి ఉంది. గోవాలో పర్యటన ఇంకా జరగాల్సి ఉంది. ఈ నెలాఖరులోగా అధికారుల పర్యటనలు పూర్తయ్యే అవకా శం ఉంది.ఆ తర్వాత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఐదు రాష్ట్రాల్లో పర్యటించి ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశ మవుతారు. శాంతిభద్రతలు, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లను సమీక్షిస్తారు. ఉత్తరప్రదేశ్‌లో అధిక నియోజకవర్గాలు ఉండటంతో పలు విడతల్లో పోలింగ్ నిర్వహించే అవకాశం ఉంది. పంజాబ్, గోవా, ఉత్తరాఖండ్‌లో ఒకే విడతలో ఎన్నికలు జరిగే అవకాశమున్నట్లు సమాచారం. అయితే ఎన్నికల తేదీలు, పోలింగ్ విడతలపై ఎన్నికల సంఘం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

వెలువరించారు. అయితే తీర్పుపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును నాలుగు వారాలపాటు నిలిపివేశారు.**నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని వినతి** రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న తమ భూములను తొలగించాలని కొందరు బాధితులు అధికారులను కోరారు. ఈ వినతిని పరిశీలించి 60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని 2025 ఆగస్టులో హైకోర్టు కలెక్టర్‌ను ఆదేశించింది. అయినప్పటికీ నిర్ణీత గడువులో చర్యలు తీసుకోకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు.**అధికారుల వివరణపై న్యాయస్థానం అభ్యంతరం** కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జూలై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ సందర్భంగా కలెక్టర్ సమర్పించిన వివరణలోని అంశాలు, అధికారిక రికార్డుల్లోని వివరాల మధ్య వ్యత్యాసాలను న్యాయస్థానం గుర్తించింది. ఆర్డీఓ, తహసీల్దార్ తదితరుల విచారణకు సంబంధించిన పత్రాల్లో సంతకాలు లేకపోవడాన్ని కూడా ప్రస్తావించింది.కోర్టు ఆదేశాలను తెలిసి కూడా అమలు చేయడంలో ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించారని పేర్కొంటూ కలెక్టర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించింది. ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేసుకునేందుకు నాలుగు వారాలపాటు శిక్ష అమలును నిలిపివేసింది.

## పట్నం నరేందర్ రెడ్డి అరెస్టును ఖండించిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)



కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక, నిరంకుశ వైఖరికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న నాయకుడిని అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం కూడా ఇందిరమ్మ రాజ్యంలో నేరమైందా అని నిలదీశారు.ప్రజా పాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కుతోందని కేటీఆర్ అన్నారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురిచేయడమే పాలనగా మార్చుకుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి కక్షసాధింపు చర్యలకు బీఆర్ఎస్ ఏమాత్రం భయపడదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన, కార్యకర్తల పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. పట్నం నరేందర్‌రెడ్డిని వెంటనే, ఎలాంటి షరతులు లేకుండా విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## ఆటో డ్రైవర్‌తో పెళ్లి.. రాపిడో డ్రైవర్‌తో వివాహేతర సంబంధం.. చివరకు ఇద్దరి ఆత్మహత్య!



**నేటి చర్చ : మండ్య, నవంబర్ 08 ,**కర్ణాటకలోని మండ్య జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. భర్తతో గొడవల నేపథ్యంలో వివాహిత సహాన (27), తన ప్రియుడు రాహుల్‌తో కలిసి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది.బెంగళూరులో ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న వీరేశ్‌ను సహాన ప్రేమించి పెళ్లి చేసుకుంది. వీరికి ఐదేళ్ల కుమార్తె, రెండేళ్ల కుమారుడు ఉన్నారు.ఈ క్రమంలో రాపిడో బైక్ డ్రైవర్ రాహుల్‌తో పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసినట్లు సమాచారం. ఈ విషయం భర్తకు తెలియడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరిగాయి.దీంతో రాహుల్‌తో కలిసి మండ్యకు చేరుకున్న సహాన.. ఇందువాల్ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున రైలు కిందపడి ప్రాణాలు తీసుకుంది.రైల్వే పోలీసులు మృతదేహాలను మార్చురీకి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.తల్లిదండ్రుల నిర్ణయంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు.

## అర్ధరాత్రి మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసరాల్లో సీపీ ఆకస్మిక తనిఖీలు





**రామగుండం పోలీస్ కమిషనరేట్**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అర్ధరాత్రి మంచిర్యాల రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించి, క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్‌తో కలిసి రైల్వే స్టేషన్ పరిసరాలను సందర్శించిన సీపీ, రైల్వే సిబ్బంది, దుకాణాల యజమానులు, ప్రయాణికులతో భద్రతా పరిస్థితులపై ఆరా తీశారు.ఈ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా స్థానిక పోలీసులు చేపడుతున్న రాత్రి పెట్రోలింగ్,నిఘా చర్యలు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పర్యవేక్షణను పరిశీలించారు. అదేవిధంగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు,ఇతర వ్యాపార సంస్థలు నిర్ణీత సమయపాలన పాటిస్తున్నాయా లేదా అనే అంశాన్ని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.రాత్రి వేళల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పోలీస్ నిఘా కొనసాగించాలని, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు ఈ తనిఖీల్లో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు పాల్గొన్నారు.

## కోడిపందేల స్థావరంపై వి.ఎం. బంజారా పోలీసుల దాడి -- ముగ్గురు వ్యక్తులు అదుపులోకి, 3 మోటార్ సైకిళ్లు, 3 కోడిపుంజులు, నగదు స్వాధీనం.

**వి.ఎం. బంజార పోలీస్ స్టేషన్ ఖమ్మం**వి.ఎం. బంజారా పోలీస్ స్టేషన్ పరిధిలోని తల్లపెంట గ్రామ శివారులో గల నరసింహస్వామి చెరువు సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి కోడిపందేలు నిర్వహిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు వి.ఎం. బంజారా పోలీసులు దాడి నిర్వహించారని సిఐ సర్వయ్య తెలిపారు.ఈ దాడిలో కోడిపందేలు నిర్వహిస్తున్న ఏడుగురు వ్యక్తులలో ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి పందేల కోసం ఉపయోగిస్తున్న 3 కోడిపుంజులు, రూ.1,580/- నగదు మరియు 3 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల రాకను గమనించిన మిగిలిన నలుగురు వ్యక్తులు అక్కడి నుండి పరారైనట్లు తెలిసింది.ఈ ఘటనకు సంబంధించి వి.ఎం. బంజారా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరిగింది. కోడిపందేలు, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని,ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలకు ఏవైనా సమాచారం తెలిసినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సిఐ తెలిపారు.

పి ఆర్ వోది

## వేపల గడ్డ తండాలో కలకలం వ్యక్తి అనుమానాస్పద మృతి!



**ఇల్లందు:** ఇల్లందు మండల పరిధిలోని వేపల గడ్డ తండాలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. తండాకు చెందిన భూక్య శివ్లా మృతి చెందగా, ప్రాథమికంగా (ఆత్మహత్య) గా భావిస్తున్నప్పటికీ ఘటనపై గ్రామస్తులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శివ్లా మృతి వెనుక వ్యక్తమవుతున్న కారణాలు మరియు గతంలోనూ ఇదే తరహా ఘటనలు మూడు, నాలుగు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతుండటంతో తండావాసుల్లో ఆందోళన నెలకొంది.ఒకే ప్రాంతంలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం వెనుక కారణాలను వెలికితీయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై ఇల్లందు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, సమగ్ర విచారణ చేపట్టాల్సి ఉంది. మృతదేహాన్ని పరిశీలించి, అవసరమైన వైద్య పరీక్షలు, ఇతర ఆధారాల ద్వారా మృతికి గల కారణాలను నిర్ధారించాల్సి ఉంది. అనుమానాలకు తావులేకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి వాస్తవాలను వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## దీపావళి టపాసుల ప్రమాదాలు.. 32 మందికి కంటి గాయాలు!



**హైదరాబాద్:** దీపావళి వేడుకల్లో టపాసులు పేల్చే సమయంలో జరిగిన ప్రమాదాల కారణంగా 32 మంది కంటి గాయాలతో మెహదీపట్నంలోని ప్రభుత్వ సరోజినీదేవి కంటి ఆసుపత్రిని ఆశ్రయించారు.వీరిలో నలుగురు చిన్నారులు, ఇద్దరు పెద్దలు కలిపి మొత్తం ఆరుగురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మరో 26 మందికి వైద్యులు మందులు అందించి, తదుపరి పరీక్షల కోసం రావాలని సూచించారు.ఈ ప్రమాదాల్లో ఒక బాధితుడు కుడి కంటిలో పూర్తిగా చూపు కోల్పోయినట్లు ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు.ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ ఇబ్రహీం మాట్లాడుతూ.. మరిన్ని కేసులు వచ్చినా చికిత్స అందించేందుకు ఆసుపత్రి సిద్ధంగా ఉందని తెలిపారు. టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ముఖ్య సూచన: వెలిగించిన టపాసులను చేతుల్లో పట్టుకోవడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలి. చిన్నారులతో టపాసులు కాల్చించేటప్పుడు పెద్దలు తప్పనిసరిగా పర్యవేక్షించాలి.సరదా కోసం చేసే చిన్న నిర్లక్ష్యం.. జీవితాంతం చీకటిని మిగల్చకూడదు!

## హార్వెస్టర్ మిషన్లు లీజుకు ఇస్తామని నమ్మించి వ్యక్తిని కిడ్నాప్ చేసి రూ.10 లక్షలు డిమాండ్ -- నలుగురు నిందితులను పట్టుకున్న దోమకొండ పోలీసులు.

**జైలులో పరిచయంతో నేరాలకు పథకం -- నెల రోజుల పాటు నకిలీ పేరుతో ఫోన్‌లో మాటలు -- బాధితుడిని నమ్మించి కారులో కిడ్నాప్ చేసి దాడి, దోపిడి.**
**మద్యం సేవించి నిద్రలోకి జారుకొన్న నిందితులు, వారి చెర నుంచి తప్పించుకున్న బాధితుడు -- మరోసారి కిడ్నాప్‌కు ప్రయత్నిస్తుండగా పోలీసుల పట్టివేత.**
**సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ కెమెరాల పరిశీలనతో నిందితులను గుర్తించి పట్టుకున్న రెండు ప్రత్యేక పోలీసు బృందాలు.**
**నిందితుల వద్ద నుంచి కిడ్నాప్‌కు ఉపయోగించిన ఎర్టిగా కారు, బాధితుడి సెల్‌ఫోన్‌తో పాటు మొత్తం నాలుగు మొబైల్ ఫోన్లు, ఉన్ని టోపీ స్వాధీనం.**






కేసు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ గారు.కోనాపూర్ గ్రామానికి చెందిన చిందం మహేష్ (32) వరి కోత హార్వెస్టర్ మిషన్లను లీజుకు తీసుకొని నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో కరుణాకర్ రెడ్డి అనే పేరుతో ఒక వ్యక్తి పరిచయం చేసుకొని అతని హార్వెస్టర్ మిషన్లు లీజుకు ఇస్తానని నమ్మించినాడని తేదీ 22-10-2026న రాత్రి మాట్లాడుదాం అని పిలిచి కారులో కిడ్నాప్ చేశారని, మార్గమధ్యలో మరో ఇద్దరితో కలిసి బాధితుడి ముఖానికి ఉన్ని టోపీ ని మాస్క్ ల వేసి, దాడి చేసి, చంపేస్తామని బెదిరించి అతని వద్ద ఉన్న ఖాజూ వీ6 5+ సెల్‌ఫోన్, పర్సులోని రూ.2,500 నగదును బలవంతంగా లాక్కున్నారు అని నిందితుల చెర నుంచి తప్పించుకున్న బాధితుడు ఇందల్వాయి బస్‌స్టాండ్‌కు చేరుకొని తన గ్రామస్థులకు సమాచారం అందించాడు. అక్కడి నుండి దోమకొండకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు దోమకొండ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించడం జరిగింది.

జిల్లా ఎస్పీ శ్రీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ శ్రీ మధుసూదన్ గారి పర్యవేక్షణలో భిక్కనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నరేష్, దోమకొండ ఎస్ఐ శ్రీ ప్రభాకర్ మరియు సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో బాధితుడు ఇచ్చిన సమాచారం, సీసీటీవీ కెమెరాల పరిశీలన, సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితులను గుర్తించి పట్టుకునేందుకు పోలీసులు చర్యలని వేగవంతం చేశారు.

కేసు వివరాల్లోకి వెళితే:

నిందితులు నిట్టూ నరసింగ రావు కు ఎరుగు నగేష్, చిందం శ్రీకాంత్ గతంలో జైలులో ఉన్న సమయంలో ఒకరికొకరు పరిచయమై, జైలు నుంచి విడుదలైన అనంతరం సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో డబ్బున్న వ్యక్తిని కిడ్నాప్ చేసి, దాడి చేసి, బెదిరించి డబ్బులు వసూలు చేయాలని పథకం రూపొందించుకున్నారు. ఈ క్రమంలో చిందం శ్రీకాంత్‌కు పరిచయమున్న కోనాపూర్ గ్రామానికి చెందిన చిందం మహేష్ అనే వ్యక్తి దగ్గర డబ్బు, వ్యవసాయం మరియు పిరికి అని అతనిని లక్ష్యంగా ఎంచుకున్నారు. మహేష్ హార్వెస్టర్ మిషన్లను లీజుకు తీసుకొని నడుపుతాడని తెలుసుకొని అదే అదనుతో అతనికి హార్వెస్టర్ మిషన్లు అద్దెకు ఇస్తామని నమ్మించి అతడిని కిడ్నాప్ చేసి అధిక మొత్తములో డబ్బు వసూలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా నిట్టూ నర్సింగరావు కరుణాకర్ రెడ్డి అనే నకిలీ పేరుతో, దొరికిన సిమ్ కార్డ్ ఉపయోగించి సుమారు నెల రోజుల పాటు మహేష్‌తో మాట్లాడి హార్వెస్టర్ మిషన్లు అద్దెకు ఇస్తామని నమ్మించాడు. మరోవైపు నిందితులు ముందుగానే బాధితుడి ఇంటి పరిసరాలు, రాకపోకల మార్గాలను పరిశీలించి పతకం ప్రకారం తెల్లరంగు మారుతి ఎర్టిగా కారును అద్దెకు తీసుకున్నారు. ఈ పథకంలో ఎరుగు నగేష్, నిట్టూ నర్సింగరావు, తెడ్డూ సురేష్ ప్రత్యక్షంగా పాల్గొనగా, చిందం శ్రీకాంత్ గ్రామంలోనే ఉండి బాధితుడి కుటుంబ సభ్యుల కదలికలు, పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయాలను గమనిస్తూ వారికి సమాచారం అందించే బాధ్యత తీసుకున్నాడు.

తేదీ 22-10-2026న నిందితులు కారులో కోనాపూర్ గ్రామానికి చేరుకొని, హార్వెస్టర్ మిషన్లు చూపిస్తామని చెప్పి మహేష్‌ను వారి దగ్గరకు పిలిచి నమ్మించి కారులో ఎక్కించుకొని కిడ్నాప్ చేశారు. కొంతదూరం వెళ్లిన తర్వాత అతడిని ఉన్ని టోపీని మాస్క్‌లా ఏమి కనపడకుండా తొడిగి కాళ్లతో తన్నుతూ, చేతులతో కొడుతూ రూ.10 లక్షలు ఇవ్వాలని లేదంటే చంపేస్తామని బెదిరించారు. అనంతరం బాధితుడి వద్ద ఉన్న POCO వీ6 5+ సెల్‌ఫోన్, పర్సు, అందులోని రూ.2,500 నగదును బలవంతంగా లాక్కొని వివిధ ప్రాంతాల్లో తిప్పుతూ, బయపెడ్తూ, దాడి చేస్తూ డబ్బులు తెప్పించాలని ఒత్తిడి చేశారు. అయితే నిందితులు మద్యం సేవించి, ఇందల్వాయి ఒక దభా హోటల్ వద్ద కారు నిలిపి నిద్రలోకి జారుకున్న సమయంలో బాధితుడు వారి చెర నుంచి తప్పించుకొని బస్‌స్టాండ్‌కు చేరుకున్నాడు. ఈ ఘటన అనంతరం నిందితులు తమ నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఫోన్ చేసి తాము బీహార్‌కు చెందిన వారమని, బాధితుడు తమ మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినందున అతడిని తీసుకెళ్లి బెదిరించి వదిలిపెట్టామని తప్పుడు సమాచారం ఇచ్చి పోలీసుల ను, గ్రామస్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు.

అంతేకాకుండా, బాధితుడు మొదటిసారి కిడ్నాప్ సమయంలో తీవ్ర భయాందోళనకు గురై తనకు ఆడ పిల్లలు కలరు తనకు హాని చేయ వద్దు ఎంతైనా డబ్బులు ఇస్తానని చెప్పినందున, అతడిని మరోసారి కిడ్నాప్ చేసి డబ్బులు వసూలు చేయాలని నిందితులు మరో సారి పథకం వేశారు. ఇందులో భాగంగా తేదీ 09-11-2026న తిరిగి అదే కారును అద్దెకు తీసుకొని కోనాపూర్ గ్రామ శివారులోని ఎల్లమ్మ గుడి వద్ద ఉండగా పోలీసులు కారును అనుమానించి వారిని అదుపులోకి తీసుకొని విచారించగ వారు చేసిన కిడ్నాప్, దోపిడి బయటపడింది.

నిందితుల పూర్తి వివరాలు

A-1: నిట్టూ నర్సింగరావు, తండ్రి :నాగేందహోర్ రావ్, చిట్యాల గ్రామం, తాడ్వాయి ( 3 కేసులు, తాడ్వాయిఖా పరిధిలో 1) భూ వివాదం, 2) హత్యాయత్నం ఉ పేలుడు పదార్థాల కేసు, 3) కిడ్నాప్ ఉ ఆయుధాల చట్టం కేసు A-2: ఎరుగు నగేష్ ఏ నాయేష్, తండ్రి : మహేందర్, గన్నారం గ్రామం, ఇందల్వాయి, నిజామాబాద్ జిల్లా. (ఇందల్వాయిఖా పరిధిలో తన 9 నెలల గర్భవతి గల భార్యను హత్య చేసిన కేసు కలదు.) A-3: తెడ్డూ సురేష్, తండ్రి : బాబయ్య, గన్నారం గ్రామం, ఇందల్వాయి,నిజామాబాద్ జిల్లా.)మెదటి నేరం) A-4: చిందం శ్రీకాంత్, తండ్రి : మల్లయ్య, కోనాపూర్ గ్రామం, బీబీపేట మండలం. )దోమకొండఖా పరిధిలో దొంగతనం కేసు కలదు.(

స్వాధీనం చేసుకున్న వస్తువులు

1. తెల్లరంగు జుఖీఅస్ట్రు కార్ (ఖా 16 జుఖీ 8889)
2. సెల్‌ఫోన్ -- బాధితుడి నుంచి అపహరించినది మరియు (4) నిందితుల సెల్‌ఫోన్స్
3. బాధితుడి ముఖానికి మాస్క్ ల ఉపయోగించిన ఉన్ని టోపీ. 4. ఒక ద్విచక్ర వాహనం.

ఈ కేసును ఛేదించడంలో చురుకుగా పనిచేసిన భిక్కనూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నరేష్, దోమకొండ ఎస్ఐ శ్రీ ప్రభాకర్ మరియు కానిస్టేబుల్ సాయిబాబా , బాలకృష్ణ, భైరవప్రసాద్, హోం గార్డ్ శ్రీకాంత్ లను జిల్లా ఎస్పీ గారు అభినందించారు.

PRO-పోలీసు శాఖ-కామారెడ్డి.

## సినిమా చూడాలంటే భయం! థియేటర్లలో దోపిడీ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా:** జిల్లాలో కుటుంబ సభ్యులతో ఏదైనా సినిమా చూద్దామని వెళ్దామంటే అక్కడున్న రేట్లకు దాంతోపాటు తినుబండారాలకు ఒక్కొక్క సామాన్యుల కుటుంబం పై అధిక భారం పడుతుంది.

1. కుటుంబానికి ?1000 – ?1500 ఖర్చు: టికెట్లు + పార్కింగ్ ం తినుబండారాలు కలిపితే ఒక కుటుంబం లో నలుగురికి సుమారు ?1000 నుండి ?1500 వరకు ఖర్చు అవుతుంది.
2. బయట స్నాక్స్ కు చీ ఱుచీ౯: బయట నుంచి ఏదైనా స్నాక్స్, వాటర్ బాటిల్ తీసుకొని వెళ్తే లోనికి పర్మిషన్ లేదంటూ హుకుం జారీ చేస్తున్నారు. గేట్ దగ్గరే చెకింగ్ పేరుతో లాక్కుంటున్నారు.
3. లోపలే కొనాలనే బలవంతం: “మా థియేటర్లో ఉన్న స్నాక్స్ మాత్రమే తీసుకోవాలి” అని చెబుతున్నారు. ఇది ప్రజల స్వేచ్ఛకు భంగం కాదా?
4. అధిక ధరల దోపిడీ: బయట ?10 – ?20 కు దొరికే వస్తువు థియేటర్లో ?80 – ?100. ?20 పాప్ కార్న్ ?50 – ?100, ?20 వాటర్ బాటిల్ ?40 ఇది దోపిడీ కాక మరేంటి?
5. సామాన్యుడికి భారం: రోజువారీ కూలీ చేసుకునే సామాన్యుడు కుటుంబంతో సినిమాకి వెళ్లాలంటే అది అతనికి మించిన భారము అవుతుంది. సినిమా అంటే వినోదం కాదు, భయం అయిపోయింది.






6. పిల్లల ఆశలు ఆవిరి: పిల్లలు సినిమా చూడాలని అడిగితే తల్లిదండ్రులు జేబు చూసుకుని మౌనంగా ఉండిపోయే పరిస్థితి.
7. పార్కింగ్ దోపిడీ: టికెట్ కంటే పార్కింగ్ ఫీజు ఎక్కువ. బైక్ కు ?30 – ?50,కారుకు ?100 – ?150 వసూలు చేస్తున్నారు. బయట రోడ్డు మీద పెడితే ఫైన్ వేస్తామని బెదిరింపు.
. ఆన్ లైన్ బుకింగ్ లో అదనపు ఛార్జీలు: BookMyShow, Paytm లో బుక్ చేస్తే టికెట్ పైన కన్వీనియన్స్ ఫీజు, ఖూ, ఇంటర్నెట్ హ్యాండ్లింగ్ ఫీజు అంటూ ఒక్కో టికెట్ పై ?30 – ?50 ఎక్ట్రా. 4 టికెట్లకు ?200 ఎక్ట్రా.
9. ఇంటర్వెల్ లో 20 నిమిషాల యాడ్స్: సినిమా కంటే యాడ్స్ ఎక్కువ. ఇంటర్వెల్ అంటే 10 నిమిషాలు కాదు, 20-25 నిమిషాలు యాడ్స్ వేసి స్నాక్స్ కొనిపించే ప్లాన్.
10. వాష్ రూమ్స్, క్లీన్లినెస్ లేదు: ఇంత డబ్బు తీసుకుంటున్నా వాష్ రూమ్స్ దుర్వాసన, సీట్లు చిరిగిపోయి, AC సరిగా లేకపోవడం. డబ్బు తీసుకోవడంలోనే శ్రద్ధ, సౌకర్యాల్లో కాదు.
11. బ్లాక్ లో టికెట్లు: పెద్ద సినిమా రిలీజ్ రోజు కౌంటర్లో టికెట్ లేదు అంటారు, కానీ బయట బ్లాక్ లో ?300 టికెట్ ?500 – ?600 కు అమ్ముతారు. థియేటర్ వాళ్ళకే సంబంధం ఉందనే అనుమానం.
12. చిన్న పిల్లలకు కూడా ఫుల్ టికెట్: 3-4 ఏళ్ళ పిల్లాడికి కూడా ఫుల్ టికెట్ తీసుకోవాలంటున్నారు. పిల్లాడు ఒడిలో కూర్చున్నా వదలరు.
13. ఫుడ్ క్వాలిటీ లేదు: అధిక ధర పెట్టి కొన్నా పాప్ కార్న్ చప్పగా, సమోసా చల్లగా, కూల్ డ్రింక్ లో ఐస్ ఎక్కువ, క్వాంటిటీ తక్కువ

సినిమా సామాన్యుడి వినోదం – దోపిడీ కేంద్రం కాకూడదు!

## 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమంలో భాగంగా అలీసాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీస్ కమిషనర్

5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమంలో భాగంగా అలీసాగర్‌లో నిర్వహించనున్న వాటర్ స్పోర్ట్స్ పోటీలకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను నేడు గౌరవనీయులు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ పి. సాయి చైతన్య, ఐ.పి.యస్., గారు క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అలీసాగర్‌లో వాటర్ స్పోర్ట్స్ పోటీల నిర్వహణకు అనువైన నీటి విస్తీర్ణం , నీటి లోతు , నీటి సామర్థ్యం , పోటీలు నిర్వహించే ప్రాంతం , క్రీడాకారులకు అందుబాటులో ఉండాల్సిన సౌకర్యాలను సమగ్రంగా పరిశీలించారు.అదేవిధంగా పోటీల నిర్వహణ కోసం ఏర్పాటు చేస్తున్న బోట్లు , వాటి పనితీరు , బోట్లను నీటిలోకి దించే ప్రదేశాలు , బోట్లు నిలిపి ఉంచే స్థలాలు , క్రీడాకారులు బోట్ల వద్దకు చేరుకునేందుకు ఏర్పాటు చేస్తున్న మార్గాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పోటీల సమయంలో బోట్ల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ముఖ్యంగా వాటర్ స్పోర్ట్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని , నీటి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని , అవసరమైన చోట్ల భద్రతా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తక్షణమే స్పందించేందుకు రెస్క్యూ బోట్లు , లైఫ్ జాకెట్లు , లైఫ్ గార్డులు , ఈతగాళ్లు , అత్యవసర వైద్య సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.





అలాగే పోటీల నిర్వహణ ప్రదేశంలో క్రీడాకారులు , కోచ్‌లు , సాంకేతిక సిబ్బంది , అధికారుల రాకపోకలకు అనువైన ఏర్పాట్లు చేయడంతో పాటు , ప్రేక్షకుల భద్రత , వాహనాల పార్కింగ్ , తాగునీరు , ఇతర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఐదవ తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026 ముగింపు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా , ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఆదేశించారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొనే పోలీస్ క్రీడాకారులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తూ , పోటీలు సురక్షితమైన వాతావరణంలో పారదర్శకంగా , విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా బోధన్ ఎసిపి శ్రీ శ్రీనివాస్ , బోధన్ రూరల్ సీఐ శ్రీ విజయబాబు , రుద్రూర్ సిఐ శ్రీకృష్ణ , బోధన్ ఎస్సైఓ శ్రీ వెంకటనారాయణ , ఎడపల్లి ఎస్సై శ్రీమతి రమ మరియు స్పోర్ట్స్ విభాగానికి సంబంధించినటువంటి సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

ఇట్లు పోలీస్ పి.ఆర్.ఓ పోలీస్ కార్యాలయం నిజామాబాదు

# చేవెళ్లలోని పాత ఎమ్మార్వో కార్యాలయంలో అగ్నిప్రమాదం..

**కాలిపోయిన డాక్యుమెంట్లు**



చేవెళ్లలోని పాత ఎమ్మార్వో కార్యాలయంలో నిన్న (ఆదివారం) రాత్రి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో భవనంలో నిల్వ ఉంచిన పాత రికార్డులు, ఇతర వస్తువులు అగ్నికి ఆహుతి అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు, షాద్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మంటలను ఫైర్ సిబ్బంది పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. టపాసుల నిప్పురవ్వల వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ఎమ్మార్వో కృష్ణయ్య అనుమానం వ్యక్తం చేశారు. కాలిపోయిన రికార్డులు, ఆస్తి నష్టంపై అధికారులు పరిశీలిస్తున్నారు. పాత ఎమ్మార్వో కార్యాలయంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించిన పలు కేసుల వివరాల డాక్యుమెంట్లు కాలిపోయాయి..

## భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో ప్రమాదకరంగా భారీ గుంత.. అధికారుల,ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం ఎప్పుడు వీడుతుంది?



భద్రాచలం ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు కూతవేటు దూరంలో, అంబేద్కర్ సెంటర్‌లోని సంజయ్ బేకరీ ఎదురుగా ప్రధాన రహదారిపై భారీ గుంత ఏర్పడింది.అది కూడా మూలమలుపులో ఉండటంతో వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిది? అంతేకాకుండా గత కొన్ని నెలలుగా అంబేద్కర్ సెంటర్‌లో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ కూడా పనిచేయడం లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ & బి అధికారులు, ట్రాఫిక్ అధికారులు స్పందించి వెంటనే భారీ గుంతను పూడ్చి, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను పునరుద్ధరించాలి ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని భద్రాచలం ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత అధికారుల బాధ్యత!

# కరెంటుమోటారు లేకుండానే పైకి వస్తున్న నీరు



తెలంగాణ రాష్ట్రం లో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం తీవ్రమై, భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పాలమూరు వంటి కరువు జిల్లాల్లో నేల నెర్రెలు బారాయి. పొలాల్లో వేసిన బోర్లలో సైతం నీరు లేక ఎండిపోతున్నాయి. కానీ.. చలికాలంలో ఎండాకాలం తలపి స్తున్న పరిస్థితుల మధ్య కూడా తెలంగాణ రాష్ట్రం లోని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం గ్రామపంచాయతీ పరిధిలోని పూసుకుపల్లి శివారులో ప్రకృతి చూపించిన ఈ మాయ జలం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేస్తుంది.ఎటు చూసినా నీటి కోసం రైతులు అల్లాడుతున్న వేళ, పూసుకుపల్లి సమీపంలో కరెంటు లేకుండా ఎలాంటి మోటార్ సహాయం లేకుండానే నేల తల్లి కడుపులోంచి నీటి ధారలు ఉబికి వస్తున్నాయి.గత వర్షాకాలంలో రైతులు ఇక్కడ మూడు బోర్లు వేయించినట్లు చెబుతున్నారు. ఈ బోర్లకు మోటార్లు బిగించలేదు. మోట ర్లు లేకపోయినా భూమి నుంచి జల ధారలు ప్రవాహంలా బయటకు పొంగి పొర్లుతుండటం కనువిందు చేస్తోంది.ఒకవైపు ఎండల తీవ్రతకు చుట్టు పక్కల బావులు, బోర్లు బోసిపోతుం టే, ఈ ప్రాంతంలో మాత్రం నిరంతరా యంగా నీరు పైకి రావడం చూసి ప్రజలు ఆశ్చర్యంలో మునిగిపోతున్నారుసాధారణంగా బోర్ల నుంచి నీటిని లాగడానికి విద్యుత్, మోటార్ల పైనే ఆధారపడే పరిస్థితు ల్లో, ఈ విధంగా నేల నుంచి స్వయంభూ వులా జలాలు పొంగిపొర్లడం పూసుకుపల్లి పరిసరాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ అరుదైన ప్రకృతి వింతను, పారే నిర్మల జలధారలను తిలకించేందుకు సమీప గ్రామాల ప్రజలు ఆసక్తిగా తరలివస్తున్నారు. ప్రకృతి సృష్టించిన ఈ విచిత్ర దృశ్యం అందరినీ కట్టిపడే స్తూ, కరువు కోరల్లో నూ ఊరటనిచ్చే ఓ అద్భుతంగా నిలుస్తోంది.

# మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,అరెస్ట్

**వికారాబాద్ జిల్లా:నవంబర్ 09**వికారాబాద్ జిల్లాలో ఒక్కసారిగా రాజకీ యం వేడెక్కింది. ఉద్రిక్త పరిస్థితుల నడుమ కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ బీఆర్ఎస్ నేత పట్నం నరేందర్ రెడ్డిని పరిగి పోలీసు లు అదుపులోకి తీసుకున్నారు. తన సొంత నివాసమైన కొడంగల్‌కు వెళ్తున్న సమయంలో పరిగి లోని బహార్‌పేట్ చౌరస్తా వద్ద పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకున్నారు. తన సొంత నివాసా నికి వెళ్తుంటే ఎందు కు అడ్డుకుంటున్నా రంటూ నరేందర్ రెడ్డి పోలీసులను ప్రశ్నించారు. ఈ సందర్భంగా పోలీసులకు, మాజీ ఎమ్మెల్యేకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తమ ప్రియమైన నేతను పోలీసులు అకారణంగా అదుపులోకి తీసుకోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు, స్థానిక కార్యకర్తలు భగ్గుమన్నారు. ఆయనను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పోలీసు వాహనాన్ని చుట్టుముట్టారు. పోలీసుల వైఖరికి నిరసనగా రోడ్డుపై బైఠాయించి తీవ్ర ఆందోళన చేపట్టారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు -- ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్



భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారు ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ప్రజల నుంచి మొత్తం 10 ఫిర్యాదులను స్వీకరించిన ఎస్పీ గారు, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలకు నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. ఫిర్యాదుల వివరాలను తెలియజేస్తూ, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు, మూడో వ్యక్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని సూచించారు. ప్రతి ఫిర్యాదుపై చట్టపరిధిలో నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని తెలిపారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాదివాస్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు పారదర్శకమైన పోలీస్ సేవలు అందించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

PRO -- పోలీస్ శాఖ భూపాలపల్లి జిల్లా.

# కోయిలకొండ మండలం చంద్రాస్‌పల్లి పాఠశాలలో బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం

**టీనేజ్ ఆకర్షణలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలి -- కోయిల్‌కొండ ఎస్సై నాగరాజు**
**గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన**





**మహబూబ్ నగర్ జిల్లా పోలీసు కార్యాలయం.**జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, IPS గారి ఆదేశాల మేరకు 09.11.2026న కోయిల్‌కొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని చంద్రాస్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సురక్ష పోలీసు కళాబృందం, షీ టీమ్, AHTU బృందాల సంయుక్త ఆధ్వర్యంలో బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కోయిల్‌కొండ ఎస్సై నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి, టీనేజ్ వయసులో అనవసర ఆకర్షణలకు లోనుకాకుండా క్రమశిక్షణతో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను గుర్తిస్తే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

అలాగే గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, సైబర్ భద్రత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ వేధింపులు ఎదురైతే 1930 లేదా 112కు, మహిళలు, బాలికలు సమస్యలు ఎదుర్కొంటే షీ టీమ్ నంబర్ 8712659365ను సంప్రదించాలని సూచించారు.



మానవ అక్రమ రవాణా, అక్రమ దత్తత వంటి నేరాలపై అవగాహన కల్పిస్తూ AHTU నంబర్ 8712680066ను తెలియజేశారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి, AHTU ASI సక్రి బాయి, షీ టీమ్ సభ్యురాలు అనురాధ PC, పోలీసు కళాబృందం సభ్యులు ణ.రాములు HG, బాల్‌రాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలి**
**లిపెండింగ్ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించే ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రతి దరఖాస్తును ప్రాధాన్యతతో పరిశీలించి, సమస్య స్వభావం, అర్హతలను బట్టి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా నిర్ణీత గడువులోగా చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు.

పెండింగ్‌లో ఉన్న వినతులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని కలెక్టర్ సూచించారు. ఒక శాఖకు సంబంధించిన సమస్య పరిష్కారంలో ఇతర శాఖల సహకారం అవసరమైతే పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నమోదు చేసి, సంబంధిత దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని అన్నారు . ప్రజలు తమ సమస్యలపై వినతులు సమర్పించేటప్పుడు పూర్తి వివరాలతో పాటు సంబంధిత ఆధార పత్రాలను జతచేయాలని సూచించారు.

ప్రజావాణిలో అందిన వినతుల్లో కొన్ని:



సుజాతనగర్ మండలం గరీబ్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం తండాకు చెందిన లకావత్ రమేష్ తన తండ్రి మాన్య రెండేళ్ల క్రితం మరణించారని, ఆయన పేరుపై ఉన్న ఆర్ఓఎఫ్ఆర్ పట్టాను తన పేరుపై బదిలీ చేయించుకునేందుకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటివరకు పరిష్కారం కాలేదని కలెక్టర్‌కు విన్నవించారు. పట్టా బదిలీ కాకపోవడంతో రైతు భరోసా పొందడంతో పాటు పత్తి విక్రయానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. తన సమస్యను పరిష్కరించి పట్టా బదిలీ చేయాలని కోరుతూ సమర్పించిన వినతిని పరిశీలించిన కలెక్టర్ తగిన చర్యల నిమిత్తం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి ఎండార్స్ చేశారు.

కొత్తగూడెం పోస్టాఫీస్ నుంచి హేమచంద్రపురం వరకు ఉన్న రహదారి అధ్వానంగా మారిందని, భారీ లారీల రాకపోకల కారణంగా రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో పాటు విపరీతమైన దుమ్ము, ధూళి వ్యాపిస్తోందని శేషగిరినగర్‌కు చెందిన లక్ష్మీదేవి వినతిపత్రం సమర్పించారు. దుమ్ము, ధూళి కారణంగా గ్రామ ప్రజలు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, పలుమార్లు సింగరేణి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు అప్పటివరకు రోజుకు మూడు పూటలా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లించి దుమ్ము వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిపై తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి జనరల్ మేనేజర్‌కు కలెక్టర్ ఎండార్స్ చేశారు.

ఇల్లందు పట్టణంలోని రెండో నంబర్ బస్తీ, ఐదో వార్డుకు చెందిన



70 ఏళ్ల మొండయ్య తనకు వినికిడి లోపం ఉందని, కుమారుడు మరణించినప్పటి నుంచి కోడలు, మనవడు తనను పట్టించుకోవడం లేదని, గత కొన్ని రోజులుగా తనపై దాడులకు పాల్పడుతూ దూషిస్తున్నారని, మూడు రోజులుగా భోజనం కూడా పెట్టడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తనకు రక్షణ కల్పించి, తనను వేధిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఫిర్యాదును పరిశీలించిన కలెక్టర్ తగిన చర్యల నిమిత్తం పోలీసు శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు.

టేకులపల్లి మండలం జత్య తండాకు చెందిన భూక్యా పూల్ సింగ్ తమకు వంశపారంపర్యంగా 3.26 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, జత్యా తండాలో తన భార్య పేరుపై మరో ఎకరం భూమి ఉందని కలెక్టర్‌కు విన్నవించారు. ఈ భూముల మధ్య నుంచి ప్రవహించే చిన్న వాగును తమ కుటుంబం వ్యవసాయ అవసరాల కోసం తండ్రి కాలం నుంచి వినియోగించుకుంటోందని తెలిపారు. అయితే ఐదేళ్ల క్రితం టేకులపల్లి మండలం లక్ష్మీ తండాకు చెందిన భూక్యా మంగీలాల్ అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు సదరు వాగును ఆక్రమించడంతో పాటు, వాగుకు ఇరువైపులా ఉన్న తమ భూమిలో కొంత భాగాన్ని తవ్వి ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విచారణ జరిపి ఆక్రమణలను తొలగించి తమ భూమిని తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతిని పరిశీలించిన కలెక్టర్ తగిన చర్యల నిమిత్తం ఈ-సెక్షన్ సూపరింటెండెంట్‌కు ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# బూర్గంపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

**బూర్గంపాడు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్**
**వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలి.. రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలి**
**గైనకాలజిస్ట్ ప్రతిరోజూ అందుబాటులో ఉండాలి.. ఆసుపత్రిలో పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**



**నేటి చర్చ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,**జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం బూర్గంపాడు మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది హాజరు, అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, ఈ విషయంపై మెడికల్ అధికారిని ప్రశ్నించారు. గైనకాలజిస్ట్ రోజు విడిచి రోజు విధులకు హాజరవుతున్నారని మెడికల్ అధికారి తెలపడంతో, కలెక్టర్ వెంటనే డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి గైనకాలజిస్ట్ ప్రతిరోజూ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులు, మహిళా రోగులకు వైద్య సేవలందించడంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.అనంతరం రక్త పరీక్షల కేంద్రాన్ని సందర్శించి, ప్రతిరోజూ నిర్వహిస్తున్న పరీక్షల సంఖ్య, అందుబాటులో ఉన్న పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఎలాంటి జాప్యం లేకుండా తక్షణమే వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం వైద్య సిబ్బంది బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి గౌరవప్రదంగా సేవలందించాలని, రోగుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చికిత్స అందించాలని సూచించారు. అత్యవసర వైద్య సేవలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధతో వైద్య సేవలు అందించాలని, అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు తరలించడంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు.ఆసుపత్రి పరిసర ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించి పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా నిరంతరం పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడాలని, వార్డులు, మరుగుదొడ్లు, రోగులు వేచి ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని సూచించారు.ఆసుపత్రి ప్రాంగణంలో విద్యుత్ మీటర్ వద్ద వైర్లు బయటకు వచ్చి ఉండటాన్ని గమనించిన కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులకు వెంటనే సమాచారం అందించి వాటిని సరిచేయాలని, రోగులు, సిబ్బందికి ఎలాంటి ప్రమాదం జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఇన్‌పేషెంట్ వార్డులో చికిత్స పొందుతున్న రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల తయారీ



కేంద్రాన్ని (కిచెన్) పరిశీలించారు. వంట మనిషితో మాట్లాడి రోగులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో మందుల లభ్యత, ఇతర సమస్యలపై వైద్యాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు నిరంతరం వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వస్తున్న అవుట్ పేషెంట్లు, ఇన్‌పేషెంట్ల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ వార్డులో 15 మంది రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న ఆసుపత్రి భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనుల్లో కార్మికుల సంఖ్య తక్కువగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్, ఇదే విధంగా పనులు కొనసాగితే భవన నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. తగినంత మంది కార్మికులను ఏర్పాటు చేసి నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆసుపత్రి భవన నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ సామాజిక ఆరోగ్య కేంద్రం మెడికల్ అధికారి, వైద్యులు, సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ సోలో డాన్స్ పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు గారు, తనయుడు వనమా రాఘవేంద్రరావు గారు

**ఇల్లందు:** భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి సోలో డాన్స్ పోటీలకు సంబంధించిన బ్రోచర్‌ను మాజీ మంత్రివర్యులు వనమా వెంకటేశ్వరరావు గారు, తనయుడు వనమా రాఘవేంద్రరావు గారు ఈరోజు వారి నివాసంలో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి రాష్ట్రస్థాయి నృత్య పోటీలు నిర్వహించడం అభినందనీయమని, కళాకారులకు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇటువంటి వేదికలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా యూనియన్ వ్యవస్థాపక



అధ్యక్షులు కడారి వెంకటేష్ మాట్లాడుతూ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని నృత్య కళాకారులకు ఒక మంచి వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ రాష్ట్రస్థాయి సోలో డాన్స్ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కళాకారుల ప్రతిభను వెలికితీయడంతో పాటు వారికి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందించడమే యూనియన్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.
ఈ బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు కడారి వెంకటేష్, జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కార్తీక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.
కళాకారుల అభివృద్ధి కోసం భద్రాద్రి 24 క్రాఫ్ట్స్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

# తాగునీటి భద్రతకు అత్యంత ప్రాధాన్యత.. ఎల్ నినోను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు: జిల్లా కలెక్టర్ అంకిత్


**సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నీటి వనరుల బలోపేతం.. వైరా జలాశయం ద్వారా ఎనిమిది మండలాలకు తాగునీటి భరోసా**
**9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత..**
**20 చెరువుల్లో 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటి నిల్వ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ, కరువు పరిస్థితులు ఏర్పడినప్పటికీ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడమే ప్రధాన లక్ష్యంగా అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను జిల్లాలోని జలాశయాలు, చెరువులకు మళ్లిస్తున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ నీటి నిల్వలను పెంచడం, భూగర్భ జలాలను రీఛార్జ్ చేయడం, సాగునీటి వనరులను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో వివరించారు. 2026-27 వ్యవసాయ సంవత్సరంలో ఎల్ నినో వాతావరణ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నీటి వనరుల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గిపోవడం, స్థానిక చెరువులు, కుంటల్లో నీటి నిల్వలు అడుగంటడం వంటి పరిస్థితులు ఏర్పడినప్పుడు తాగునీటి అవసరాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి జలాలను ప్రత్యామ్నాయ నీటి వనరుగా వినియోగించుకునేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం ఎంతగానో దోహదపడుతోందని వివరించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సుమారు 17,150 ఎకరాలకు సాగునీరు అందించే సామర్థ్యం కలిగిన వైరా జలాశయం నీటిమట్టం డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకున్న నేపథ్యంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా గోదావరి జలాలను మళ్లించి జలాశయాన్ని నింపేందుకు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చర్యల ద్వారా వైరా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ఎనిమిది మండలాల ప్రజలకు తాగునీటి సరఫరాకు భరోసా కల్పించేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితుల్లో కూడా గోదావరి జలాలను ప్రత్యామ్నాయంగా వినియోగించుకోవడం ద్వారా ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు వీలవుతోందని అన్నారు .
ప్రజలకు తాగునీరు అందించడం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని, అందుకు అనుగుణంగా జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడుకోవాలని, తాగునీటి అవసరాలకు సరిపడా నీటిని అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ముందుగానే అంచనా వేసి, ఎక్కడా సరఫరాలో అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.
సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా అశ్వాపురం మండలంలోని బి.జి. కొత్తూరు పంప్ హౌస్-1 వద్ద ఖరీఫ్ 2026 సీజన్‌లో మొత్తం 1,604 గంటల పాటు భారీ మోటార్లను నిర్వహించి గోదావరి నది నుంచి 9.088 టీఎంసీల నీటిని ప్రధాన కాలువలోకి ఎత్తిపోసినట్లు కలెక్టర్ వివరించారు. అదేవిధంగా వి.కె. రామవరం వద్ద పంప్ హౌస్-2, కమలాపురం వద్ద పంప్ హౌస్-3 ద్వారా కూడా నీటిని వివిధ ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. సంక్లిష్టమైన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాలకు సైతం గోదావరి జలాలను మళ్లించడం ద్వారా నీటి కొరతను అధిగమించేందుకు ఈ పంపింగ్ కార్యకలాపాలు దోహదపడుతున్నాయని అన్నారు .
ఈ నీటి మళ్లింపు ద్వారా ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, జూలూరుపాడు, సుజాతనగర్, తల్లాడ తదితర మండలాల్లోని నీటి వనరులకు ప్రయోజనం చేకూరిందని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లోని చెరువులు, జలాశయాలను నింపడం ద్వారా తాగునీటి అవసరాలకు అదనపు భరోసా కల్పించడంతో పాటు వ్యవసాయ అవసరాలకు కూడా నీరు అందుబాటులోకి వచ్చిందన్నారు.
జిల్లాలో సీతారామ ఎత్తిపోతల పథకం ప్యాకేజీలు 4, 7, 8, 9 మరియు 18ఎల్ రాజీవ్ కాలువ పరిధిలోని 20 మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో గోదావరి జలాలను నిల్వ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ చెరువుల్లో మొత్తం 1,058.65 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నింపడం ద్వారా ప్రత్యక్షంగా 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు వివరించారు.
ములకలపల్లి మండలంలోని ఏదుళ్లవాగు చెరువు, పెద్దయ్య చెరువు, శ్రీరాములు చెరువు, తుమ్మకుంట, ఊరచెరువు, ఏదుళ్ల చెరువుల్లో నీటిని నిల్వ చేసినట్లు తెలిపారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని వెంగళరావు సాగర్, పెద్దచెరువు, అన్నదైవం ప్రాజెక్టు, చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు ప్రాజెక్టు, జంట్లకుంట, గంద్ర వీరయ్య కుంట, శనగకుంట, జూలూరుపాడు మండలంలోని మేడికుంట, ఎర్రవాగు ప్రాజెక్టు, శనగచెరువు, సుజాతనగర్ మండలంలోని సింగభూపాలెం ప్రాజెక్టు, తల్లాడ మండలంలోని సుబ్బమ్మ చెరువు, బ్రాహ్మణపల్లి చెరువు, ఓర చెరువుల్లో నీటి నిల్వలను పెంచినట్లు తెలిపారు .
చెరువుల్లో నీటిని నిల్వ చేయడం వల్ల ఆయా గ్రామాల్లోని రైతులకు సాగునీటి భరోసా లభించడంతో పాటు పశువుల అవసరాలకు, స్థానిక నీటి వనరుల వినియోగానికి కూడా ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వర్షాభావ పరిస్థితుల్లో చెరువుల్లో నీటి నిల్వలు అందుబాటులో ఉండటం వల్ల వ్యవసాయానికి ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించవచ్చని తెలిపారు జిల్లాలోని కఠిన రాతి నేలల ప్రాంతాల్లో చెరువులు, కాలువల్లో నీటిని నిల్వ చేయడం ద్వారా భూగర్భ జలాల రీఛార్జ్‌కు అవకాశం ఏర్పడుతుందని కలెక్టర్ తెలిపారు. చెరువుల్లో నీటి నిల్వలు పెరగడం వల్ల పరిసర ప్రాంతాల్లోని బావులు, బోరుబావుల్లో భూగర్భ జలమట్టాలు పెరిగేందుకు దోహదపడుతుందని వివరించారు. తద్వారా వ్యవసాయ అవసరాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి వనరుల లభ్యత మెరుగుపడుతుందని అన్నారు . నీటి వనరులను ప్రస్తుత అవసరాలకే కాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలంలో లభించే నీటిని గరిష్టంగా నిల్వ చేసుకోవడం, చెరువుల పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడం, భూగర్భ జలాల పెంపునకు అనువైన చర్యలు చేపట్టడం ద్వారా కరువు ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు.
సీతారామ ఎత్తిపోతల పథకంలోని రాజీవ్ కాలువ ద్వారా మళ్లించిన గోదావరి జలాలు ఖమ్మం జిల్లాలోని నాగార్జునసాగర్ ఎడమ కాలువ చివరి ఆయకట్టు ప్రాంతాలకు కూడా ప్రయోజనం చేకూర్చాయని కలెక్టర్ తెలిపారు. చివరి ఆయకట్టులో నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితులను నివారించేందుకు గోదావరి జలాలను వినియోగించినట్లు వివరించారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని 123 చిన్న నీటిపారుదల చెరువుల్లో 3,967 మిలియన్ క్యూబిక్ ఫీట్ల నీటిని నిల్వ చేయడం ద్వారా 11,965 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడంతో పాటు వైరా ప్రాజెక్టు పరిధిలో సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించినట్లు తెలిపారు .
ఎల్ నినో ప్రభావంతో భవిష్యత్తులో వర్షాభావ పరిస్థితులు తీవ్రతరమైనప్పటికీ ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అందుకు అనుగుణంగా నీటి నిల్వలను అందుబాటులో ఉంచాలని సూచించారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్లలో లీకేజీలను అరికట్టాలని, అవసరమైన చోట తక్షణ మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి వనరులను క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. నీటి వృథాను నివారించడంతో పాటు ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు.సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం వల్ల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తాగునీటి భద్రతకు భరోసా కల్పించడంతో పాటు 20 చెరువుల్లో నీటి నిల్వలను పెంచడం, 9,436 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి భద్రత కల్పించడం, భూగర్భ జలాల పెంపునకు దోహదపడటం సాధ్యమైందని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు.

# నిర్మల్ పోలీస్... మీ పోలీస్...

**ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS**
**ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేయాలి -- అధికారులకు ఎస్పీ ఆదేశం**



ప్రజలకు ఏ సమస్య వచ్చినా పోలీస్ శాఖ అండగా ఉంటుందని, బాధితులకు న్యాయం చేయడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, IPS తెలిపారు. నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు, వినతులను ఆమె స్వయంగా స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలు తమ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారికి భరోసా కల్పించడం, వారి మాటలను ఓపికగా వినడం, సమస్యను అర్థం చేసుకొని చట్టప్రకారం పరిష్కారం చూపడం ప్రతి పోలీసు అధికారి బాధ్యత అని ఎస్పీ తెలిపారు. ప్రజల ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి, బాధితులకు సకాలంలో న్యాయం అందేలా పనిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.
ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు బాధితులకు అండగా నిలవడం, వారి సమస్యలను పరిష్కరించడం కోసం పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందని, ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకొని పరిష్కారం కోసం నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన సహకారం అందించాలని స్పష్టం చేశారు.పోలీసులు ప్రజలకు సేవ చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడమే నిర్మల్ పోలీసుల లక్ష్యమని తెలిపారు.

# పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల గుర్తింపు -- బాధితులకు అప్పగింత





పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను సీఐఆర్ (CEIR) పోర్టల్ ద్వారా గుర్తించిన హనుమకొండ పోలీసులు, ఈరోజు 5 సెల్‌ఫోన్లను వాటి యజమానులకు తిరిగి అప్పగించారు. హనుమకొండ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే సీఇఐఆర్ (CEIR) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ నరసింహారావు, హనుమకొండ ఇన్స్పెక్టర్ మచ్చ శివకుమార్, సీఇఐఆర్ పోర్టల్ నిర్వాహకుడు కానిస్టేబుల్ రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదులపై సత్వర స్పందన.. గ్రీవెన్స్ డేలో ఫిర్యాదులు స్వీకరించిన సీపీ



**రామగుండం పోలీస్ కమిషనరేట్**
ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని, చట్టపరిధిలో సత్వర పరిష్కారం అందించడమే లక్ష్యంగా ప్రతి సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.గ్రీవెన్స్ డే సందర్భంగా పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలను సీపీ స్వయంగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడారు.ప్రతి ఫిర్యాదుపై సమగ్రంగా విచారణ జరిపి,అర్హులైన బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా సత్వరం స్పందించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం, విశ్వాసం పెంపొందించేలా విధులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డే సందర్భంగా ప్రజా ఫిర్యాదులను పరిశీలించిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు

**-- బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం**




ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా ఈ రోజు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 15 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని తెలిపారు.

# హుస్నాబాద్ మండలం పందిళ్ళ సమీపంలో ప్రధాన రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం

ట్రాక్టర్, కారు ఢీకొని తండ్రి, కూతురు మృతి మృతులు కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్(35), కూతురు మహిరి (7) గా గుర్తింపు మరో ముగ్గురికి గాయాలు హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు మృతులు హైదరాబాద్ నుండి స్వగ్రామం కొండాపూర్ కు కారులో వస్తుండగా ఘటన

# రూ.2 లక్షల లంచం తీసుకంటూ.. ఏసీబీకి చిక్కిన ఎస్ఐ





కీసర పోలీస్ స్టేషన్‌లో నమోదైన భూ మోసం, 498ఏ కేసుల్లో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి ఈ కేసుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేసేందుకు రూ.2 లక్షలు ఇవ్వాలని ఎస్ఐ శ్రీనివాస్ డిమాండ్ ఎస్ఐ వేధింపులు తాళలేక.. ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితుడు పథకం ప్రకారం.. కీసరలోని శిల్పా లేఔట్‌లో రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా ఎస్ఐ శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

# మోడిఫైడ్ సైలెన్సర్‌తో అధిక శబ్దాలు చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ద్విచక్ర వాహనం సీజ్..

**- నిబంధనలకు విరుద్ధంగా మార్చిన సైలెన్సర్‌ను తొలగించి, మెకానిక్ వద్ద నిబంధనలకు అనుగుణమైన సైలెన్సర్ ఏర్పాటు.**
**- బాధ్యతగల యువకుడు అందించిన వీడియో ఆధారంగా తక్షణ చర్యలు తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు.**
**- ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి హెచ్చరిక.**




**సూర్యాపేట జిల్లా పోలీస్..**
**సూర్యాపేట:** పట్టణంలోని రహదారులపై కొందరు యువకులు ద్విచక్ర వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి, అధిక శబ్దాలు చేస్తూ వేగంగా వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న ఘటనపై సూర్యాపేట ట్రాఫిక్ పోలీసులు తక్షణ చర్యలు చేపట్టారు ఈ విషయాన్ని గమనించిన బాధ్యతగల యువకుడు సంబంధిత వాహనం అధిక శబ్దాలు చేస్తూ రహదారిపై ప్రయాణిస్తున్న దృశ్యాలను వీడియో చిత్రీకరించి సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డికి అందించారు.వీడియోపై స్పందించిన ట్రాఫిక్ పోలీసులు వెంటనే సదరు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన సైలెన్సర్‌ను తొలగించారు. మెకానిక్ వద్ద నిబంధనలకు అనుగుణమైన సైలెన్సర్‌ను ఏర్పాటు చేయించి, వాహనదారుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా సైలెన్సర్లు మార్చడం, అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగించడం, రహదారులపై అతివేగంగా వాహనాలు నడపడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అలాగే, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించే వాహనాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.ప్రజల భద్రత, ప్రశాంతమైన రహదారి ప్రయాణం కోసం పోలీసులకు సహకరించాలని సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేస్తోంది.

## ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజాదివాస్) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు. పి ఆర్ వో

## ది సింగరేణి కాలరీస్ కంపెని లిమిటెడ్

**ప్రభుత్వసంస్థఇల్లందు ఏరియా** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియాలోని సింగరేణి మాజీ ఉద్యోగులకు తెలియజేయునది ఏమనగా! ఇల్లందు ఏరియా లోని సింగరేణి మాజీ ఉద్యోగులకు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ సంభందిత సమస్యల పరిష్కారం కొరకు తేది: 10.11.2026 న ఉదయం 10:30 గం. లకు స్థానిక వై.సి.ఓ.ఎ క్లబ్ నందు "డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ కాంపెయిస్ 5.0" కార్యక్రమము నిర్వహించబడును. ఈ కార్యక్రమనికి రీజినల్ కమీషనర్ సి.యం.పి.యఫ్. కొత్తగూడెం వారు హాజరవుతున్నారు కావున సింగరేణి మాజీ ఉద్యోగులు ఈ కార్యక్రమమునకు సకాలంలో హాజరై తమ యొక్క డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ (జీవన్ ప్రమాణం) సంబందిత సమస్యలు ఏమైన ఉన్నట్లుయితే పరిష్కరించుకోనగలరని సింగరేణి యాజమాన్యం తెలియజేసింది. 3?. 09.11.2026.సింగరేణి యాజమాన్యం ఇల్లందు ఏరియా

## జిల్లా మహిళా కాంగ్రెస్ పగ్గాలు అడువాల జ్యోతి లక్ష్మణ్‌కు

**మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తా..**
**మహిళల రాజకీయ చైతన్యానికి కృషి చేస్తా: జ్యోతి లక్ష్మణ్**



**చర్ల,జగిత్యాల:** జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ నియమితులయ్యారు. జగిత్యాల పట్టణానికి చెందిన ఆమెకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నియామక ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో మహిళా కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంతో పాటు, మహిళలను రాజకీయం గా చైతన్యవంతులను చేసి పార్టీ కార్యక్రమాల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. మహిళా సమస్యలపై స్పందిస్తూ, మహిళా శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు.
తన నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్యలకు జ్యోతి లక్ష్మణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

**జిల్లా కలెక్టర్‌ను కోరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



**చర్ల, జగిత్యాల:** జగిత్యాల నియోజకవర్గంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయించాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ను కోరారు. సోమవారం కలెక్టర్ ను కలిసిన ఎమ్మెల్యే అనంతరం మాట్లాడుతూ.. వానాకాలం వరి పంట కోత దశకు చేరుకుందని, జగిత్యాల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరి కోతలు మొదలయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించే క్రమంలో మధ్యవర్తులను ఆశ్రయించి మోసపోకుండా ఉండేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, సంబంధిత అధికారులతో మాట్లాడి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## తండ్రీకూతుళ్ల మృతిపై మంత్రి పొన్నం దిగ్భ్రాంతి

**పందిళ్లలో ఘోర రోడ్డు ప్రమాదం**



**నేటి చర్చ :- హుస్నాబాద్:**సిద్దిపేట -- హుస్నాబాద్ ప్రధాన రహదారిపై హుస్నాబాద్ మండలం పందిళ్ల శివారులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతుళ్లు మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన పైడిపల్లి శ్రీకాంత్ (33), ఆయన కుమార్తె మహాన్వి (9) ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. పండుగ వేళ కుటుంబంతో సంతోషంగా గడపాల్సిన సమయంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదమని పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్ భార్య స్వాతికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాలుడు శ్రీహాన్ క్షేమంగా ఉండాలని ప్రార్థించారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రయాణాల్లో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# బాధితుల ప్రతి సమస్య పట్ల జవాబుదారీతనంతో ఉండాలి

**సమస్యలు పరిష్కారమైనప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెరుగుతుంది**
**పోలీసు ముఖ్య కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం నిర్వహణ**
**జిల్లా వ్యాప్తంగా 18 ఫిర్యాదులను నేరుగా స్వీకరించిన జిల్లా ఎస్పీ**
**సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి సమస్యల పరిష్కారానికి సూచనలు**
**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్**





**ఆదిలాబాద్ జిల్లా,నవంబర్ 02 :-**బాధితుల ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తూ ప్రతి సమస్య పట్ల జవాబుదారీతనంతో ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ సూచించారు. సోమవారం పోలీసు ముఖ్య కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 18 మంది ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి నేరుగా విన్నవించారు. ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ బాధితుల సమస్యలను స్వయంగా విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాధితుల సమస్యలను పరిష్కరించినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం, విశ్వాసం మరింత పెరుగుతాయని తెలిపారు. ప్రజలు పోలీసుల ద్వారా పరిష్కరించదగిన సమస్యలపై నిర్భయంగా జిల్లా పోలీసు కార్యాలయాన్ని లేదా నేరుగా జిల్లా ఎస్పీని సంప్రదించాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా నిర్వహిస్తున్న 8712659973 వాట్సాప్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు లేని,గంజాయి మరియు మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఆదిలాబాద్‌ను నిర్మించేందుకు యువత, ప్రజలు పోలీసులకు పూర్తి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పీ కోరారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, సిబ్బంది వామన్, సునీల్, లిఖిత తదితరులు పాల్గొన్నారు.


# ప్రైవేట్ చిట్టీల పేరుతో రూ.55.33 లక్షల మోసం.. ముగ్గురు అరెస్ట్



**కొత్తగూడెం:** ప్రైవేట్ చిట్టీల పేరుతో ప్రజల నుంచి రూ.55.33 లక్షలు వసూలు చేసి మోసాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు.
కొత్తగూడెం పట్టణంలోని న్యూ గొల్లగూడెంకు చెందిన కట్టుల సరోజ (62), కట్టుల చంద్రకళ (37), కట్టుల కుమార్ (40) కలిసి మొత్తం 11 ప్రైవేట్ చిట్టీలు నిర్వహిస్తూ ఖాతాదారుల నుంచి రూ.55,33,745 వసూలు చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. చిట్టీల ద్వారా వసూలు చేసిన డబ్బులను తిరిగి చెల్లించకుండా ఖాతాదారులను మోసం చేసినట్లు గుర్తించారు.ఈ ఘటనపై కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 188/2026 కింద కేసు నమోదు కాగా, నమ్మదగిన సమాచారం మేరకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద ముగ్గురు నిందితులను త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద చిట్టీల లావాదేవీల వివరాలు నమోదు చేసిన ఐదు బుక్స్‌ను స్వాధీనం చేసుకొని,అరెస్టు చేసిన ముగ్గురిని న్యాయస్థానం ముందు హాజరు పరిచినట్లు కొత్తగూడెం డిఎస్పీ అదినారాయణ వెల్లడించారు.ప్రజలు అధిక లాభాలు వస్తాయనే ఆశతో అనధికారిక ప్రైవేట్ చిట్టీలలో చేరి తమ కష్టార్జితాన్ని కోల్పోవద్దని డీఎస్పీ సూచించారు. చిట్టీలలో చేరే ముందు నిర్వాహకుల చట్టబద్ధత, అనుమతులను పరిశీలించాలని,సరైన రసీదులు, రికార్డులు లేకుండా నగదు చెల్లించవద్దని విజ్ఞప్తి చేశారు. చట్టవిరుద్ధంగా చిట్టీలు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఈ కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన కొత్తగూడెం త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మరియు పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అభినందించారు.
ప్రజలను ఆర్థిక మోసాల నుంచి రక్షించేందుకు నిరంతరం నిఘా కొనసాగించాలని అధికారులకు సూచించారు.

# రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు, జైలు శిక్ష


**న్యాయస్థానం ఉత్తర్వులు బేఖాతరు చేసినందుకు. ఐఏఎస్ తీరుపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం. ఆరు నెలల సాధారణ కారాగారం, రూపాయలు 2000, జరిమానా.**




**నేటి చర్చ :** హై కోర్టు, హైదరాబాద్, న్యాయస్థానం ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వులను బేఖాతరు చేసిన వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారించింది జస్టిస్ కే.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి కి ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు ఆరు వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది..
ఉల్లంఘన పై విచారణ సంచలన తీర్పు..!
న్యాయస్థానం ఆదేశించిన సమయంలో స్పందించకుండా పిటీషన్ దాఖలు అయ్యాక నామమాత్రంగానే ఉత్తర్వులు ఇవ్వడాని తీవ్రంగా తప్పుబట్టిన హైకోర్టు కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఉద్దేశపూర్వకంగానే కోర్టు ధిక్కరనకు పాల్పడ్డారని నిర్ధారించింది ఐఏఎస్ స్థాయి అధికారి కోర్టు ఉత్తర్వులను నిర్లక్ష్యం చేయడం సరికాదని ధర్మాసనం కఠిన నిర్ణయం తీసుకుంది..
అసలు ఏం జరిగిందంటే.?
రిజిస్ట్రేషన్ చట్టం 1908 లోని సెక్షన్ 22 ఏ ప్రకారం నిషేధిత ఆస్తులు జాబితా నుంచి కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు దాఖలు చేసిన వినతిని పరిశీలించాలని గతంలో హైకోర్టు కలెక్టర్ ను ఆదేశించింది 2025 ఆగస్టులో కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం 60 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది అయితే కోర్టు నిర్దేశించిన 60 రోజుల గడువు ముగిసినప్పటికీ కలెక్టర్ నుంచి ఎలాంటి రెస్పాన్స్ రాకపోవడంతో బాధితులు 2025 అక్టోబర్ 15 కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు పిటీషన్ నమోదు అయిన తర్వాత యంత్రాంగం కదిలింది అధికారులు బాధితులకు నోటీసులు జారీ చేసి 2026 ఫిబ్రవరి 26న వారి వినతి తిరస్కరించారు ఆ తర్వాత జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు జారీ చేశారు కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాత ఇలా ప్రక్రియను చుట్టేయడంపై ధర్మసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది..

# తాటిచెట్లు ఎక్కకుండా అడ్డుకుంటున్న సంఘ నాయకులు

**నేటి చర్చ :- హుస్నాబాద్/ అక్కన్నపేట:**
హుస్నాబాద్ ఎక్సైజ్ సిఐ కి బాధితుడి ఫిర్యాదు.
గౌడ సంఘం నుండి,కులం నుండి బహిష్కరించి, తాటిచెట్టు ఎక్కకుండా సంఘ నాయకులు అడ్డుకుంటున్నారని న్యాయం చేయాలని కోరుతూ గౌడ కులస్తుడు పూదరి కృష్ణహరి సోమవారం హుస్నాబాద్ లోని ఎక్సైజ్ సిఐ కి ఫిర్యాదు చేశాడు. జనగామ గ్రామానికి చెందిన పూదరి కృష్ణహరి (45), తండ్రి వెంకటయ్య, కులం, గౌడ, తనకు జరుగుతున్న అన్యాయంపై విలేకరులతో మాట్లాడుతూ తాను ప్రతిరోజూ జనగామ గ్రామంలోను, మలిచెరువు తండాలోను తాటిచెట్లు ఎక్కుతూ తన కుటుంబాన్ని పోషించుకుంటున్నానని ఆయన తెలిపారు. కొన్ని రోజులు తన అత్తగారి ఇల్లు అక్కన్నపేట మండలంలో ఉండటంతో అక్కడి నుండి ఇక్కడికి వచ్చి తాటిచెట్లు ఎక్కుతున్నానని చెప్పారు.
తన ఫిర్యాదులో ఆయన పేర్కొన్న వివరాల ప్రకారం.
సంఘంలో ఉండాలంటే రూ.పదివేలు కట్టాలని కులం పెద్ద మనుషులు చెప్పడంతో తాను కుల సంఘానికి డబ్బులు చెల్లించినట్లు తెలిపారు. ఆ తర్వాత పూదరి సాయవ్వ మా నాయనమ్మ గత అక్టోబర్ 15న మృతి చెందితే, ఆమె దశదినకర్మ రోజున కూడా కులం పెద్ద మనుషులు తన ఇంటికి కులం పెద్ద మనుషులు రాకుండా, తన కులంలో ఎవ్వరూ కృష్ణహరి ఇంటికి వెళ్లవద్దని చెప్పినట్లు ఆరోపించారు. అంతేకాకుండా సంఘంలో ఉండాలంటే రూ.20 వేలు డిమాండ్ చేస్తున్నారని, అట్టి డబ్బులు కడితేనే నిన్ను, నీ కుటుంబాన్ని సంఘంలోకి తీసుకుంటామని కులం పెద్ద మనుషులు చెబుతున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.
తనకు గౌడ సంఘం లైసెన్స్ కార్డు నెం: 03201510261010, గౌడ సంఘం రిజిస్ట్రేషన్ చీశే. 972 కలదని, కులం పెద్ద మనుషుల తీరువల్ల గ్రామంలో తన కుటుంబ పరువు పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.





నన్ను కులం నుండి బహిష్కరించి, జీవనోపాధి పొందుతున్న తాటిచెట్టు ఎక్కే పనిని అడ్డుకుని, తనను, తన కుటుంబాన్ని మానసికంగా, మనోవేదనకు గురి చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని,బాధితుడు కృష్ణ హరి ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు.. జిల్లా కలెక్టర్‌కు 6 నెలల జైలు శిక్ష


**రంగారెడ్డి :**రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి 6 నెలల జైలు శిక్ష రూ.2 వేల జరిమానా విధించిన హైకోర్టుకోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారణ60 రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని గతంలో ఆదేశం గడువు దాటినా స్పందించకపోవడంతో కలెక్టర్‌పై చర్యలు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన కేసులో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి తెలంగాణ హైకోర్టు ఆరు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. రూ.2 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశిం చింది. జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాస నం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అయితే అప్పీలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ శిక్ష అమలును నాలుగు వారాల పాటు నిలిపివేసింది.రిజిస్ట్రేషన్ చట్టం-1908లోని సెక్షన్ 22-ఏ ప్రకారం నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న కొన్ని ప్లాట్లను తొలగించాలంటూ బాధితులు గతంలో హైకోర్టును ఆశ్రయించారు. వారి వినతిని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని



2025 ఆగస్టులో కలెక్టర్‌ను కోర్టు ఆదేశించింది. 60 రోజుల్లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేసింది.అయితే గడువు ముగిసినా కలెక్టర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో బాధితులు 2025 అక్టోబరు 15న కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఆ తర్వాతే అధికా రులు స్పందించారు. బాధితులకు నోటీసులు జారీ చేసి, 2026 ఫిబ్రవరి 26న వారి వినతిని తిరస్కరించారు. అనంతరం జులై 8న మరోసారి తిరస్కరణ ఉత్తర్వులు ఇచ్చారు.కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైన తర్వాతే అధికారులు స్పందించడం, కోర్టు ఆదేశించిన గడువులోగా నిర్ణయం తీసుకోకపోవడంపై ఎస్పష్టం చేసింది. అయితే గడువు ముగిసినా కలెక్ట ర్మానసం తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేసింది. ఉద్దేశ పూర్వకంగానే కలెక్టర్ కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారని నిర్ధారించింది. ఐఏఎస్ స్థాయి అధికారి న్యాయస్థానం ఆదేశాలను నిర్లక్ష్యం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేస్తూ ఆరు నెలల జైలు శిక్ష విధించింది.

## అక్రమంగా మట్టి తవ్వకాలు- కనుమరుగవుతున్న గుట్టలు

**ప్రజావాణిలో బిఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు**
**అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి**
**ప్రజావాణిలో ఆర్డీఓ కార్యాలయ అధికారికి బీఆర్ఎస్ నాయకుల వినతి.**



**నేటి చర్చ :- హుస్నాబాద్:**హుస్నాబాద్ ప్రాంతంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుట్టలను తవ్వి అక్రమంగా మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో భాగంగా ఆర్డీఓ కార్యాలయంలో ఏడీఓ అరిఫాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ. హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా గుట్టలను తవ్వి మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే ఎకరాల కొద్దీ గుట్టలు తవ్వి మట్టిని తరలించినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. గుట్టలను తవ్వి మట్టి తరలించడం ద్వారా కొందరు లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారని ఆరోపించారు. గుట్టలు కనుమరుగవుతుండటంతో పర్యావరణానికి నష్టం వాటిల్లడంతో పాటు వన్యప్రాణులు జనావాసాల్లోకి వస్తున్నాయని పేర్కొన్నారు. గుట్టలపై ఉన్న చెట్లు, బండరాళ్లు తొలగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములతో పాటు పట్టా భూముల పరిధిలోని గుట్టలు సైతం కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను అరికట్టాలని, అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ వినతి పత్రం సమర్పణలో బీఆర్ఎస్ నాయకులు అయిలేని గాల్ రెడ్డి, భూక్య రాజు నాయక్, మాటూరి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భాగ్యలక్ష్మి అమ్మవారి వెండి నాణేల కోసం పోటెత్తిన భక్తులు



**హైదరాబాద్, నవంబరు :** భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి ప్రజలు తరలివస్తున్నారు. చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయంలో 7 గంటలకు ఖజానా పంపిణీని ప్రారంభించారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది. నాలుగు క్యూ లైన్లు ఏర్పాటు చేసి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్మవారి వెండి కాయిన్స్ పంపిణీ చేస్తున్నారు.గుల్జార్ హౌస్ 500 మీటర్ల వరకు భక్తుల క్యూ లైన్స్ కిక్కిరిశాయి. ఈ క్రమంలో చార్మినార్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. అమ్మవారి కాయిన్ లభిస్తే తమకు సకల శుభాలు, సిరిసంపదలూ కలుగుతాయని భక్తులు నమ్మకంగా భావిస్తారు. ఈ నాణేలను సొంతం చేసుకునేందుకు భారీగా భక్తులు తరలి వస్తున్నారు. మూడు రోజుల పాటు అమ్మవారి ఖజానాను పంపిణీ చేయనున్నారు. ఈ నెల 11వ తేదీ వరకు కాయిన్స్ పంపిణీ కొనసాగనుందని ఆలయ కమిటీ పేర్కొంది.

## దీపావళి వేళ ఎగిసిపడిన నిప్పురవ్వలు - హైదరాబాద్‌లో పలుచోట్ల అగ్నిప్రమాదాలు

**హైదరాబాద్:** దీపావళి పండుగ వేళ హైద రాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో అగ్నిప్ర మాదాలు జరిగాయి. టపాసుల నిప్పు రవ్వలు పడి అగ్గి రాజుకుంది. ప్రమాదాల్లో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోయినా, రూ.లక్షల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితులు వాపోయారు. హైదరాబాద్ అఫ్జల్ గంజ్ పోలీస్ స్టేషన్ పరిధి బేగంబజార్‌లోని ఓ భవనంలో ఆదివారం రాత్రి మంటలు చెలరేగాయి. బాణాసంచా నిప్పు రవ్వలు పడి మంటలు వ్యాపించాయి.భారీగా మంటలు ఎగిసిపడి పొగలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధి జీడిమెట్లలోని ఓ స్క్రాప్ దుకాణంలోనూ అగ్నిప్రమాదం సంభవించింది.



బాణాసంచా కాల్చుతుండగా నిప్పులు ఎగిరిపడి మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. అగ్నిప్రమాదం ధాటికి షాపులోని స్క్రాప్ అంతా అగ్నికి ఆహుతైంది. రెండు ఫైర్ ఇంజిన్ల సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.డెకరేషన్ గోదాంలో చెలరేగిన మంటలురం గారెడ్డి జిల్లా మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి ఓల్డ్ విలేజ్‌లోని హనుమాన్ దేవాలయం సమీపంలో ఇళ్ల మధ్య ఏర్పాటు చేసిన డెకరేషన్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గోదాంలో మంటలు వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఇళ్ల మధ్యలో డెకరేషన్ గోదాం ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సికిం ద్రాబాద్ పరిధి బండిమెట్ మారుతి వీధిలోని 'సాయి బాలాజీ డిస్ట్రిబ్యూటర్ డ్రగ్ మార్ట్'లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమా పక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చా రు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆస్తి నష్టాన్ని ఇంకా అంచనా వేయాల్సి ఉంది. అగ్నిప్రమాదంపై విచారణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. పేపర్? ప్లేట్స్? తయారీ కంపెనీలో భారీ అగ్నిప్రమాదంకూకట్‌పల్లిలోని ఆస్బెస్టాస్ కాలనీలోనూ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పేపర్ ప్లేట్స్, టీ కప్పుల తయారీ కంపెనీలో సోమవారం తెల్లవారుజా మున మంటలు చెలరేగాయి. దీంతో పక్కనే ఉన్న నెయ్యి, కుర్‌కురే, హల్దీరామ్ స్టాక్ గోదాములకు ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఎగిసిపడ్డాయి. ఆస్తి నష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు ఈ అగ్నిప్రమాదాల వల్ల రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగిందని బాధితులు వాపోతున్నారు.

## ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ వీసీ జానయ్యపై లైంగిక వేధింపులు మహిళా కమిషన్ నోటీసులు జారీ

**హైదరాబాద్ :**తనను లైంగికంగా వేధించాడని ప్రొ.జయశంకర్ అగ్రికల్చర్ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్యపై మహిళా ప్రొఫెసర్ చేసిన ఫిర్యాదుపై విచారణ మొదలైంది. ఈ విషయంలో వివరణ ఇచ్చేందుకు ఈ నెల 12న విచారణకు రావాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ నోటీసులు జారీచేసింది.ఫిర్యాదు చేసినా న్యాయం జరగటం లేదుపీజేటీఏయూ వీసీ ప్రొఫెసర్ జానయ్య తనను లైంగికంగా వేధించారని యూనివర్సిటీలో పని చేసి నిజామాబాద్‌కు బదిలీ అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వీసీపై తీవ్ర ఆరోపణలు చేశారు. వీసీ ఈ సంవత్సరం జనవరి నుంచి తరచూ తనతో అనుచితంగా ప్రవర్తించారని, అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని, అర్ధరాత్రి ఫోన్స్? చేయడం, ఏకాంతంగా కలవాలని ఒత్తిడి చేశారని తెలిపారు.గత జనవరి 1న పీహెచ్‌డీ




డిప్యుటేషన్ పొడిగింపు అనుమతి కోసం యూనివర్సిటీకి వెళ్తే తనని అసౌకర్యానికి గురిచేశారని, తనకు ఎదురైన పరిస్థితిని యూనివర్సిటీ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగటం లేదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం స్పందించి స్వతంత్ర కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.తక్షణమే పదవి నుంచి తొలగించాలిఆరోపణల నేపథ్యంలో వీసీ ప్రొఫెసర్ జానయ్యపై చర్యలు తీసుకోవాలని వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది సంఘాలు రెండురోజులుగా ఆందోళనలు చేపట్టాయి. విశ్వవిద్యాలయంలో మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలంటూ ఇవాళ కూడా భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ వ్యవసాయ శాస్త్రవేత్తల సంఘం, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాధిత మహిళా ప్రొఫెసర్‌కు న్యాయం చేయాలని, ఆరోపణలపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. విచారణ పారదర్శకంగా జరిగేందుకు వైస్ ఛాన్సలర్ జానయ్యను తక్షణమే పదవి నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జానయ్యకు కొందరు ఉద్యోగుల మద్దతుమరోవైపు వీసీ అల్దాస్ జానయ్యపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని రెండురోజుల క్రితం వర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్, ఎంప్లాయిస్ అసోసియే షన్ సభ్యులు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి బదిలీ చేశారనే అక్కసుతోనే, వీసీపై ఆరోపణలు చేశారని తెలిపారు.

## పోచారంలో కల్తీ పాల తయారీ కేంద్రంపై పోలీసుల దాడి.. వ్యాపారి అరెస్ట్



**హైదరాబాద్, నవంబర్ 09:** నగరంలో కల్తీ పాలు సరఫరా చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఆరోగ్య శాఖ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మండలం పోచారంలోని పాల తయారీ కేంద్రంపై సోమవారం అధికారులతో కలిసి పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భ ంగా భారీగా కల్తీ పాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాల వ్యాపారిని అరెస్ట్ చేశారు. పాల తయారీ కేంద్రంలోని యంత్రాలను సీజ్ చేశారు.పాల వ్యాపారిని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను వినియోగించి.. ఈ కల్తీ పాలను తయారు చేస్తున్నట్లు తమ విచారణలో పాల వ్యాపారి వెల్లడించారని పోలీసులు తెలిపారు. ఈ కల్తీ పాలను హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో సరఫరా చేస్తున్నట్లు వెల్లడించాడని పోలీసులు చెప్పారు.

## హైదరాబాద్ విద్యార్థి ఆత్మహత్య కేసులో కీలక మలుపు.



**హైదరాబాద్, నవంబర్ 9:** నగరంలోని ఎస్ఆర్ నగర్‌కు చెందిన ఓ హోటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థి ఆత్మహత్య కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. తాను చేసిన తప్పును అంగీకరించినప్పటికీ.. ప్రిన్సిపల్, లెక్చరర్ వేధిస్తున్నారని మనస్తాపం చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు తోటి విద్యార్థులు, కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు ప్రిన్సిపల్, లెక్చరర్లను అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే..కుటుంబసభ్యులు, తోటి విద్యార్థుల కథనం ప్రకారం.. భాను ప్రసాద్ రెడ్డి అనే యువకుడు.. హైదరాబాద్‌లోని ఓ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజ్‌లో కోర్సు తీసుకుంటున్నారు. కాగా.. భాను ప్రసాద్ సరదాగా.. ఓ మహిళా లెక్చరర్ ఫొటోను ఏఐని వినియోగించి మార్ఫింగ్ చేశారు. ఇది తెలుసుకున్న ఆ లెక్చరర్ విద్యార్థి నుంచి ఫోన్ స్వాధీనం చేసుకుని.. ప్రిన్సిపల్ చంద్రమోహన్‌కు అందజేశారు. దీంతో పశ్చాత్తాపం చెందిన భానుప్రసాద్.. తన తప్పును అంగీకరించి మహిళా లెక్చరర్, ప్రిన్సిపల్‌ను క్షమాపణ కోరారు. అయినా సరే.. ప్రిన్సిపల్ చంద్రమోహన్, మరో లెక్చరర్ భాస్కర్.. ఫోన్ తిరిగి ఇవ్వకుండా వారం రోజులుగా అట్టిపెట్టుకోవడం, దూషిస్తుండడంతో తీవ్ర మనస్తాపానికి గురైన భాను ప్రసాద్ రెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డారని తోటి విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రిన్సిపల్, లెక్చరర్‌ను అరెస్ట్ చేసి.. కోర్టులో హాజరుపరచగా.. జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు.


## భర్త చనిపోతే భార్యకు పింఛను - దివ్యాంగ, గీత, డయాలసిస్ మొదలైన బాధితులకు భారీ ఊరట!

**హైదరాబాద్ :**తెలంగాణ ప్రభుత్వం ఆసరా పింఛన్ల బదిలీ ప్రక్రియలో ఒక చారిత్రాత్మక మార్పును తీసుకొచ్చింది. పింఛను పొందుతున్న వ్యక్తి మరణిస్తే, ఆ పింఛనును వారి జీవిత భాగస్వామి పేరుకు మార్చే ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో పింఛను పొందుతున్న భర్త మరణిస్తే ఆయన భార్యకు వితంతు పింఛను రావడానికి కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. కార్యాలయాల చుట్టూ తిరగడం, అధికారుల పరిశీలన వంటి కారణాల వల్ల నెలల సమయం పట్టేది.ఇక నుంచి ఆ సమస్య లేకుండా ఆదేశాలు జారీచేసింది. ఇప్పటివరకు వృద్ధాప్య పింఛను పొందుతున్న భర్త మరణించిన సందర్భంలో అతని భార్యకు మాత్రమే పింఛను మంజూరు పొందే నిబంధన ఉండేది. దీనిని దివ్యాంగులు, గీత, చేనేత




కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా పింఛనుదారులకు కూడా విస్తరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.దివ్యాంగ, గీత, చేనేత, ఇతర వర్గాలలో పింఛను పొందుతూ తమ భర్తలను కోల్పోయిన మహిళలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వారికి మద్దతుగా తక్షణ పింఛను సహాయం అందించాలని కోరుతూ సెర్ప్? సీఈఓ దివ్యా దేవరాజన్ ఇటీవల ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వీటిని తక్షణమే ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.భర్త మృతి చెందిన తర్వాత భార్యకు పింఛనుదివ్యాంగ, గీత, చేనేత కార్మికులు, డయాలసిస్, హెచ్ఐవీ, ఫైలేరియా వర్గాల కింద మరణించిన పింఛనుదారుడి భార్య వయస్సు 57 సంవత్సరాల కంటే తక్కువగా ఉంటే, వితంతు పింఛను ఇవ్వడం జరుగుతుంది. ఆమెకు 57 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు.ఇ, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుని ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రంతో పాటు సమర్పించాలి. సంబంధిత అధికారులు పత్రాలను పరిశీలిస్తారు. చేయూత పోర్టల్‌లో వివరాలను నమోదు చేసి, అర్హతను నిర్ధరిస్తారు. ఆ తర్వాత పింఛను మంజూరు చేస్తారు.

# ఉమ్మడి కృష్ణా, గుంటూరులో కూటమి ఆధిపత్యం - వైఎస్సార్‌సీపీకి షాక్



**అమరావతి :**ప్రాదేశిక ఎన్నికల్లో కూటమి కుమ్మేసింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోనూ ఆ పార్టీల అభ్యర్థులు ప్రభంజనం సృష్టించారు. అత్యధిక స్థానాలను గెలుచుకొని ప్రత్యర్థి పార్టీ గుండెల్లో గుబులు రేకెత్తించారు.మొదటి నుంచి పూర్తి ఆధిపత్యం : రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువైన కృష్ణా జిల్లాలో కూటమి కుమ్మేసింది. ప్రాదేశిక ఎన్నికల్లో మొదటి నుంచి పూర్తి ఆధిపత్యం కనబరిచింది. జిల్లాలో మొత్తం 26 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా 24 స్థానాల్లో జయ కేతనం ఎగురవేసింది. టీడీపీ 19స్థానాల్లో విజయం సాధించగా జనసేన 4, బీజేపీ ఒక స్థానంలో సత్తా చాటాయి. ప్రతిపక్ష వైఎస్సార్సీపీ ఒక్క స్థానానికే పరిమితమైంది. గన్నవరంలో మాత్రమే గెలిచింది. మొవ్వలో ఇతరులు విజయం సాధించారు. అవనిగడ్డలో కూటమి అభ్యర్థి వికుర్తి జయలక్ష్మి 10 వేల 996 ఓట్ల అత్యధిక మెజార్టీతో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారు. అత్యల్పంగా గన్నవరం జడ్పీటీసీ వైఎస్సార్సీపీ అభ్యర్థి అనగాని రవి 64 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

సత్తాచాటిన కూటమి అభ్యర్థులు : ఇక ఎంపీటీసీ ఫలితాల్లో కూటమి అభ్యర్థులే సత్తాచాటారు. జిల్లాలో మొత్తం 352 ఎంపీటీసీ స్థానాలు ఉండగా 9 ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో టీడీపీ 6, జనసేన 3 చోట్ల విజయం సాధించాయి. మిగిలిన 343 స్థానాలకు ఎన్నికలు జరగ్గా అత్యధికంగా టీడీపీ 202 స్థానాల్లో విజయకేతనం ఎగరేసింది. ఇక జనసేన అభ్యర్థులు 64, భాజపా 4స్థానాల్లో గెలుపొందారు. వైఎస్సార్సీపీ అభ్యర్థులు 62 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకున్నారు. ఇతరులు 10స్థానాల్లో విజయం సాధించారు.కూటమి ప్రభంజనం : గుంటూరు జిల్లాలో కూటమి ప్రభంజనం కొనసాగింది. జిల్లా జడ్పీ పీఠం టీడీపీ పరమైంది. మొత్తం 13 జెడ్పీటీసీల్లో 11చోట్ల కూటమి అభ్యర్థులు గెలుపొందారు. టీడీపీకి చెందిన 9 మంది అభ్యర్థులు విజయం సాధించారు. జనసేన 2, వైఎస్సార్సీపీ 2 స్థానాల్లో విజయం సాధించాయి. ఛైర్ పర్సన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కావడం జిల్లాలోని 2 ఎస్సీ మహిళా రిజర్వ్ సీట్లలో టీడీపీ అభ్యర్థులు గెలుపొందటంతో ఆ పార్టీ వారికే పదవి దక్కనుంది.గుంటూరు జిల్లాలో స్పష్టమైన ఆధిక్యం : ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి ప్రభంజనం సృష్టించింది. 200 ఎంపీటీసీలకు గాను 7 ముందుగానే ఏకగ్రీవ మయ్యాయి. ఎన్నికలు జరిగిన 193 స్థానాల్లో 122చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. జనసేన అభ్యర్థులు 34 స్థానాల్లో వైఎస్సార్సీపీ 31, స్వతంత్రులు 5, బీజేపీ 1 చోట విజయం సాధించారు. ఏకగ్రీవాలతో కలిసి మొత్తంగా కూటమి 164 ఎంపీటీసీ స్థానాలు కూటమి వశమయ్యాయి. స్వతంత్రుల్లో ముగ్గురు టీడీపీ, ఇద్దరు జనసేన రెబల్స్ కావటంతో వారు కూడా ఆయా మండలాల్లో కూటమిలో చేరే అవకాశముంది. మొత్తంగా కూటమి గుంటూరు జిల్లాలో స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది. కూటమి క్లీన్ స్వీప్ : మార్కాపురం జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేసింది. మట్టత్తం 21 జడ్పీటీసీ స్థానాలుండగా అన్నింటిలోనూ విజయం సాధించారు. టీడీపీ అభ్యర్థులు 17 స్థానాల్లో , జనసేన 3, బీజేపీ 1 స్థానంలో గెలుపొందింది. ఇక ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అత్యధిక స్థానాలు గెలుచుకుంది. 57 స్థానాల్లో టీడీపీ 41, జనసేన 2, వైఎస్సార్సీపీ 14 స్థానాల్లో గెలుపొందాయి.

## వైసీపీ పోటీలో ఉన్నా ప్రజలు తిరస్కరించారు.. కూటమికి భారీ విజయం: ఎంపీ కేశినేని చిన్ని



**విజయవాడ, నవంబర్ 9:**
స్థానిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృతజ్ఞతలు తెలిపారు. (సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నాయకత్వంపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. కూటమి పార్టీల సమన్వయం తోనే ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయని. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని వివరించారు.నాలుగు ఓట్ల తేడాతో ఒక ఎంపీటీసీ స్థానాన్ని కోల్పోయామని.. మరో స్థానంలో కేవలం ఎనిమిది ఓట్ల తేడాతో ఓటమి చెందామని ఎంపీ చెప్పుకొచ్చారు. స్వల్ప తేడాతో ఓడినా ప్రజల తీర్పును గౌరవించామన్నారు. గెలిచిన ఎంపీటీసీలు, జడ్పీటీసీలు ప్రజలకు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి గెలిచిందని అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ ఎన్టీఆర్ జిల్లాలో కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కృష్ణా జిల్లా జడ్పీ చైర్మన్ ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో ఆ పదవి తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని చిన్ని అన్నారు. గతంలో టీడీపీ ఎన్నికలను బహిష్కరిస్తే, ఈసారి వైసీపీ పోటీలో ఉన్నా ప్రజలు వారిని తిరస్కరించి కూటమికి భారీ విజయం అందించారని తెలిపారు. ఫ్యాక్షన్ రాజకీయాలు, అరాచకశక్తుల వల్లే పల్నాడు, రాయలసీమల్లో ఎన్నికల సందర్భంగా అల్లర్లు జరిగాయన్నారు. పల్నాడు, రాయలసీమ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు ముగిశాయని ఎంపీ కేశినేని చిన్ని పేర్కొన్నారు.

## స్థానిక ఎన్నికల ఫలితాలను వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు



**నెల్లూరు, నవంబరు 9:**
స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలను వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపో తున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆత్మకూరు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో అద్భుతమైన విజయాన్నికూటమికి అందించారని వ్యాఖ్యానించారు. (సోమవారం) నెల్లూరులో మంత్రి ఆనం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రెండున్నరేళ్లలో గతంలో ఎన్నడూ లేనంతగా సంక్షేమం, అభివృద్ధి పనులు తమ హయాంలో జరిగాయని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల కంటే, ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లోనూ కూటమి పార్టీలకు మెజార్టీ పెరిగిందని చెప్పుకొచ్చారు.మేకపాటి సొంతూరులోనూ టీడీపీ విజయంమేకపాటి సొంతూరులోనూ టీడీపీ విజయం సాధించిందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రస్తావించారు. దానిని బట్టి ఎంత ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయో అర్థమవుతోందని అన్నారు. రాజకీయాల్లోకి కార్పొరేట్ శక్తులు వచ్చాయిని చెప్పారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పుడు బాధపడలేదని, ప్రజానిర్ణయాన్ని గౌరవంగా స్వీకరించామని తెలిపారు. వైసీపీ నేతలకు ప్రజాస్వామ్య వ్యవస్థపై గౌరవం లేదని మండిపడ్డారు. జగన్ హయాంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి తమపై, అధికారులపై, పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ గురించి ముందు వైసీపీ నేతలు తెలుసుకోవాలని హితవు

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ఘన విజయం అభివృద్ధికే పట్టం కట్టిన ప్రజలు



**అమరావతి :**కూటమి ప్రజారంజక పాలనకు స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలే నిదర్శనమని ప్రజాప్రతినిధులు అన్నారు. రెండున్నరేళ్ల కూటమి పాలనను మెచ్చిన ప్రజలు సామాన్యులను సైతం తిరుగులేని మెజారిటీతో గెలిపించారని సంతోషం వ్యక్తం చేశారు. గెలిచిన అభ్యర్థుల విజయోత్సవ ర్యాలీల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు వారిని ఘనంగా సత్కరించారు.విజయోత్సవ ర్యాలీలో మంత్రి సవిత : ప్రాదేశిక ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు విజయోత్సవాల్లో మునిగిపోయారు. సత్య సాయి జిల్లా పెనుకొండలో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులతో కలిసి మంత్రి సవిత విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్నారు. ఎన్టీఆర్ కూడలిలో తారక రామారావు విగ్రహానికి, ట్యాంక్స్ సర్కిల్లో పరిటాల రవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ ఫలితాలు కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పని మంత్రి సవిత సంతోషం వ్యక్తం చేశారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ఘన విజయం అభివృద్ధికే పట్టం కట్టిన ప్రజలు : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టారని నెల్లూరు జిల్లా కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. ప్రాదేశిక ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులను ఎమ్మెల్యే అభినందించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందిస్తున్న కూటమికి ప్రజలు మద్దతుగా నిలిచారన్నారు. కోవూరు నియోజకవర్గంలో 5 జడ్పీటీసీ, 70 ఎంపీటీసీ స్థానాలను గెలిచి సత్తా చాటామన్నారు. అనంతపురం జిల్లా రాయదుర్గంలో కూటమి అఖండ విజయంపై ప్రభుత్వ విప్ కాల్వ శ్రీనివాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఛైర్ పర్సన్ స్థానం ఎస్సీ మహిళకు రిజర్వు కావడం జిల్లాలోని 2 ఎస్సీ మహిళా రిజర్వ్ సీట్లలో టీడీపీ అభ్యర్థులు గెలుపొందటంతో ఆ పార్టీ వారికే పదవి దక్కనుంది.గుంటూరు జిల్లాలో స్పష్టమైన ఆధిక్యం : ఎంపీటీసీ ఎన్నికల్లోనూ కూటమి ప్రభంజనం సృష్టించింది. 200 ఎంపీటీసీలకు గాను 7 ముందుగానే ఏకగ్రీవ మయ్యాయి. ఎన్నికలు జరిగిన 193 స్థానాల్లో 122చోట్ల టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. జనసేన అభ్యర్థులు 34 స్థానాల్లో వైఎస్సార్సీపీ 31, స్వతంత్రులు 5, బీజేపీ 1 చోట విజయం సాధించారు. ఏకగ్రీవాలతో కలిసి మొత్తంగా కూటమి 164 ఎంపీటీసీ స్థానాలు కూటమి వశమయ్యాయి. స్వతంత్రుల్లో ముగ్గురు టీడీపీ, ఇద్దరు జనసేన రెబల్స్ కావటంతో వారు కూడా ఆయా మండలాల్లో కూటమిలో చేరే అవకాశముంది. ఈ గెలుపు కష్టపడి పనిచేసిన ప్రతి ఒక్క కార్యకర్తదని అన్నారు.కూటమి అభ్యర్థుల ఘన విజయం : పరిషత్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయంపై కోనసీమ జిల్లా పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. గెలిచిన ఎంపీటీసీ , జడ్పీటీసీ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు గుత్తుల సాయి శ్రీనివాస్ పాల్గొన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల జడ్పీటీసీగా గెలుపొందిన కందుల రామిరెడ్డి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఓట్లేసిన ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నా రు. కూటమి నాయకలు, కార్యకర్తలతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు.నగరమైనా, పట్టణమైనా, పల్లెలైనా ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికే జై కొట్టారు. ఓటమి లేని కూటమి జైత్రయాత్ర జనం మనపై పెట్టుకున్న నమ్మకం, మనకు అప్పగించిన బాధ్యత అని ప్రజా ప్రతినిధులు అన్నారు.

# ఏపీలో మూడు చోట్ల భారీ అగ్నిప్రమాదాలు.. ఘటనలపై సీఎం చంద్రబాబు ఆరా



**అమరావతి, నవంబర్ 9:** రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ అగ్నిప్రమాదాలు సంభవించాయి. రాజాం, గన్నవరం, తిరువూరులో జరిగిన ప్రమాదాల్లో షాపులు దగ్ధమవడంతో పాటు భారీగా ఆస్తినష్టం వాటిల్లింది. ఈ మూడు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయనగరం జిల్లా రాజాంలోని ఓ ఆటోమొబైల్ షోరూమ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో భారీఎత్తున ఆస్తినష్టం జరిగింది. దీపావళి టపాసులు ప్రమాదవశాత్తు షోరూమ్‌పై పడి మంటలు అంటుకోవటంతో షోరూమ్ దగ్ధమైంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం చోటు చేసుకుంది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఆర్పివేసినట్టు ముఖ్యమంత్రికి అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు తెలియజేశారు.కృష్ణా జిల్లా గన్నవరంలో బాణసంచా కాలుస్తుండగా నిప్పు రవ్వలు ఎగిరిపడి ఓ ఫర్నిచర్ దుకాణానికి మంటలు అంటుకున్నాయి. తిరువూరులోని మరో దుకాణంలోనూ షార్ట్ సర్క్యూట్ జరిగి షాపు దగ్ధమైంది. మంటల కారణంగా ఆస్తినష్టం జరగటంపై సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ మూడు ఘటనలపై ఆరా తీసి జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.అగ్నిప్రమాదాలపై హోంమంత్రి అనితఏపీలోని మూడు ప్రాంతాల్లో జరిగిన అగ్నిప్రమాదాలపై హోంమంత్రి వంగలపూడి అనిత కూడా ఆరా తీశారు. విజయనగరం జిల్లా రాజాంలో ఆటోమొబైల్ షోరూమ్ అగ్నిప్రమాదం సంభవించగా.. కృష్ణా జిల్లా గన్నవరంలో బాణసంచా నిప్పురవ్వలతో ఫర్నిచర్ దుకాణంలో మంటలు చెలరేగాయి. తిరువూరులో షార్ట్ సర్క్యూట్‌తో మరో దుకాణం దగ్ధమైంది. ఈ మూడు అగ్నిప్రమాదాల వివరాలను హోంమంత్రి.. అధికారులను అడిగి తెలుసుకున్నారు. అగ్నిప్రమాదాల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు అనిత సూచనలు చేశారు.

## ఎన్నికలు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా జరిగాయనడం విడ్డూరం: మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు



**అమరావతి, నవంబర్ 9:**
ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల తీరుపై వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ బాబు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలను పూర్తిగా స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా (ఫ్రీ అండ్ ఫెయిర్) నిర్వహించామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును తీవ్రంగా ఆక్షేపించా రు."స్థానిక సంస్థల ఎన్నికలను ఫ్రీ అండ్ ఫెయిర్ గా నిర్వహించామని సీఎం చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉంది. అసలు ఇలాంటి ఎన్నికలు గతంలో చూడలేదు. భవిష్యత్‌లో కూడా చూడము. చంద్రబాబు ఓ మాఫియా డాన్ మాదిరిగా వ్యవహరించి ఎన్నికలను నిర్వహించి.. ఇప్పుడు ఫ్రీ అండ్ ఫెయిర్‌గా ఎన్నికలు నిర్వహించామని చెప్పడం సిగ్గుచేటు" అని సుధాకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పార్టీ బలంగా ఉన్న నియోజకవర్గాలను ప్రత్యేకంగా టార్గెట్ చేసి మరీ అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.


## లోకేశ్ ఆదేశాలతోనే వైసీపీ నేతలపై తప్పుడు కేసులు: అంబటి రాంబాబు

**అమరావతి, నవంబర్ 9:**



కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని... ఇందులో భాగంగానే వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతోనే రాష్ట్రంలో ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గుంటూరు జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ తలశిల రఘు రాం, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త డైమండ్ బాబు ములాఖత్ ద్వారా పరామర్శించారు. అనంతరం జైలు వెలుపల అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు.ప్రశాంతంగా ఉండే గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం దుష్ట సంప్రదాయాలకు తెరతీసిందని అంబటి విమర్శించారు. "ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత బస్సులో నుంచి వెంగళాయపాలెం బ్యాలెట్ బాక్స్‌ను కిందకు ఎందుకు దించారు? ఓ చిన్న ఘటనను అడ్డంపెట్టుకుని కేసు నమోదు చేయడం అత్యంత దుర్మార్గం. ఎలాగైనా సరే అప్పిరెడ్డిని జైల్లో పెట్టాలనే ఉద్దేశంతో లోకేశ్, ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కుట్ర పన్నారు" అని అంబటి ఆరోపించారు.

## అభివృద్ధికి దక్కిన ఆమోదం ఈ విజయం - అందరికీ కృతజ్ఞతలు




**అమరావతి, నవంబర్ 9:**స్థానిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్సీపీని మరింతగా తిరస్కరించి కూటమికి ఘన విజయాన్ని అందించారని తెలుగుదేశం అధినేత చంద్రబాబు స్పష్టం చేశారు. పట్టణాలు, పల్లెలు, అన్ని వర్గాల్లోనూ కూటమికి ఒకే తరహా మద్దతు లభించిందని తెలిపారు. ప్రశాంతంగా జరిగిన ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించారని చెప్పారు. కూటమి అభ్యర్థులను గెలిపించిన రాష్ట్ర ప్రజలందరికీ శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని చంద్రబాబు అన్నారు. రెండున్నరేళ్ల పాలనలో అభివృద్ధికి, సుపరిపాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమే ఈ ఫలితాలని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికల ఫలితాలపై చంద్రబాబు మీడియా సమావేశంలో మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల కంటే కూటమికి ప్రజాదరణ పెరిగిందని వివరించారు.కేడర్ బేస్ పార్టీ టీడీపీ అని, సేవా భావమే తమ రాజకీయ విధానమని చంద్రబాబు తేల్చిచెప్పారు. రాజకీయాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుడుతూ కూటమిగా పని చేశామని, అన్ని జిల్లాల్లోనూ ప్రజలు కూటమి వైపే మొగ్గు చూపారని తెలిపారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, పల్నాడు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ప్రజా మద్దతు లభించలేదని వివరించారు. రెండున్నరేళ్లుగా రాష్ట్ర అభివృద్ధి, సుపరిపాలన కోసం కృషి చేశామని, విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని పునరుద్ధరించేలా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించామని గుర్తు చేశారు.కూటమికి ప్రజాదరణ మరింత పెరిగింది : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి ప్రజాదరణ మరింత పెరిగిందని ఓట్ల శాతం స్పష్టం చేస్తోందని తెలుగుదేశం అధినేత చంద్రబాబు తెలిపారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కలిపి కూటమి 58.9 శాతం ఓట్లు సాధించిందని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో వచ్చిన 55.3 శాతం ఓట్లతో పోలిస్తే ఆదరణ పెరిగిందని వివరించారు. స్థానిక ఎన్నికల్లో కూటమికి, వైఎస్సార్సీపీకి మధ్య ఓట్ల శాతంలో 25.34 శాతం వ్యత్యాసం ఉందన్నారు. పట్టణాల్లో ఎన్డీఏకు 59.9 శాతం, వైఎస్సార్సీపీకి 34.3 శాతం ఓట్లు వచ్చాయని, కూటమి స్ట్రైక్ రేట్ 94 శాతంగా ఉందని వివరించారు.జడ్పీటీసీ ఎన్నికల్లో ఎన్డీఏ 57.6 శాతం, వైఎస్సార్సీపీ 39.7 శాతం ఓట్లు సాధించాయని, కూటమి స్ట్రైక్ రేట్ 87.5 శాతంగా నమోదైందని సీఎం చంద్రబాబు తెలిపారు. పట్టణాల్లో కూటమి, వైఎస్సార్సీపీ మధ్య ఓట్ల శాతం వ్యత్యాసం 25.60 శాతం కాగా గ్రామీణ ప్రాంతాల్లో 17.9 శాతంగా ఉందన్నారు. మొత్తం 9,818 ఎంపీటీసీ స్థానాలకు గానూ కూటమి 7,803 స్థానాలను గెలుచుకుందని, రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మండల అధ్యక్ష స్థానాలను దక్కించుకుందని వెల్లడించారు.ఆ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదు : పట్టణాల్లో ఎన్డీఏకు 65.7 శాతం, వైఎస్సార్సీపీకి 27.42 శాతం పోస్టల్ బ్యాలెట్లు రాగా, పరిషత్ ఎన్నికల్లో కూటమికి 62.83 శాతం, వైఎస్సార్సీపీకి 31.46 శాతం వచ్చాయని వివరించారు. మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు గానూ కూటమి 575 స్థానాలను గెలుచుకుందని, 28 జిల్లాలకు 27 జిల్లాల్లో ఆధిక్యత సాధించిందని చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ కూటమి కంటే ఎక్కువ స్థానాలు గెలుచుకుందని, ఏడు జిల్లాల్లో వైఎస్సార్సీపీకి ఒక్క జడ్పీటీసీ స్థానం కూడా దక్కలేదని వివరించారు. అనకాపల్లి, కోనసీమ, కాకినాడ, మార్కాపురం, పల్నాడు, పశ్చిమ గోదావరి, విశాఖ జిల్లాల్లో వైఎస్సార్సీపీ ఖాతా తెరవలేదని వెల్లడించారు.

# 'దేశంలో వాయు కాలుష్యం వల్ల 20 లక్షల మరణాలు'

**న్యూ ఢిల్లీ :** దేశంలో వాయు కాలుష్యం తీవ్ర ఆరోగ్య సంక్షోభంగా మారుతోందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేసింది. 2023లో భారత్? సుమారు 20 లక్షల మరణాలను వాయు కాలుష్యమే కారణమని పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ కన్సల్టింగ్ సంస్థ ఈవై నివేదిక వెల్లడించినట్లు పేర్కొంది. ఈ అంశంపై మోదీ సర్కార్? నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ విమర్శించారు. ఫక్కీ-ఈవై రూపొందించిన నివేదికను ప్రస్తావిస్తూ జైరాం రమేశ్ సోమవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.'వాయు కాలుష్యం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, మరణాలపై కేంద్ర ప్రభుత్వం చాలాకాలంగా వాస్తవాలను అంగీకరించడం లేదు. పార్లమెంటులోనూ, బయటా పలు అధ్యయనాలను భారత్?కు ప్రత్యేకమైనవి కావనే కారణంతో ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఎంత ముఖ్యమో, ప్రజలు స్వచ్ఛమైన గాలిని పీల్చుకునే పరిస్థితులు కల్పించడం అంతకంటే ముఖ్యం. పీఎం2.5 సూక్ష్మ ధూళి కణాలు దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రాణాంతకంగా మారాయి' అని జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణకు మూడు



సూచనలుఫిక్కీ-ఈవై నివేదిక నేపథ్యంలో దేశవ్యాప్తంగా వాయు కాలుష్య నియంత్రణకు మూడు కీలక మార్పులు చేపట్టాలని జైరాం రమేశ్ సూచించారు.ప్రమాణాల కఠినతరం: పీఎం2.5, ఓజోన్ కాలుష్యానికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మార్గదర్శకాలకు అనుగుణంగా భద్రతా ప్రమాణాలను సవరించాలి.జాతీయ కార్యక్రమంలో మార్పులు: జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సీఏపీ)ను పునర్వ్యవస్థీకరించి, సూక్ష్మ ధూళి కణాలు, ఓజోన్ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వాలి.కొత్త చట్టం: 1981 నాటి వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం స్థాన ంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యమి చ్చే సమగ్ర స్వచ్ఛ వాయు చట్టాన్ని తీసుకురావాలి. దిల్లీ కాలుష్యంపై పవన్ ఖేడా విమర్శలుదేశ రాజ ధానిలో వాయు కాలుష్యం అదుపు తప్పుతు న్నా ప్రభుత్వాలు సమర్థం గా చర్యలు తీసుకోవడం లేదని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా విమర్శి ంచారు. దిల్లీలో కేంద్రంతో పాటు రాష్ట్రంలోనూ బీజేపీ అధికారంలో ఉన్నందున కాలుష్య సమస్యకు ఇతరులను బాధ్యులుగా చూపే అవకాశం లేదన్నారు. గతంలో ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ పరస్పరం విమర్శించుకున్నాయని, కానీ ప్రజలు మాత్రం కాలుష్యంతో ఇబ్బందులు పడుతూనే ఉన్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు విధించిన ఆంక్షలను అమలు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యం జరుగుతోందని ప్రశ్నించారు. ఇది పాలనా వైఫల్యమా? లేక న్యాయస్థానం ఉద్దేశపూర్వకంగా పట్టించుకోకపోవడమా? అని నిలదీశారు.టపాసులకు అనుమతులపై రషీద్ అల్వీ అగ్రహందీపావళి సందర్భంగా టపాసులు కాల్చేందుకు ప్రత్యేక సమయాన్ని కేటాయించడంపైనా కాంగ్రెస్ నేత రషీద్ అల్వీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రమాదకర స్థాయిలో కాలుష్యం ఉన్నప్పుడు బాణసంచా కాల్చేందుకు అనుమతులు ఇవ్వడం ప్రజారోగ్యానికి హానికరమని అన్నారు. అధికారం, ఓట్ల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని విమర్శించారు. సుప్రీంకోర్టు సూచించిన సమయ పరిమితి సూత్రప్రాయంగా సరైనదేనని, అయితే దాన్ని ప్రజలు పాటించకపోవడం మరో సమస్యని పేర్కొన్నారు. బాణసంచా కాల్చేందుకు అనుమతులు ఇచ్చే వారిని ప్రజల శత్రువులుగా భావిస్తానని వ్యాఖ్యానించారు.దిల్లీలో 400కు చేరువైన ఏక్యూఐదీపావళి వేడుకల మరుసటి రోజు సోమవారం ఉదయం దిల్లీలో గాలి నాణ్యత తీవ్రంగా పడిపోయింది. వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 400 మార్కును తాకడంతో రాజధానిలోని పలు ప్రాంతాలను దట్టమైన పొగమంచు కమ్మేసింది. తెల్లవారుజామున రహదారులపై దృశ్యమానత కూడా తగ్గిపోయింది. గాలి నాణ్యత 'సీవియర్' (తీవ్ర) స్థాయికి చేరువ కావడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది.

# యూపీ ఎన్నికలు.. 209 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఖరారు




**యూపీ :** వచ్చే ఏడాది యూపీ ఎన్నికలకు అధికార బీజేపీ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దీపావళి ముగిసిన వెంటనే కార్యరంగంలోకి దిగింది. ఇప్పటికే 209 స్థానాలకు అభ్యర్థుల పేర్లు ఖరారైనట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. తుది అనుమతుల కోసం ఈ జాబితాను కేంద్ర నాయకత్వానికి పంపించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో 300 పైచిలుకు స్థానాల్లో విజయం సాధించి మూడోసారి అధికార పగ్గాలు చేపట్టే లక్ష్యంగా బీజేపీ వడివడిగా అడుగులు వేస్తోంది.దీపావళి ముగిసిన మరుసటి రోజే రాష్ట్ర నాయకత్వం క్షేత్రస్థాయిలో ఎన్నికల ఏర్పాట్లు ప్రారంభించింది. మొత్తం 403 స్థానాలకు గాను 209 స్థానాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు ప్రచారానికి, ప్రజలతో మమేకం అయ్యేందుకు తగినంత సమయం ఉండాలనే లక్ష్యంతో ముందుగా అభ్యర్థుల జాబితాను రాష్ట్ర నాయకత్వం సిద్ధం చేసినట్లు సమాచారం.జాతీయ మీడియా కథనాల ప్రకారం, తొలి దశలో అభ్యర్థులుగా ఖరారైన వారిని ఏ కేటగిరీగా పార్టీ పరిగణిస్తోందని సమాచారం. సీఎం యోగితో సమాలోచనల అనంతరం వీరి పేర్లు ఖరారయ్యాయి. కేంద్ర నాయకత్వం నుంచి తుది అనుమతులు రాగానే అభ్యర్థులకు ఎన్నికల ఏర్పాట్లు చేసుకునేందుకు రాష్ట్ర నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. ఈసారి ఎన్నికల్లో పార్టీ నాయకత్వం రాష్ట్రంలోని మహిళా ఓటర్లపై ప్రత్యేక ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. మహిళల అభ్యున్నతికి ప్రత్యేక ప్యాకేజీ తెస్తున్నామని సీఎం యోగి ఆదివారం నాడు ప్రకటించిన విషయం తెలిసిందే.

# వందేళ్ల ప్రస్థానంలో స్వార్థం లేని 'స్వయంసేవకులే' ఆర్ఎస్ఎస్‌కు గుర్తింపు:




**న్యూ ఢిల్లీ :**వందేళ్ల ప్రస్థానంలో స్వార్థం లేని 'స్వయంసేవకులే' ఆర్ఎస్ఎస్‌కు అసలైన గుర్తింపు అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అధినేత మోహన్ భాగవత్ వ్యాఖ్యానించారు. ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజ శ్రేయస్సు కోసమే పనిచేసేవారే ప్రచారకులని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) నాగ్‌పూర్ నాగరిక్ సహకారి బ్యాంక్ నూతన ఆడిటోరియాన్ని మోహన్ భాగవత్ ప్రారంభించి, ప్రసంగించారు.ప్రావిన్స్ అసెంబ్లీలో ఇబ్రహీం వాదించారు..1930లలో ఆర్ఎస్ఎస్‌పై తొలి నిషేధ యత్నం నాటి ఆసక్తికర ఘట్టాన్ని ఈ సందర్భంగా మోహన్ భాగవత్ గుర్తుచేశారు. నాటి రోజుల్లో ఆర్ఎస్ఎస్‌ను సమర్థించే స్వయంసేవకులు, భావజాల మద్దతుదారులు గానీ సెంట్రల్ ప్రావిన్స్ అసెంబ్లీలో లేరని చెప్పుకొచ్చారు. ఆర్ఎస్ఎస్‌పై తొలి నిషేధయత్నం జరిగినప్పుడు సభలో మద్దతు తెలిపిన ఏకైక వ్యక్తి ఇబ్రహీం అని ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్ మతతత్వ సంస్థ కాదని, నిషేధించవద్దని నాటి సెంట్రల్ ప్రావిన్స్ అసెంబ్లీలో ఇబ్రహీం వాదించారని మోహన్ భాగవత్ పేర్కొన్నారు.

# దీపావళి వేళ భారీ అగ్నిప్రమాదాలు- మూడు వేర్వేరు ఘటనల్లో 18 మంది మృతి

**న్యూ ఢిల్లీ :** దీపావళి పండుగ ముగిసిన మరుసటి రోజు మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్?లో వరుస అగ్నిప్రమాదాలు తీవ్ర విషాదాన్ని నింపాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం తెల్లవారుజాము వరకు మూడు వేర్వేరు ప్రాంతాల్లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనల్లో చిన్నారులు, మహిళలు సహా మొత్తం 18 మంది ప్రాణాలు కోల్పోయారు. సియోనీ, కట్నీ జిల్లాల్లో జరిగిన ప్రమాదాల్లో రెండు కుటుంబాలకు చెందిన 12 మంది మృతిచెందగా, ఉత్తర ప్రదేశ్‌లో విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొనడంతో మంటలు చెలరేగి ఆరుగురు సజీవదహనమయ్యారు.సియోనీలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి సియోనీ జిల్లా ఛపారా పట్టణంలోని మహావీర్ వార్డులో సోమవారం తెల్లవారుజామున ఘోర అగ్నిప్రమాదం జరిగింది. జైన ఆలయం సమీపంలో బంగారు ఆభరణాల వ్యాపారి కుందన్‌లాల్ సోనీకి చెందిన మూడు అంతస్తుల భవనంలో ఉదయం 4 నుంచి 4.30 గంటల మధ్య మంటలు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో పది మంది ఉండగా, ఆరుగురు మృతిచెందారు. మరో నలుగురిని సహాయక బృందాలు సురక్షితంగా



బయటకు తీసుకొచ్చాయి. మృతులను కుందన్‌లాల్ సోనీ (75), ఆయన భార్య రాజ్‌కుమారి సోనీ (65), రీతూ సోనీ (42), స్మృతి సోనీ (40), సూర్య సోనీ (45), ఆదిత్య సోనీ (16)గా గుర్తించారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఓ మైనర్ ఉన్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే ప్రాణనష్టం జరిగింది. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు.కట్నీలో తల్లి ఒడిలోనే శిశువు మృతి కట్నీ జిల్లాలోని బర్హి పట్టణంలో మరో విషాద ఘటన జరిగింది. మూడు అంతస్తుల భవనంలోని ప్లాస్టిక్ దుకాణంలో అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే భవనం మొత్తం అగ్నికి ఆహుతైంది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతులను దుకాణం నిర్వహిస్తున్న పురాణ్ అగర్వాల్ (77), ఆయన భార్య చంద్రకళ (74), కోడలు పూనమ్, మనవరాళ్లు ఆర్య (14), అన్వి (6), రెండు నెలల పసికందుగా గుర్తించారు. మంటలు వ్యాపించిన సమయంలో పసికందు తల్లి పూనమ్ ఒడిలోనే ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. తల్లితో పాటు చిన్నారి కూడా ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచివేసింది. ఈ ఘటనతో పట్టణంలో విషాద ఛాయలు అలముకున్నాయి.యూపీలో కారు దగ్ధం ఆరుగురు సజీవదహనం ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో సోమవారం మరో ఘోర ప్రమాదం జరిగింది. షామ్లీ హైవేపై వెళ్తున్న కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు సజీవదహనమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో చిక్కుకున్న వారిని బయటకు తీసి జిల్లా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే వారు మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దుకాణాల పైన ఉన్న ఇంట్లో పది మంది కుటుంబ సభ్యులు చిక్కుకుపోయారు.హాయక చర్యలు చేపట్టారు. పది మందినీ బయటకు తీసుకొచ్చినప్పటికీ, 107 ఏళ్ల వృద్ధుడు మోహన్‌లాల్ తీవ్రంగా పొగ పీల్చడంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆయనను ప్రభుత్వ చరక్ భవన్ ఆసుపత్రికి తరలించగా,చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

# బంగ్లాకు తిరిగి వెళ్లేందుకు హసీనా ప్లాన్ కొత్త పాస్‌పోర్ట్ కోసం దిల్లీలో దరఖాస్తు

**న్యూ ఢిల్లీ :** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిసెంబర్‌లో తన స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు సిద్ధమవుతోన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా తనకు కొత్త పాస్‌పోర్ట్, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని కోరుతూ దిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. 2024లో ఆగస్టులో బంగ్లాదేశ్‌లో చెలరేగిన తీవ్ర ఆందోళనల కారణంగా 15 ఏళ్ల పాలనకు ముగింపు పలికి హసీనా భారత్‌కు వచ్చారు. రెండేళ్ల తర్వాత బంగ్లాదేశ్ అధికారులతో తొలిసారి అధికారిక సంప్రదింపులు జరిపారు. లండన్‌కు చెందిన మ్యాట్రిక్స్ ఛాంబర్స్‌లోని హసీనా తరపు న్యాయవాదులు దిల్లీలోని బంగ్లాదేశ్ తాత్కాలిక హైకమిషనర్ ప్రీతి రెహ్మాన్‌కు లేఖను సమర్పించారు. ఆమె స్వదేశానికి తిరిగి వెళ్లేందుకు వీలుగా కొత్త పత్రాలను జారీ చేయాలని ఆ లేఖలో కోరారు. బంగ్లాదేశ్ పౌరురాలిగా ఆమెకున్న హక్కులను, అంతర్జాతీయ మానవ హక్కుల నిబంధనలను ప్రస్తావిస్తూ ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి అక్కడి కోర్టులో లొంగిపోవాలని హసీనా భావిస్తున్నట్లు సమాచారం. అవసరమైన ప్రక్రియలన్నీ పూర్తయిన తర్వాత ఆమె ప్రయాణ తేదీని ప్రకటిస్తామని ఆమె తరపు న్యాయవాదులు వెల్లడించారు."హసీనాను స్వదేశానికి తిరిగి రావడం దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. గత ప్రభుత్వం ఆమె పత్రాలను రద్దు చేసినందున, హసీనా బంగ్లాదేశ్ పౌరురాలిగా తన ప్రాథమిక హక్కులను తిరిగి పొందేందుకు



అవసరమైన పత్రాలను స్వీకరించాలని ఎదురుచూస్తున్నారు. ఆమె డిసెంబర్ నాటికి బంగ్లాదేశ్‌కు తిరిగి రావాలని నిశ్చయించుకున్నారు. ఆమె నిస్సందేహంగా స్వదేశానికి తిరిగి వస్తారు." అని హసీనా సహాయకుడు అబు ఒబైదా అరిన్ తెలిపారు. అయితే, హసీనా నిర్ణయంపై బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి వెంటనే ఎలాంటి స్పందన లేదు.మా దృష్టిలో హసీనా ఎప్పటికీ నేరస్థురాలే: బంగ్లాదేశ్ ఇదిలా ఉండగా, అంతకుముందు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న విషయంపై బంగ్లాదేశ్ న్యాయశాఖ మంత్రి అసదుజ్జమాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. దోషిగా తేలిన హసీనాను భారత్ నుంచి బంగ్లాదేశ్‌కు తిరిగి తీసుకురావడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. హసీనాను తమకు అప్పగించాలని కోరుతూ భారత్‌కు ఇప్పటికే పలుమార్లు లేఖ రాసినట్లు తెలిపారు. అయినా ఎటువంటి సమాధానం రాలేదని అన్నారు. తన దృష్టిలో హసీనా ఒక నేరస్థురాలని ఆయన పేర్కొన్నారు. తమ దేశ ట్రైబ్యునల్ ఆమెను దోషిగా నిర్ధారించిందని చెప్పారు. భారత్ నుంచి హసీనాను తిరిగి రప్పించేందుకు తమ ప్రభుత్వం చట్టపరంగా అన్ని చర్యలు తీసుకుంటోందని, నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తామని స్పష్టంచేశారు. ఈ విషయంలో తన శాఖకు నేరుగా సంబంధం లేకపోయినా, భారత్‌తో ఉన్న నేరస్థుల అప్పగింత ఒప్పందం ప్రకారం బంగ్లాదేశ్ హోంశాఖ దీనిని పర్యవేక్షిస్తోందని తెలిపారు.'నా దృష్టిలో హసీనా ఒక నేరస్థురాలు. మా ట్రైబ్యునల్ ఆమెను దోషిగా నిర్ధారించింది. బంగ్లాదేశ్ ప్రజలలో ఇదే ఆమెకు ఉన్న గుర్తింపు. హసీనాను ఎప్పటికైనా, ఎలాగైనా బంగ్లాదేశ్‌కు తీసుకువస్తాం. తగినశిక్ష విధిస్తాం. కానీ ఈ విషయంలో న్యాయ శాఖకు ప్రత్యక్ష ప్రమేయం ఉండదు. ఎందుకంటే ఆమె మరో దేశంలో ఉన్నారు కాబట్టి దీనిని హోం మంత్రిత్వ శాఖ చూసుకుంటోంది. ఒకవేళ వారు ఆమెను మాకు అప్పగిస్తే ఎటువంటి భావోద్వేగాలకు తావులేకుండా ఈ విషయాన్ని చట్టప్రకారం పరిష్కరిస్తాం. మరోవైపు హసీనా అప్పగింతపై బంగ్లాదేశ్ నుంచి అభ్యర్థనలు అందినట్లు భారత్ గతంలోనే ధ్రువీకరించింది. అయితే ఆమెను అప్పగించే విషయంపై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించలేదు.

# ముస్లిం రైతు ఇచ్చిన పాలు తాగిన అస్సాం సీఎం



**అస్సాం:**అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఒక ముస్లిం రైతు ఇచ్చిన పాలను వేదికపైనే తాగారు. ఈనెల 7న నాగావ్ జిల్లా సమాగురిలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో ఈ ఘటన జరిగింది. తన సొంత డెయిరీ ఫామ్‌లో ఉత్పత్తి చేసిన పాలను ముహమ్మద్ సోహబ్ అలీ అనే రైతు.. ముఖ్యమంత్రి హిమంతకు అందజేశారు. 'అవి ఆవు పాలా? గేదె పాలా?' అని హిమంత అడగ్గా.. ఆవు పాలని రైతు సమాధాన మిచ్చాడు. దీంతో హిమంత ఆ బాటిల్ నుంచి కొంత పాలు తాగారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు. సోహబ్ అలీ ఇచ్చిన బహుమతిని 'డెయిరీ లిషియస్ గిఫ్ట్' గా అభివర్ణించారు. పాడి రైతులు లాభదాయకంగా వ్యాపారం నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటోందని తెలిపారు. అస్సాంలో రోజువారీ పాల ఉత్పత్తిని 10 లక్షల లీటర్లకు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని సీఎం పేర్కొన్నారు.

# మా దేశంలో అస్థిరతకు భారత్ కుట్ర: అజిత్ డోభాల్‌పై పాకిస్థాన్ ఆరోపణలు

**న్యూఢిల్లీ:**భారత్ తమ దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తోందని పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)లో జరిగిన ఓ కార్యక్రమంలో పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ మజర్ జమిల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 13న ఆయన చేసిన ప్రసంగానికి సంబంధించిన పూర్తి వివరాలు, రికార్డింగ్ తాజాగా బయటకు రావడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది."దక్షిణాసియాలో అణు నిరోధకత, వ్యూహాత్మక స్థిరత్వం" అనే అంశంపై ప్రసంగించిన మజర్ జమిల్.. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ను ప్రస్తావిస్తూ "డోభాల్ డాక్ట్రిన్"ను అమలు చేస్తూ పాకిస్థాన్‌ను బలహీనపరిచేందుకు భారత్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి ఉగ్రవాద సంస్థలకు భారత్ మద్దతిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ముక్తి వాహినికి, 1980లలో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని, అలాగే 2001-2014 మధ్య ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దులో అనేక కాన్సులేట్లను నడిపిందని ఆయన చారిత్రక ఉదాహరణలను ప్రస్తావించారు.

# 88 రోజులైనా ఇంకా ముగియని పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూ ఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిసినప్పటికీ, అధికా రికంగా 'ప్రోరోగ్' (సమావేశాల ముగింపు ప్రకటన) కాకుండా రికార్డు స్థాయిలో 88 రోజులుగా కొనసాగుతుండటం దేశ పార్లమెంటరీ చరిత్రలో ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. ఆగస్టు 13న లోక్‌సభ, రాజ్యసభలు రెండూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ సమావేశాలను అధికారికంగా ముగించలేదు. దీంతో 2008 నాటి 87 రోజుల పాత రికార్డు బద్దలు అయ్యింది. సోమవారం ఉదయానికి పార్లమెంట్ ఉభయ సభలు ప్రోరోగ్ కాకపోవడం ఈ రికార్డ్ నమోదైంది.ఆ రాజ్యాంగ సవరణ కోసం ప్రోరోగ్ చేయలేదా?వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు ప్రకటించకపోవడం వల్ల పార్లమెంట్‌ను తక్కువ వ్యవధిలోనే తిరిగి సమావేశపర్చే అవకాశం ఉందనే ఊహాగానాలు మొదలయ్యాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు సంబంధించి రాజ్యాంగ సవరణను చేపట్టేందుకు మోదీ ప్రభుత్వం ఇలా చేస్తోందని భావిస్తున్నారు. 131వ రాజ్యాంగ సవరణ ద్వారా



నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) చేపట్టి లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతం ఉన్న 543 నుంచి గరిష్ఠంగా 850కి పెంచాలని కేంద్ర సర్కార్ లక్ష్యంగా పెట్టుకుంది.
గతంలో బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏప్రిల్ 17న జరిగిన ప్రత్యేక సమావేశంలో మహిళలకు 2029 నుంచి చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. మహిళా రిజర్వేషన్ చట్టం సవరణ బిల్లు అవసరమైన మెజారిటీని సాధించలేక విఫలమైంది. అందుకే మరోసారి ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి నెగ్గించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. మద్దతు కోసం ఇప్పటికే విపక్షంలోని పలు పార్టీలు, డీఎంకే, ఎన్‌సీపీ(శరద్ పవార్) వర్గంతో చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ క్రమంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను ప్రోరోగ్ చేయకుండా ఉంచిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జారీ చేయలేదంటూ ప్రశ్నించింది. సాధారణంగా లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడిన రెండు నుంచి నాలుగు రోజుల్లో ప్రోరోగేషన్ ప్రక్రియ పూర్తవుతుందని గుర్తు చేసింది. డీలిమిటేషన్‌తో ముడిపడిన రాజ్యాంగ సవరణ బిల్లును ప్రత్యేక సమావేశంలో ఆమోదించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా అవసరమైన మూడింట రెండొంతుల మెజార్టీ కోసం ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించింది.

# శివకేశవుల ఆరాధన సహా- నెలంతా పండుగలే ఉండే కార్తిక మాసం విశేషాలు ఇవే!



తెలుగు సంవత్సరాలలో ఎనిమిదో మాసమైన కార్తిక మాసం అత్యంత పవిత్రమైన మాసం. శివకేశవుల ఆరాధనకు విశిష్టమైన ఈ మాసంలో శివునికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, విష్ణుమూర్తికి తులసి పూజలు, దీపారాధనలు చేయడం వల్ల విశేష పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. నవంబర్ 10, మంగళవారం నుంచి కార్తిక మాసం ప్రారంభం కానున్న సందర్భంగా కార్తిక మాసం విశిష్టత గురించి, ఈ మాసంలో ప్రధాన విశేషాల గురించి తెలుసుకుందాం.

### పరమ పవిత్రం కార్తికం

స్నాన, దాన, జపాలు, ఉపవాస వ్రతాలు, దీపారాధనలు, వనభోజనాలు వంటి సత్కర్మల ద్వారా జన్మాంతర పాపాలను ప్రక్షాళన చేసి అనంతమైన పుణ్యఫలాలను ప్రసాదించే మహిమాన్వితమైన మాసం కార్తిక మాసం. చాంద్రమానం ప్రకారం ఎనిమిదో మాసమైన కార్తిక మాసంలో పౌర్ణమి నాడు పూర్ణ చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరించడం మాసానికి కార్తిక మాసమని పేరు వచ్చింది.

### పురాణోక్తి

కార్తిక మాసానికి సమానమైన మాసం లేదు, గంగతో సమానమైన తీర్థం లేదు, శ్రీ మహావిష్ణువుకు సమానమైన దేవుడు లేదు, వేదంతో సమానమైన గ్రంథం లేదని స్కంద పురాణంలో కార్తిక మాస మహత్యాన్ని వివరించి ఉంది.

### హరిహరాదులకు ప్రీతికరం – కార్తికం

భారతీయ సనాతన సంప్రదాయంలో కార్తిక మాసం వచ్చిందంటే చాలు ఇటు శివ భక్తులకు, అటు శ్రీ వైష్ణవ సంప్రదాయం పాటించేవారికి నెలంతా పండుగే! హరిహరాదులకు ప్రీతికరమైన ఈ మాసంలో భక్తులు చేపట్టే ఉపవాస దీక్షలకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇటు బిల్వార్చనలు, శివాభిషేకాలతో పరవశించే శివ భక్తులు, అటు విష్ణు సహస్రనామ పారాయణలతో, తులసి పూజలతో, ఏకాదశి ద్వాదశి వ్రతాలతో తరించే విష్ణు భక్తులు! ఈ మాసం పవిత్రత గురించి ఎంత చెప్పిన తక్కువే! ఎన్నో పండుగలు – మరెన్నో విశేషాలు కార్తిక మాసంలో శుద్ధ పాడ్యమి నుంచి అమావాస్య వరకు ప్రతి రోజు పండుగే! ప్రతి తిథి విశేషమైనదే! ఆ వివరాలేంటో చూద్దాం.

### బలి పాడ్యమి

కార్తిక శుద్ధ పాడ్యమిని బలి పాడ్యమిగా జరుపుకుంటాం. ఈ రోజు శ్రీ మహావిష్ణువు వామనావతారాన్ని స్మరించుకుంటూ, బలి చక్రవర్తిని పూజించడం సంప్రదాయం.

### భగినీ హస్త భోజనం

కార్తిక శుద్ధ విదియను యమద్వితీయగా జరుపుకుంటాం, ఈ రోజున భగినీ హస్త భోజనం పేరిట సోదరులు తమ సోదరి ఇంటికి వెళ్లి ఆమె ఆతిథ్యాన్ని స్వీకరిస్తారు. యమధర్మరాజు కూడా ఈ రోజు తన సోదరి యమున ఇంటికి వెళ్లి ఆమె చేతి భోజనం చేస్తారంట!

### నాగుల చవితి

కార్తిక శుద్ధ చవితి రోజును నాగుల చవితిగా జరుపుకుంటాం. ఈ రోజున భక్తులు ఉపవాసం ఉండి నాగుల పుట్టలో పాలు పోసి, చిమ్మిలి, చలిమిడి నైవేద్యంగా సమర్పిస్తారు. ప్రకృతి ఆరాధనలో భాగంగా సమస్త ప్రాణులను దైవస్వరూపాలుగాఆరాధించడమనే ధర్మసూత్రం ఇందులో ఇమిడి ఉంది.

### కోటి సోమవారం

కార్తిక మాసంలో శుద్ధ సప్తమి, శ్రవణా నక్షత్రం కలిసి వచ్చిన రోజును కోటి సోమవారంగా వ్యవహరిస్తారు. ఈ ఒక్కరోజు చేసే ఉపవాసం కోటి కార్తిక సోమవారాల ఉపవాసంతో సమానమని పురాణాలు చెబుతున్నాయి. సాధారణంగా కోటి సోమవారం సోమవారం రోజే రావాలని లేదు కానీ విశేషించి ఈసారి కోటి సోమవారం, కార్తిక సోమవారం కలిసి రావడం మరింత శుభకరమని పండితులు చెబుతున్నారు.

### ఉత్థాన ఏకాదశి

ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజు యోగనిద్రలోకి ప్రవేశించే శ్రీ మహావిష్ణువు ఉత్థాన ఏకాదశి రోజు నిద్ర నుంచి మేల్కొంటాడంట! ఈ రోజు ఉపవాస దీక్షలు చేపట్టి శ్రీ మహావిష్ణువును విశేషంగా ఆరాధిస్తారు.

### కైశిక ద్వాదశి – తులసి కళ్యాణం

కైశిక ద్వాదశి శ్రీ మహావిష్ణువు ఆరాధనకు విశేషమైన రోజు. ఈ రోజు తులసి, ఉసిరిక చెట్లను లక్ష్మీనారాయణుల స్వరూపాలుగా భావించి కల్యాణం చేయడం విశిష్టమైన సంప్రదాయం.

### కార్తిక పౌర్ణమి

కార్తిక పౌర్ణమి రోజున శివకేశవుల ఆరాధన, జ్వాలాతోరణం, లక్షదీపోత్సవం విశేషంగా నిర్వహిస్తారు. ఈ రోజు ఉపవాసదీక్షలతో శివకేశవులను ఆరాధిస్తే మోక్షం కలుగుతుందని విశ్వాసం. కార్తిక మాసం బహుళ పక్షంలో కూడా ప్రతి రోజు విశేషమైనదే! మాసం చివరి రోజు వచ్చే అమావాస్య మరుసటి రోజును పోలిస్వర్గారోహణగా, పోలి పాడ్యమిగా జరుపుకోవడం సంప్రదాయం. ఇన్ని విశేషాలున్న పవిత్ర కార్తిక మాసంలో మనం కూడా శివకేశవులను ఆరాధించి మోక్షాన్ని పొందుదాం.ఓం నమఃశివాయ! ఓం శ్రీ కార్తిక దామోదరాయ నమః!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ

# ఆలయంలో నవగ్రహాలను ఎందుకు పూజించాలి? ఏ గ్రహానికి ఏ ఫలం లభిస్తుందో తెలుసా?



మన ఇష్టదైవాన్ని కళ్లారా దర్శించుకుని, మనసారా పూజించుకుని, మన మనసులోని కోరికలు స్వామికి విన్నవించుకోవడానికే మనం ఆలయాలకు వెళ్తుంటాం. సాధారణంగా ప్రతి శివాలయంలో నవగ్రహాల మండపం కనిపిస్తుంది. మూలవిరాట్టును దర్శించిన తర్వాత నవగ్రహాలను కూడా పూజించడం సర్వ సాధారణం. అయితే ఆలయ ప్రాంగణంలో ఉన్న నవగ్రహాలను ఎందుకు పూజించాలి? ల ఆరాధన వెనుక అంతరార్థం ఏమిటి? అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

### నవగ్రహం అంటే?

గ్రహం అంటే గ్రహించేది అని అర్థం. సూర్యుడు ఒక నక్షత్రం! చంద్రుడు ఓ ఉపగ్రహం, రాహుకేతువులు ఛాయాగ్రహాలు. ఇది అందరికీ తెలిసిందే! అయినప్పటికీ వీటితోపాటు మరో ఐదు గ్రహాలను కలిపి నవగ్రహాలుగా చేయడం వెనుక ఓ పరమార్థం ఉంది.

### తొమ్మిది పూర్ణసంఖ్య!

జ్యోతిష శాస్త్రం, సంఖ్యా శాస్త్రాన్ని అనుసరించి తొమ్మిది పూర్ణసంఖ్యగా పేర్కొంటారు. సంఖ్యల్లో తొమ్మిది చివరి సంఖ్య. తొమ్మిది తరువాత ఒకటి పక్కన సున్నా చేరిస్తేనే పది అవుతుంది అంతేకాని కొత్తగా మరో సంఖ్య ఏమీ రాదు. అలాగే తొమ్మిదిని ఏ సంఖ్యతో గుణించిన తొమ్మిదే వస్తుంది. ఇది సంఖ్యాశాస్త్రంలో ఓ అద్భుతం. మానవ శరీరంలో ప్రధానంగా ఉండేవి నవరంధ్రాలు. వీటి ద్వారానే జీవన క్రియ మొత్తం సాగుతుంది. అందుకే తొమ్మిది సంఖ్యను పరిపూర్ణమైన సంఖ్య అంటారు.

### నవగ్రహ ఆరాధన తప్పనిసరి

ఇక నవగ్రహాల విషయానికి వస్తే, నవగ్రహాలకు అధిపతి సూర్యుడు. ఈ నవగ్రహాలు మన జీవితంపై అసాధారణమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ ప్రభావం కారణంగానే శుభ అశుభ ఫలితాలు ఏర్పడుతాయని జ్యోతిష శాస్త్ర పండితులు చెబుతారు. మన నిత్యజీవితంలో అశుభ ఫలితాలు తొలగి, శుభ ఫలితాలు పొందాలంటే నవగ్రహాలను తప్పకుండా ఆరాధించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా నవగ్రహాల్లో ఏ గ్రహం మానవునికి ఎలాంటి ఫలితాన్ని అందిస్తాయో చూద్దాం.

సూర్యుడుసూర్యుడు గ్రహాధిపతి. నవగ్రహాలకు రాజు వంటివాడు. ఆదివారం సూర్యునికి ప్రీతికరమైన వారం. అసలు ప్రతి రోజూ క్రమం తప్పకుండా సూర్యుని ఆరాధిస్తే, ఆ సూర్య భగవానుడు మానవాళికి శక్తిని, ఆత్మవిశ్వాసాన్ని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. చంద్రుడు జ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుని మనఃకారకుడని అంటారు. అంటే చంద్రుడు మనో విచారాన్ని తొలగించి మానసిక సంతోషాన్ని కలుగజేస్తాడని అంటారు. సోమవారానికి అధిపతి చంద్రుడు. ప్రతిరోజూ చంద్రుని ఆరాధిస్తే మానసిక ఉద్వేగాలను నియంత్రించి, మానసిక ఆనందాన్ని, ఆరోగ్యాన్ని అందిస్తాడు. బంధాలను దృఢంగా మారుస్తాడు. కి శక్తిని, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. చంద్రుడుజ్యోతిష శాస్త్రం ప్రకారం చంద్రుని మనఃకారకుడని అంటారు. అంటే చంద్రుడు మనో విచారాన్ని తొలగించికుజుడుకుజుడు మంగళ కారకుడు. మంగళవారానికి అధిపతి కుజుడు. వివాహయోగం కలగాలన్నా, సంతానప్రాప్తి కలగాలన్నా కుజ గ్రహ అనుకూలత ముఖ్యం. ప్రతిరోజూ కుజుని ఆరాధించే వారికి కుజుడు మనోధైర్యాన్ని, సమస్యలను అధిగమించే శక్తిని ప్రసాదిస్తాడు.బుధుడుబుధుడు బుద్ధికారకుడు. బుధునికి ప్రీతికరమైన వారం బుధవారం. ప్రతిరోజూ బుధుని ఆరాధిస్తే మంచి విద్య, జ్ఞానం, విజ్ఞానం లభిస్తాయని, ఆలోచనలో పరిణితి ఏర్పడుతుందని విశ్వాసం.

గురుడుబృహస్పతిగా పిలుచుకునే గురు గ్రహం అత్యంత శుభ గ్రహం. గురువారానికి అధిపతి గురుడు. ఒక్క గురుగ్రహం అనుకూలత ఉంటే చాలు తక్కిన గ్రహాల అనుకూలత లేకపోయినా విశేషమైన శుభ ఫలితాలు పొందవచ్చు. ప్రతిరోజూ గురుని ఆరాధించడం వల్ల జీవితంలో అభివృద్ధి, ఆధ్యాత్మిక జ్ఞానం వృద్ధి చెందుతాయి.శుక్రుడునవగ్రహాల్లో శుక్రుడు శుభ గ్రహం. శుక్రవారానికి అధిపతి శుక్రుడు. ప్రతి రోజు శుక్రుని ఆరాధిస్తే ప్రేమ, విలాసాలు, భోగభాగ్యాలు, అందం, ఆనందం ఇలా జీవితానికి కావాల్సినవన్నీ అందిస్తాడు.

శని భగవానుడుశని పేరు చెబితేనే చాలు భయపడి పోవడం సహజం. నిజానికి శని న్యాయదేవత! మనం చేసిన పాపపుణ్యాలను తగిన ఫలితాలను అందించేవాడు శని భగవానుడు. శనివారానికి అధిపతి శనిదేవుడు. ప్రతిరోజూ శనిభగవానుని ఆరాధించడం వల్ల క్రమశిక్షణ, చేసిన కష్టానికి తగిన ప్రతిఫలం, దీర్ఘకాలంలో అభివృద్ధిని సాధించవచ్చు.

రాహువుజ్యోతిష శాస్త్రం ప్రకారం రాహువు ఛాయాగ్రహం. మనకు ఏదైనా గందరగోళ పరిస్థితి ఎదురైనప్పుడు రాహువును పూజిస్తే గందరగోళాన్ని తొలగించి, జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమించే శక్తిని ప్రసాదిస్తాడు.కేతువుజ్యోతిష శాస్త్రం ప్రకారం కేతువు కూడా ఛాయాగ్రహమే! కేతువు గతజన్మల పాపఫలాన్ని తగ్గిస్తాడని విశ్వాసం. అందుకే కేతువును ఆరాధించడం వల్ల జీవితంలో పాపఫలంగా ఎదురయ్యే సమస్యలు తొలగి సానుకూలత పెరుగుతుంది.

నవగ్రహ ఆరాధన ఫలంఆలయానికి వెళ్లినప్పుడు ముందుగా నవగ్రహ మండపానికి వెళ్లి నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయడం ఎంతో ముఖ్యం. నవగ్రహ శ్లోకాలు చదువుకుంటూ 9 కానీ 11 కానీ ప్రదక్షిణలు చేయాలి. నవగ్రహాలను ఎప్పుడూ తాకరాదు. నవగ్రహాలకు ప్రదక్షిణలు చేయడం పూర్తయ్యాక కాళ్లు కడుక్కోవాలి అంటారు కానీ అది కేవలం అపోహ మాత్రమే! నవగ్రహాలకు ప్రదక్షిణలు చేగురుడు. ఒక్క గురుగ్రహం అనుకూలత ఉంటే యడం పూర్తయ్యాక ఆలయంలోని మూలవిరాట్టును దర్శించుకోవడం ప్రధానం. జీవితంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించడానికి కావాల్సిన శక్తిని, ధైర్యాన్ని పొందడానికి, శారీరక మానసిక ఆరోగ్యాలు పొందడానికి నవగ్రహాల ఆరాధన తప్పనిసరిగా చేయాలని పండితులు చెబుతారు. మనం కూడా నవగ్రహాలను ఆరాధించి సుఖశాంతులను పొందుదాం.శుభం భూయాత్!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# ఐఫోన్ డ్యూయో క్రేజ్: రెండు వారాల్లోనే లక్షకు పైగా యాప్‌లు రెడీ!



యాపిల్ సంస్థ ఇటీవలే మార్కెట్లోకి విడుదల చేసిన మొట్టమొదటి ఫోల్డబుల్ ఫోన్ 'ఐఫోన్ డ్యూయో' కు గ్లోబల్ డెవలపర్ల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. మార్కెట్లోకి వచ్చిన కేవలం రెండు వారాల వ్యవధిలోనే ఈ పరికరం కోసం లక్షకు పైగా (1,00,000+) యాప్‌లు ఆప్టిమైజ్ చేసినట్లు యాపిల్ సంస్థ ప్రకటించింది.మ్యాక్ రూమర్స్ నివేదిక ప్రకారం, యాపిల్ వరల్డ్‌వైడ్ డెవలపర్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సూసన్ ప్రెస్కాట్ మాట్లాడుతూ, ప్రస్తుతం యాప్ స్టోర్‌లో ఈ సంఖ్య రోజురోజుకూ వేగంగా పెరుగుతోందని, ప్రతిరోజూ వేలాది సరికొత్త యాప్‌లు తోడవుతున్నాయని పేర్కొన్నారు. కొత్త ఫోల్డబుల్ స్క్రీన్ పరిమాణానికి సంపూర్ణంగా సరిపోయేలా డెవలపర్లు ఇంత వేగంగా యాప్‌లను రీడిజైన్ చేయడం పట్ల యాపిల్ హర్షం వ్యక్తం చేసింది.స్క్రీన్లక అనుగుణంగా అద్భుతమైన డిజైన్: ఈ 1 లక్షకు పైగా యాప్?లు అన్నీ లేదా అంతకంటే తరువాతి వెర్షన్లను ఉపయోగించి రూపొందించినవే. ఇవి ఐఫోన్ డ్యుయో లోపలి (ఇన్నర్ స్క్రీన్), వెలుపలి (ఔటర్ స్క్రీన్) పరిమాణానికి అనుగుణంగా స్క్రీన్ మొత్తం పరిపూర్ణంగా డిస్‌ప్లే అవుతాయి. అంతేకాకుండా, స్క్రీన్ పైభాగంలోని స్టేటస్ బార్‌లో కంట్రోల్స్ అన్నీ ల్యాండ్‌స్కేప్ లేదా పోర్ట్రెయిట్ మోడ్‌లో చాలా కచ్చితంగా అమరి ఉంటాయి.ప్రపంచవ్యాప్తంగా డెవలపర్ల వర్క్‌షాప్‌లు: ఐఫోన్ డ్యూయో ఫోల్డబుల్ స్క్రీన్‌కు అనుగుణంగా యాప్‌లను ఆప్టిమైజ్ చేయడం కోసం యాపిల్ సంస్థ ప్రపంచవ్యాప్తం గా 19 ప్రధాన నగరాల్లో ప్రత్యేక వర్క్‌షాప్‌లను నిర్వహించింది. ఇందులో వేలాది మంది డెవలపర్లు పాల్గొని, డిజైజ్‌ను ప్రత్యక్షంగా పరిశీలించి తమ యాప్‌ల కోడింగ్‌ను అప్‌డేట్ చేశారు.పాపులర్ యాప్స్ అన్నీ రెడీ!: మైక్రోసాఫ్ట్‌కు చెందినవంటి యాప్‌లు అన్నీ ఇప్పటికే ఐఫోన్ డ్యూయో కోసం అప్‌డేట్ అయ్యాయి. వీటితో పాటు వంటి నిత్యం వాడే ప్రముఖ యాప్?లు కూడా సరికొత్త ఫోల్డబుల్ డిజైన్‌తో ఐఫోన్ డ్యూయోలో రన్ అవ్వడానికి సిద్ధమయ్యాయి.బ్యాగ్జ్: ఈ ఫోన్ కోసం పూర్తిగా ఆప్టిమైజ్ చేసిన యాప్?లను వినియోగదారులు సులభంగా గుర్తించేందుకు వీలుగా యాప్ స్టోర్ పేజీలో అనే ప్రత్యేక బ్యాడ్జ్‌ను కేటాయించారు. అలాగే, సరికొత్త ఐూా 27.2 అప్‌డేట్‌తో ఈ ఫోన్ కోసం సపోర్ట్ కూడా లభించింది. దీనివల్ల ్లో డ్రాయింగ్ వేయడం, యాప్స్‌లో నోట్స్ రాసుకోవడం మరింత సులభతరం అవుతుంది. ప్రివ్యూ యాప్స్ ద్వారా డాక్యుమెంట్ మార్కప్ కూడా చేసుకోవచ్చు.ఇంకా ఆప్టిమైజ్ కాని యాప్స్ ఎన్నో!: యాప్ స్టోర్‌లో లక్షలాది యాప్‌లు ఉన్నప్పటికీ, ఇంకా చాలావరకు ఐఫోన్ డ్యూయోకు అనుగుణంగా ఆప్టిమైజ్ కాలేదు. వీటిలో కింద కొన్ని క కూడా ఉన్నాయి:

# మీ భార్య లేదా భర్త ప్రవర్తనలో "మార్పులు" వచ్చాయా - రిలేషన్‌లో మూడో వ్యక్తి ఉన్నట్లేనట!



: ఎప్పుడు, ఎక్కడ, ఎవరి మీద పుడుతుందో చెప్పలేని భావం 'ప్రేమ'. ఈ లవ్? భార్యాభర్తల మధ్య ఉంటే వాళ్ల బంధం కలకాలం నిలిచి ఉంటుంది. కానీ ప్రేమ పేరుతో మూడో వ్యక్తిపై కలిగే వ్యామోహం చాలా జంటల మధ్య చిచ్చు పెడుతుంది. దీని కారణంగానే విడాకులు ఇచ్చుకోవడం, ఒకరిని ఒకరు చంపుకోవడం వంటివి ప్రస్తుత సమాజంలో ఎక్కువయ్యాయి. అయితే ప్రతి చిన్న విషయానికీ భాగస్వామిపై అనుమానం పెంచుకోకుండా.. వారు చేసే కొన్ని పనులు, ప్రవర్తన ఆధారంగా వారి జీవితంలో మూడో వ్యక్తి ఉన్నారో? లేదో? గుర్తించవచ్చంటున్నారు రిలేషన్‌షిప్ నిపుణులు. అదెలాగో ఇప్పుడు చూద్దాం.

ప్రతిదీ రహస్యమేనా?: భార్యాభర్తల మధ్య ఎలాంటి రహస్యాలూ ఉండకూడదంటుంటారు. ఎందుకంటే ప్రతి విషయం గురించి ఇద్దరికీ తెలిస్తేనే అనుమానాలకు తావు లేకుండా అన్యోన్యంగా ముందుకు సాగుతారు. అయితే ఉన్నట్లుండి తమ పార్ట్?నర్? ప్రవర్తనలో మార్పులు ఏమైనా వచ్చినా, ప్రతీ విషయంలో రహస్యంగా ప్రవర్తించినా అనుమానించడంలో తప్పు లేదని చెబుతున్నారు నిపుణులు.

ఆ చిరాకు మీపై రుద్దితే..!: దాంపత్య బంధంలో చిరాకు, పరాకులు సహజం. ఈ క్రమంలోనే కొన్నిసార్లు ఒకరిపై ఒకరు చిరాకు పడటం, కాసేపయ్యాక కలిసిపోవడం.. ఇది సహజంగా జరిగే ప్రాసెస్?. అయితే అలా కాకుండా భార్యా/భర్త కనిపిస్తే చిరాకు పడడం, లవర్? కనిపించకపోయినా, మాట్లాడకపోయినా.. ఆ చిరాకునూ మీపై రుద్దడం, ఇలా ఎటుతిరిగీ మిమ్మల్ని ఓ దోషిగా చిత్రీకరించాలన్న ఉద్దేశంతో మీపై లేనిపోని నిందలు వేయడం, బాధపెట్టడం చేసినట్లయితే.. అలర్ట్? కావాలంటున్నారు. ఎందుకంటే మీ భాగస్వామి మిమ్మల్ని వదిలించుకోవాలని చూస్తున్నారన దానికి ఇవి సంకేతమంటున్నారు. కాబట్టి ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలంటున్నారు.. మీ పార్టనర్? విషయంలో ఏమైనా అనుమానంగా అనిపిస్తే దాన్ని నివృత్తి చేసుకొని అడుగు ముందుకేయడం మంచిదంటున్నారు.

పదే పదే తన ప్రస్తావనే!: భార్యాభర్తలంటే.. ఒకరిలో ఒకరికి నచ్చిన అంశాలు, పిల్లల భవిష్యత్తు, ఆఫీసు విషయాలు, రొమాంటిక్? మాటలు మాట్లాడుకోవాలి. అలాకాకుండా సమయం సందర్భం లేకుండా, ప్రస్తావన వచ్చినా, రాకపోయినా పార్టనర్? మరో వ్యక్తి గురించి పదే పదే మాట్లాడుతున్నా, వారిలోని మంచి విషయాలు చెబుతూ ఎమోషన్? అయినా, ఆ వ్యక్తి పట్ల ప్రత్యేకమైన ఆసక్తి ఉందేమోనని అనుమానించడంలో తప్పు లేదంటున్నారు.మిమ్మల్ని దూరం పెడుతూ: అప్పటిదాకా ప్రతి విషయంలో మీకు, మీ నిర్ణయాలకు విలువ ఇచ్చినవారు.. సడెన్?గా దూరం పెట్టినప్పుడు అనుమానం రావడం కామన్?. ముఖ్యంగా ఫైనాన్స్? విషయాల్లో గోప్యత పాటించడం, కీలక విషయాల్లో సైతం నిర్ణయం అడగకపోవడం, కలిసి సమయం గడుపుదామని ఆసక్తి చూపినా ఇంట్రస్ట్? చూపించకపోవడం, ఏకాంతంగా ఉండాల్సిన సమయంలోనూ దూరం పెట్టడం వంటి సందర్భాలు మీకంటే మరో వ్యక్తికి ప్రాధాన్యమిస్తున్నారనడానికి సంకేతంగా

# దక్షిణాఫ్రికా పర్యటనకు భారత మహిళల జట్టు ప్రకటన



**మూడు ఫార్మాట్లకు సారథిగా స్మృతి మంధాన..**

**జట్టులో జెమీమా రోడ్రిగ్స్‌కు చోటు**

**న్యూఢిల్లీ, నవంబర్ 9:**దక్షిణాఫ్రికా పర్యటనలో తలపడనున్న భారత మహిళల క్రికెట్ జట్లను బీసీసీఐ ప్రకటించింది. డిసెంబర్‌లో జరగనున్న ఈ పర్యటనలో టెస్టు, వన్డే, టీ20 మూడు ఫార్మాట్లకు స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఈ పర్యటనలో భారత జట్టు ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది.గతంలో టెస్టు క్రికెట్‌లో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టని స్మృతి మంధానకు ఈ పర్యటనతో ఆ అవకాశం లభించింది. టెస్టు, వన్డే జట్లకు దీప్తి శర్మ వైస్ కెప్టెన్‌గా ఎంపికైంది. టీ20 జట్టుకు షఫాలీ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనుంది.మోకాలి గాయం నుంచి కోలుకుని తిరిగి క్రికెట్‌లోకి వచ్చిన జెమీమా రోడ్రిగ్స్‌కు మూడు ఫార్మాట్ల జట్లలోనూ చోటు దక్కింది. గాయంతో కొంతకాలంగా జట్టుకు దూరమైన అమన్‌జోత్ కౌర్ టీ20 జట్టులోకి తిరిగి వచ్చింది. హర్మన్‌ప్రీత్ కౌర్, షఫాలీ వర్మ, రిచా ఘోష్, యాస్తికా భాటియా, హర్లీన్ డియోల్ తదితరులకు కూడా అవకాశం కల్పించారు.టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, ప్రతీకా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్, యాస్తికా భాటియా, దీప్తి శర్మ, శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలి సత్ఘరే.టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షఫాలీ వర్మ, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్, జి. కమలిని, అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలి సత్ఘరే.పర్యటన షెడ్యూల్: డిసెంబర్ 9న గ్కెబెర్హాలో ఏకైక టెస్టు మ్యాచ్‌తో పర్యటన ప్రారంభమవుతుంది. డిసెంబర్ 16న పార్లలో తొలి వన్డే, 19న కేప్‌టౌన్‌లో రెండో వన్డే, 22న బ్లోమ్‌ఫోంటెయిన్‌లో మూడో వన్డే జరుగుతాయి. డిసెంబర్ 26న బెనోనిలో తొలి టీ20, 29, 30 తేదీల్లో పోట్చెఫ్‌స్ట్రూమ్‌లో చివరి రెండు టీ20 మ్యాచ్‌లు నిర్వహిస్తారు.మూడు ఫార్మాట్లలోనూ సత్తా చాటేందుకు భారత మహిళల జట్టు సిద్ధమవుతోంది. ఈ పర్యటనలో స్మృతి మంధాన నాయకత్వం, జెమీమా పునరాగమనం, యువ క్రీడాకారిణుల ప్రదర్శనపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

# ముంబైకి అర్ష్‌దీప్.. పంజాబ్‌కు హార్దిక్!



**ఐపీఎల్‌లో సంచలన ఆటగాళ్ల మార్పిడి..**

**ముంబైకి లాభమంటున్న అభినవ్ ముకుంద్**

**న్యూఢిల్లీ, నవంబర్ 9:**ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు ముంబై ఇండియన్స్, పంజాబ్ కింగ్స్ మధ్య కీలక ఆటగాళ్ల మార్పిడి చర్చనీయాంశంగా మారింది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్లనుండగా, భారత ఎడమచేతి వాటం పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు మారనున్నాడు. ఈ ఒప్పందంపై రెండు ఫ్రాంచైజీలు అంగీకారానికి వచ్చినట్లు సమాచారం. అయితే బీసీసీఐ అధికారిక ఆమోదం, ఇతర ప్రక్రియలు పూర్తయిన తర్వాతే ఈ మార్పిడి ఖరారు కానుంది.**ముంబైకే ఎక్కువ ప్రయోజనం!**మాజీ భారత క్రికెటర్ అభినవ్ ముకుంద్ ఈ ఆటగాళ్ల మార్పిడిపై స్పందిస్తూ ముంబై ఇండియన్స్‌కే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని అభిప్రాయపడ్డాడు. పంజాబ్ జట్టు అర్ష్‌దీప్, శ్రేయస్ అయ్యర్, యుజ్వేంద్ర చాహల్ వంటి కీలక ఆటగాళ్లపై పెట్టుబడి పెట్టిందని గుర్తుచేశాడు. ఇప్పుడు అర్ష్‌దీప్‌ను వదులుకుని హార్దిక్‌ను తీసుకోవడం జట్టు కూర్పుపై ప్రభావం చూపుతుందని పేర్కొన్నాడు.**శ్రేయస్ నాయకత్వంలో హార్దిక్ ఎలా?**పంజాబ్ కింగ్స్ కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ కొనసాగనున్న నేపథ్యంలో ఆయన నాయకత్వంలో హార్దిక్ ఎలా ఆడతాడన్నది ఆసక్తికరంగా మారిందని ముకుంద్ ప్రశ్నించాడు. హార్దిక్ జట్టులో ఆల్‌రౌండర్‌గా మాత్రమే కొనసాగుతాడా? జట్టు సమతుల్యత ఎలా ఉంటుంది? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందన్నాడు. హార్దిక్ రాకతో పంజాబ్ జట్టులో ఇప్పటికే ఉన్న మార్కస్ స్టోయినిస్ భవిష్యత్తుపైనా ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నాడు.**అర్ష్‌దీప్‌తో బుమ్రాకు జోడీ**అర్ష్‌దీప్ ముంబై ఇండియన్స్‌లో చేరితే జస్ప్రీత్ బుమ్రాతో కలిసి బలమైన పేస్ దళాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. పవర్‌ప్లేలో వికెట్లు తీయడంతో పాటు చివరి ఓవర్లలోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం అర్ష్‌దీప్‌కు ఉంది. మరోవైపు అర్ష్‌దీప్‌ను వదులుకోవడం పంజాబ్ బౌలింగ్ విభాగాన్ని బలహీనపరచవచ్చని మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా అభిప్రాయపడ్డాడు.ఈ మార్పిడి జరిగితే పంజాబ్ జట్టులో యువ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్జేకు అవకాశాలు తగ్గుతాయా అన్న సందేహాన్ని కూడా అభినవ్ ముకుంద్ వ్యక్తం చేశాడు. మొత్తానికి ఐపీఎల్ వేలానికి ముందు ఈ ఆటగాళ్ల మార్పిడి రెండు జట్ల కూర్పులో ఎలాంటి మార్పులు తీసుకొస్తుందోనని క్రికెట్ అభిమానులు ఆసక్తిగా

# భారత పేసర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల

**యువ బౌలర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు**

**పరిస్థితులను చక్కగా ఉపయోగించుకుంటున్న భారత బౌలర్లు..**

**బ్యాటర్లకు సవాల్‌గా మారిన పేస్ దళం**



**హామిల్టన్, నవంబర్ 9:**న్యూజిలాండ్ పర్యటనలో భారత యువ ఫాస్ట్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. తమ పదునైన బంతులు, కచ్చితమైన లైన్, లెంగ్త్‌తో కివీస్ బ్యాటర్లను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. భారత పేసర్ల ప్రదర్శనపై న్యూజిలాండ్ బ్యాటింగ్ కోచ్ లూక్ రోంచి ప్రశంసలు కురిపించాడు. భారత బౌలర్లు తమ బ్యాటర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వడం లేదని, బౌలింగ్‌కు అనుకూలిస్తున్న పరిస్థితులను అద్భుతంగా వినియోగించుకుంటున్నారని పేర్కొన్నాడు.అర్ష్‌దీప్ సింగ్, ఔకిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి యువ బౌలర్లు తమ ప్రతిభను నిరూపించుకుంటున్నారని తెలిపాడు. తొలి రెండు వన్డేల్లో న్యూజిలాండ్ కోల్పోయిన 20 వికెట్లలో 17 వికెట్లను భారత పేసర్లు పడగొట్టడం వారి ఆధిపత్యానికి నిదర్శనంగా నిలిచింది. ఆక్లాండ్, వెల్లింగ్టన్ వేదికలుగా జరిగిన మ్యాచ్‌ల్లో కివీస్ బ్యాటింగ్ విభాగం పూర్తిగా తడబడింది. తొలి మ్యాచ్‌లో 185 పరుగులకు, రెండో మ్యాచ్‌లో 134 పరుగులకే ఆలౌట్ కావడం భారత బౌలింగ్ బలాన్ని తెలియజేస్తోంది.**పిచ్‌లను సమర్థంగా వినియోగించుకుంటూ..**న్యూజిలాండ్ పరిస్థితుల్లో బంతి స్వింగ్, సీమ్ అవుతున్నప్పుడు భారత బౌలర్లు దానిని చక్కగా ఉపయోగించుకుంటున్నారని రోంచి వివరించాడు. ముఖ్యంగా తొలి ఓవర్లలోనే వికెట్లు తీస్తూ ప్రత్యర్థి జట్టుపై ఒత్తిడి పెంచుతున్నారని పేర్కొన్నాడు. బౌలర్లు క్రమశిక్షణతో బంతులు వేస్తూ బ్యాటర్లను తప్పులు చేసేలా చేస్తున్నారని తెలిపాడు. భారత పేసర్లు కేవలం వేగంపైనే ఆధారపడకుండా బంతి కదలికలను కూడా సమర్థంగా ఉపయోగించుకుంటున్నారని ప్రశంసించాడు.భారత జట్టులో యువ బౌలర్లకు లభిస్తున్న అవకాశాలు, వారు చూపుతున్న ప్రతిభ జట్టుకు భవిష్యత్తులో మరింత బలాన్ని అందించనున్నాయి. సీనియర్ బౌలర్లతో పాటు యువ పేసర్లు కూడా కీలక సమయాల్లో వికెట్లు తీస్తుండటం భారత జట్టు బౌలింగ్ విభాగానికి సానుకూల అంశంగా మారింది.**బ్యాటర్లు సంయమనంతో ఆడాలి**మరోవైపు తమ బ్యాటర్లు కూడా పరిస్థితులకు అనుగుణంగా ఆడాల్సిన అవసరం ఉందని రోంచి సూచించాడు. ప్రతి మ్యాచ్‌లో భారీ స్కోర్లు సాధించాలనే ఆలోచనతో బరిలోకి దిగడం సరైన విధానం కాదన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని, ప్రత్యర్థి బౌలర్లకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలని పేర్కొన్నాడు. బంతి స్వింగ్ అవుతున్నప్పుడు ఆచితూచి ఆడటం, క్రీజులో నిలదొక్కుకున్న తర్వాత పరుగుల వేగాన్ని పెంచడం ముఖ్యమని వివరించాడు.తొలి ఓవర్లలో వికెట్లు కోల్పోతే మిగతా బ్యాటర్లపై ఒత్తిడి పెరుగుతుందని, అందువల్ల ఆరంభంలో వికెట్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలని సూచించాడు. భారత బౌలర్లను ఎదుర్కొనేందుకు బ్యాటింగ్ విభాగం కొత్త వ్యూహాలతో సిద్ధం కావాల్సి ఉందని అభిప్రాయపడ్డాడు.

# బాల్ ట్యాంపరింగ్ వివాదంలో కొత్త మలుపు!

- ఉస్మాన్ ఖవాజాకు డేవిడ్ వార్నర్ మద్దతు.. ఎనిమిదేళ్ల తర్వాత బయటపడుతున్న సంచలన విషయాలు



**సిడ్నీ, నవంబర్ 9:**ఆస్ట్రేలియా క్రికెట్‌ను కుదిపేసిన బాల్ ట్యాంపరింగ్ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో చోటుచేసుకున్న శాండ్‌పేపర్ వివాదంపై మాజీ ఆస్ట్రేలియా ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా చేసిన వ్యాఖ్యలకు మరో మాజీ ఆటగాడు డేవిడ్ వార్నర్ మద్దతు ప్రకటించాడు. ఖవాజా వెల్లడించిన విషయాలు నూటికి నూరు శాతం నిజమని స్పష్టం చేశాడు. ఈ ఘటనపై క్రికెట్ ఆస్ట్రేలియా నిర్వహించిన విచారణ హడావుడిగా, లోపభూయిష్టంగా జరిగిందని విమర్శించాడు.**అసలు ఏం జరిగింది?**2018లో దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ శాండ్‌పేపర్‌తో బంతి స్వరూపాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తూ కెమెరాలకు చిక్కాడు. ఈ ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌లో తీవ్ర సంచలనం సృష్టించింది. విచారణ అనంతరం డేవిడ్ వార్నర్, స్టీవ్ స్మిత్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లపై క్రికెట్ ఆస్ట్రేలియా కఠిన చర్యలు తీసుకుంది. వార్నర్, స్మిత్‌లకు ఏడాది పాటు నిషేధం విధించగా, బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల నిషేధం విధించారు. వార్నర్‌పై నాయకత్వ బాధ్యతలు చేపట్టకుండా శాశ్వత నిషేధం కూడా విధించారు. అనంతరం 2024లో ఆయనపై ఆ నాయకత్వ నిషేధాన్ని తొలగించారు.**జట్టంతటికీ తెలుసు: ఖవాజా**తాజాగా తన ఆత్మకథ 'సబ్'లోని కొన్ని విషయాలను వెల్లడించిన ఉస్మాన్ ఖవాజా ఈ వివాదంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. బంతి ఆకారాన్ని మార్చే ప్రయత్నం గురించి జట్టులోని బ్యాటర్లు, బౌలర్లు, సహాయక సిబ్బంది సహా అందరికీ తెలుసునని పేర్కొన్నాడు. ఇది కేవలం ముగ్గురు ఆటగాళ్లకు సంబంధించిన వ్యవహారం కాదని, జట్టులోని పలువురికి ఈ విషయం తెలిసి ఉందని వెల్లడించాడు. ఈ ఘటనపై అప్పట్లో జరిగిన విచారణలో తనను ప్రశ్నించలేదని కూడా ఆరోపించాడు.తాను కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉన్నప్పటికీ విచారణలో తన వాంగ్మూలాన్ని తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని ఖవాజా పేర్కొన్నాడు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయటకు రావాలని, ముగ్గురు ఆటగాళ్లపైనే మొత్తం బాధ్యతను మోపడం సరైనది కాదని అభిప్రాయపడ్డాడు.**వార్నర్ ఏమన్నాడంటే..**ఖవాజా వ్యాఖ్యలపై స్పందించిన డేవిడ్ వార్నర్ సామాజిక మాధ్యమాల్లో వీడియో విడుదల చేశాడు. తన చిన్ననాటి స్నేహితుడైన ఖవాజాకు పూర్తి మద్దతు ప్రకటించాడు. ఆయన వెల్లడించిన విషయాలు పూర్తిగా నిజమని పేర్కొన్నాడు. ఎనిమిదేళ్లుగా ఈ అంశంపై తాను బహిరంగంగా మాట్లాడలేదని, ఇప్పుడు నిజాలు బయటకు రావాల్సిన సమయం వచ్చిందని తెలిపాడు.ఖవాజా విచారణలో భాగంగా వాంగ్మూలం ఇవ్వకపోవడాన్ని వార్నర్ ప్రశ్నించాడు. అసలు ఆయనను విచారించకుండా జరిగిన ప్రక్రియను సమగ్ర విచారణగా ఎలా పరిగణిస్తారని నిలదీశాడు. అప్పట్లో జరిగిన విచారణ తొందరపాటుతో, సరైన పద్ధతిలో సాగలేదని విమర్శించాడు. ఈ వ్యవహారంలో ఎవరినీ నిందించడం తమ ఉద్దేశం కాదని, వాస్తవాలు వెలుగులోకి రావడం, పారదర్శకత, బాధ్యతాయుతమైన విచారణ జరగడమే ముఖ్యమని పేర్కొన్నాడు.**క్రికెట్ ఆస్ట్రేలియా సమాధానం**మరోవైపు క్రికెట్ ఆస్ట్రేలియా మాత్రం గతంలో నిర్వహించిన విచారణపై తన వైఖరిని సమర్థించుకుంది. అప్పట్లో అందుబాటులోకి వచ్చిన సంబంధిత సమాచారాన్ని పరిశీలించిన తర్వాతే నిర్ణయాలు తీసుకున్నామని తెలిపింది. తమ విచారణలో వెల్లడైన అంశాలపై ఇప్పటికీ విశ్వాసం ఉందని స్పష్టం చేసింది. కొత్తగా ఏవైనా సంబంధిత ఆధారాలు అందిస్తే వాటిని పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది.అప్పటి ఆస్ట్రేలియా కోచ్ డారెన్ లెమన్ కూడా ఖవాజా వ్యాఖ్యలతో విభేదించాడు. జట్టులోని ప్రతి ఒక్కరికీ ఈ వ్యవహారం గురించి తెలుసని తాను భావించడం లేదని పేర్కొన్నాడు. మరోవైపు అప్పటి ఆస్ట్రేలియా బౌలర్లు పాట్ కమిన్స్, జోష్ హేజిల్‌వుడ్, మిచెల్ స్టార్క్, నాథన్ లయన్ 2021లో విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో ఈ ప్రణాళిక గురించి తమకు తెలియదని స్పష్టం చేశారు.

# కోహ్లీ ఔటవడంతో గిల్‌కు తప్పిన చిక్కు!


**- గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు**



**స్పోర్ట్స్ డెస్క్:** న్యూజిలాండ్‌తో జరిగిన తొలి వన్డేలో విరాట్ కోహ్లీ 51 బంతుల్లో 74 పరుగులు చేసి ఔటైన విషయం తెలిసిందే. దీనిపై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కోహ్లీ సెంచరీకి చేరువలో ఉండి ఉంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్ ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనేవారని అభిప్రాయపడ్డారు.కోహ్లీ 90లలో ఉండి ఉంటే జట్టు విజయానికి వేగంగా పరుగులు చేయాలా? లేక అతడికి సెంచరీ అవకాశం కల్పించాలా? అనే సందిగ్ధం ఇద్దరికీ ఎదురయ్యేదని గావస్కర్ పేర్కొన్నారు. వేగంగా ఆడి మ్యాచ్ ముగిస్తే అభిమానుల నుంచి విమర్శలు వచ్చే అవకాశం ఉండేదన్నారు. కోహ్లీ ఔటవడంతో గిల్, అయ్యర్‌కు ఆ ఇబ్బంది తప్పిందని తెలిపారు. కోహ్లీ 100 అంతర్జాతీయ సెంచరీలు సాధించాలని ప్రతి భారత అభిమాని కోరుకుంటున్నారని, సహచరుల సహకారంతో ఆ ఘనత సాధిస్తే అభిమానుల అందరికీ ఆనందమే నని గావస్కర్ పేర్కొన్నారు. అయితే వ్యక్తిగత రికార్డు జట్టు విజయావకాశాలను

# వెట్టువమ్ 'సెలబ్రేట్ రెసిలియెన్స్'..

## ఇంటెన్స్ లుక్‌లో శోభిత



రెండు భిన్నమైన వర్గాల మధ్య జరిగే ఆధిపత్య పోరును సహజంగా తెరకెక్కించడంలో దర్శకుడు పా. రంజిత్ రూటే వేరు. ఆయన నుంచి వస్తున్న లేటెస్ట్ భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ వెట్టువమ్. ఆర్య, దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా నుంచి సెలబ్రేట్ రెసిలియెన్స్ పేరుతో మేకర్స్ ఓ మేకింగ్ వీడియోను విడుదల చేశారు. చిన్న గ్లింప్స్‌తోనే సినిమా ఏ రేంజ్‌లో ఉండబోతోందో క్లియర్ కట్ హింట్ ఇచ్చారు. ఈ వీడియోలో చూపించిన మేకింగ్ షాట్స్ ప్రాజెక్ట్ చూస్తుంటే గ్రాండ్ స్కేల్‌లోనే ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతుంది. ఒక పెద్ద విలేజ్ సెట్ నడుమ వందలాది మందితో ప్లాన్ చేసిన భారీ కొట్లాటలు, గాల్లోకి లేచే కార్లు, బ్లాస్టింగ్‌లు చూస్తుంటే ఫుల్ యాక్షన్ డ్రామా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది. పా. రంజిత్ స్వయంగా మైక్ పట్టుకుని సీన్లను లీడ్ చేయడం, దిలీప్ సుబ్బరాయన్ కంపోజ్ చేసిన రియలిస్టిక్ స్టంట్స్ విజువల్స్ లో మంచి ఇంటెన్సిటీ తీసుకొచ్చాయి. వీడియోలో హీరోల లుక్స్ ప్రాజెక్ట్‌పై ఆసక్తిని పెంచుతున్నాయి. గోధుమ రంగు షర్ట్, గాగుల్స్‌తో మాస్ లీడర్‌లా నడిచివచ్చే ఆర్య, మరో సీన్‌లో తెల్లటి దుస్తుల్లో చేతిలో గన్ పట్టుకుని నిలబడే ఫ్రేమ్స్ అదిరిపోయాయి. మరోవైపు గడ్డంతో ఫుల్ రగ్గడ్ అవతారంలో కనిపించిన దినేష్ ఎనర్జీ కూడా చాలా రాగా ఉంది. వీరిద్దరి పాత్రల మధ్య నడిచే క్లాష్ తెరపై అసలైన థ్రిల్ ఇచ్చేలా కనిపిస్తోంది. ఈ గ్లింప్స్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకున్న అంశం శోభితా ధూళిపాళ్ల ప్రెజెన్స్. సాధారణంగా గ్లామరస్ పాత్రల్లో కనిపించే శోభిత, ఇందులో పూర్తి డీగ్లామరైజ్డ్ రగ్గడ్ రోల్‌లో కనిపించి అందరినీ సర్ ప్రైజ్ చేసింది. ఆమె వేసిన మార్షల్ ఆర్ట్స్ ఫైటింగ్ పోజ్, కళ్లలో చూపించిన ఇంటెన్సిటీ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. కథానాయికగానే పరిమితం కాకుండా, ఒక బలమైన పోరాట యోధురాలి తరహా పాత్రను ఎంచుకుని శోభిత తన నటనలోని కొత్త కోణాన్ని చూపిస్తోందనే నమ్మకం కలుగుతోంది.




# పూర్ ఫ్యామిలీకి హఠాత్తుగా డబ్బు సంచులు దొరికితే ..

## ఓటీటీలో 'ఆల్ పాస్' మూవీ!

కొన్ని కథలు వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తూనే వినోదాన్ని పంచుతుంటాయి. సహజత్వానికి దగ్గరగా మానవ స్వభావాలను ఆవిష్కరిస్తూనే ఆలోచింపజేస్తాయి. చాలా కుటుంబాలను దగ్గరగా పరిశీలన చేస్తే ఒక విషయం అర్థమవుతుంది. పేదరికములో ఉన్నప్పుడు వాళ్లంతా చాలా ప్రేమతో ఉంటారు. అనుకోకుండా వాళ్ల మధ్యకి డబ్బు వచ్చిపడినప్పుడు ఆ ప్రేమ కలుషితం అవుతూ ఉంటుంది. ఇందుకు అతీతంగా వ్యవహరించేవారు సంఖ్య చాలా అరుదనే చెప్పాలి. అలాంటి ఒక కథతో రూపొందిన సినిమానే 'ఆల్ పాస్'. తమిళంలో మోహన్ రంగనాథన్ నిర్మించిన ఈ సినిమాకి మైదీన్ దర్శకత్వం వహించాడు. అక్టోబర్ 9వ తేదీన థియేటర్లలో విడుదలైన సినిమా ఇది. దుష్యంత్ జయప్రకాశ్ .. సెంథిల్ కుమారి.. సుబ్రహ్మణ్యం శివ .. జనని కునశీలన్ .. వినోదిని వైద్యనాథన్ ముఖ్యమైన పాత్రలను పోషించారు. జేమ్స్ వసంతన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ నెల 6వ తేదీ నుంచి అందుబాటులోకి వచ్చింది. ఈ కథ చెన్నైలోని ఒక బస్తీలో జరుగుతుంది. ఈ బస్తీలో మూడు కుటుంబాల వారు చాలా కాలంగా నివసిస్తూ ఉంటారు. ఈ పేదరికాన్ని తట్టుకుని నిలబడాలంటే, తామంతా ఉమ్మడి కుటుంబంగా ఉండటమే మార్గమని భావిస్తారు. అంతా కలిసి ఒకే ఇంట్లో ఎంతో ప్రేమగా నివసిస్తూ ఉంటారు. అదే సమయంలో ఊహించని విధంగా వాళ్ల మధ్యలోకి పెద్ద మొత్తంలో డబ్బు వచ్చిపడుతుంది. అప్పటి నుంచి వాళ్లలో ఎలాంటి మార్పు వస్తుంది? వాళ్లతో ఏమేం చేయిస్తుంది? చివరికి వాళ్లు గ్రహించే నిజం ఏమిటి? అనేది కథ.

# అనిరుధ్-కావ్యల పెళ్లి సందడి..

## గ్రీస్‌కు బయల్దేరిన తలైవా, మాజీ సీఎం స్టాలిన్



ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్ వివాహ బంధంతో ఒకటవ్వబోతున్నారు. వీరి వివాహ వేడుక గ్రీస్‌లో డెస్టినేషన్ వెడ్డింగ్‌గా నవంబర్ 10, 11 తేదీల్లో అత్యంత సన్నిహితుల మధ్య జరగనుంది. ఈ వేడుకకు హాజరయ్యేందుకు సూపర్ స్టార్ రజనీకాంత్, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ రోజు ఉదయం విమానాశ్రయం నుంచి గ్రీస్‌కు బయల్దేరి వెళ్లారు. దీంతో ఈ హై–ప్రొఫైల్ వివాహంపై అందరి దృష్టి నెలకొంది.

కావ్య మారన్, ప్రఖ్యాత సన్ గ్రూప్ ఛైర్మన్ కళానిధి మారన్ కుమార్తె. ఆమె ప్రస్తుతం ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవోగా, సన్ టీవీ నెట్‌వర్క్‌లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు అనిరుధ్ రవిచందర్ ప్రస్తుతం దక్షిణాది సినిమా పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుడిగా కొనసాగుతున్నారు. ఎంతోకాలంగా వీరిద్దరి వివాహంపై చర్చలు జరుగుతుండగా, ఇప్పుడు అధికారికంగా పెళ్లి వేడుకలు మొదలయ్యాయి.గ్రీస్‌లో జరిగే ఈ వివాహ వేడుకకు కేవలం ఇరు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరు కానున్నారు. ఇది పూర్తిగా ప్రైవేట్ కార్యక్రమంగా జరగనుంది. అనంతరం నవంబర్ 21న చెన్నైలో సినీ, రాజకీయ, క్రీడా, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖుల కోసం భారీ ఎత్తున రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను కావ్య తల్లిదండ్రులు ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేయడంతో వేడుక తేదీ ఖరారైంది.చెన్నై రిసెప్షన్‌కు పలువురు అగ్రశ్రేణి ప్రముఖులు హాజరుకానున్నట్లు సమాచారం. అయితే, ఈ వివాహ ఏర్పాట్లపై అనిరుధ్, కావ్యల కుటుంబాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సోషల్ మీడియాలో మాత్రం వీరి వివాహానికి సంబంధించిన వార్తలు, ప్రముఖుల ప్రయాణ దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

# ఫెస్టివ్ వైబ్.. ఎలిగెంట్ లుక్ లో మృణాల్ సోయగాలు..



ఫెస్టివల్స్ మొదలయ్యాయి అంటే చాలు సెలబ్రిటీలు అందంగా, సాంప్రదాయంగా ముస్తాబవుతూ అభిమానులకు కన్నుల విందుగా కనిపిస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే దంతేరాస్ సందర్భంగా తెలుగు ప్రేక్షకులను సీతామహాలక్ష్మి పాత్రతో కట్టిపడేసిన మృణాల్ ఠాకూర్ తన అధికారిక ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో ప్రత్యేక వైరల్ గా మారుతున్నాయి. చీరకట్టులో కనిపించి తన ఎలిగెంట్ లుక్కుతో అభిమానులను మెస్మరైజ్ చేసింది. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ సీమ గుజ్రాల్ కలెక్షన్స్ నుండి ఎంపిక చేసిన ఐవరీ కలర్ డిజైనర్ సారీ కట్టుకొని , తన లుక్ తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ జార్జెట్ చీర పై క్లిష్టమైన పైప్లీ ఎంబ్రాయిడరీ డిజైన్ తో రూపొందించారు. మొత్తం అద్దాల పనితనం , పూసల అమరిక చాలా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. దీనికి మ్యాచింగ్ గా స్ట్రాపీ స్లైల్ లో నెక్ లైన్ కలిగిన హెవీ మిర్రర్ వర్క్ బ్లౌజ్ జత చేసింది. ఈ ఔట్ ఫిట్ లో మృణాల్ తన లుక్ ను మరింత రాయల్ గా మార్చడానికి మెడలో మ్యాచింగ్ హెవీ చౌకర్ నెక్లెస్ ధరించి పెద్ద చెవిపోగులతో తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. మొత్తానికైతే దంతేరాస్ స్పెషల్ సందర్భంగా తన లేటెస్ట్ అవుట్ ఫిట్ తో ఎలిగెంట్గా కనిపించి అభిమానుల హృదయాలను దోచుకుంది .అంతేకాదు మిర్రర్ వర్క్ తో డిజైన్ చేసిన శారీలో దీపావళి మొత్తం మీలోనే కనిపిస్తోంది అంటూ నెటిజన్స్ కామెంట్లు చేస్తున్నారు.2012లో ముజ్ సే కుచ్ కెహెతి.. ఏ ఖామోషియాన్ అనే హిందీ సీరియల్ ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. 2014లో విట్టిదండు అనే మరాఠీ చిత్రం ద్వారా నటిగా వెండితెరకు పరిచయమైంది. ఆ తర్వాత హిందీ, తెలుగు చిత్రాలలో నటిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. తెలుగు సినిమా విషయానికొస్తే 2022లో హను రాఘవపూడి దర్శకత్వంలో మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నేరుగా తెలుగులో చేసిన చిత్రం సీతారామం. ఈ చిత్రం ద్వారా వెండితెరకు సీతామహాలక్ష్మి పాత్రతో పరిచయమై అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ సినిమాతో ఏకంగా భారీ బ్లాక్ బాస్టర్ విజయం అందుకోవడంతో వరుసగా అవకాశాలు తలుపు తట్టాయి.ఆ తర్వాత హాయ్ నాన్న, ఫ్యామిలీ స్టార్ వంటి చిత్రాలలో నటించినా.. ఈమె సరైన సక్సెస్ అందుకోలేదు. ఆ తర్వాత డెకాయిట్ చిత్రంలో నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. రీసెంట్ గా పూజ మేరీ జాన్ అనే ఓటిటీ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక ప్రస్తుతం రాకాసినిమాలో నటిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కానీ దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ ఇంకా వెలువడలేదు. ఏది ఏమైనా మృణాల్ ఠాకూర్ ఇప్పుడు భాషతో సంబంధం లేకుండా వరుస భాషా చిత్రాలలో నటిస్తూ తన స్టార్ స్టేటస్ ను మరింత పెంచుకునే ప్రయత్నం చేస్తుంది ఈ ముద్దుగుమ్మ.

# దీపావళి రోజున కుమ్మేసిన 'రామాయణ'



బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్ తో తెరకెక్కిన పౌరాణిక చిత్రం 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. విడుదలైన నాలుగు రోజుల్లోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.500 కోట్ల మార్కుకు చేరువై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ముఖ్యంగా దీపావళి పర్వదినం రోజున ప్రేక్షకుల నుంచి అనూహ్య స్పందన లభించడంతో భారీ వసూళ్లు నమోదయ్యాయి.

దీపావళి, ఆదివారం రెండూ కలిసి రావడంతో సినిమా విడుదలైన నాలుగో రోజున ఒక్కరోజే దేశీయంగా రూ.56.15 కోట్ల నెట్ వసూళ్లను ఈ చిత్రం రాబట్టింది. దీంతో 2023లో సల్మాన్ ఖాన్ చిత్రం 'టైగర్ 3' దీపావళి నాడు సాధించిన రూ.44.50 కోట్ల రికార్డును 'రామాయణ' అధిగమించింది. ఇప్పటివరకు దీపావళి పండుగ రోజున బాలీవుడ్‌లో అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రాల జాబితాలో అగ్రస్థానాన్ని దక్కించుకుంది.ఈ సినిమా భారత్‌లో తొలి రోజు రూ.64.85 కోట్లు, రెండో రోజు రూ.48.05 కోట్లు, మూడో రోజు రూ.69.80 కోట్లు, నాలుగో రోజు రూ.56.15 కోట్ల నెట్ రాబట్టింది. దీంతో దేశవ్యాప్తంగా మొత్తం నెట్ కలెక్షన్లు రూ.238.85 కోట్లకు చేరగా, గ్రాస్ వసూళ్లు రూ.285.20 కోట్లుగా నమోదయ్యాయి. గతంలో ప్రభాస్ నటించిన 'ఆదిపురుష్' తొలి నాలుగు రోజుల్లో సాధించిన రూ.237 కోట్ల నెట్ మార్కును కూడా 'రామాయణ' దాటేసింది. ఇక ఓవర్సీస్‌లో రూ.214 కోట్ల గ్రాస్ రావడంతో, ప్రపంచవ్యాప్తంగా మొత్తం వసూళ్లు రూ.499.20 కోట్లకు చేరుకున్నాయి. దీంతో అతి తక్కువ సమయంలోనే రూ.500 కోట్ల మైలురాయిని అందుకోవడానికి ఈ చిత్రం సిద్ధమైంది.